RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 27.08.2026 | సంపుటి :13 సంచిక : 38 | పేజీలు :12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv





## నేపాల్‌లో..
# మెరుపు వరదలు

ఒక్కసారిగా నది ఉప్పొంగడంతో సంభవించిన మెరుపు వరదలు నేపాల్‌ను అతలాకుతలం చేశాయి. భోటెకోశీ నది బుధవారం ఉదయం ఉధృతంగా ప్రవహించింది నదిలో ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో రసువా జిల్లాలోని పలు గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇళ్లు, ప్రాజెక్టు కేంద్రాలు, వంతెనలు దెబ్బతిన్నాయి.

### భోటెకోశీ నది ఉప్పొంగడంతో పెనువిషాదం
### ఘోర ప్రళయంలో 500 మంది గల్లంతు..
**అందులో 105 మంది భారతీయులు, 37 మంది ప్రవాసభారతీయులు**

- తొలుత భూకంపం సంభవించి, భారీగా కొండచరియలు నదిలో పడటంతో అకస్మాత్తుగా పెరిగిన ప్రవాహం
- నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్

ఖాట్మండు(జనంసాక్షి): ఒక్కసారిగా నది ఉప్పొంగడంతో సంభవించిన మెరుపు వరదలు నేపాల్‌ను అతలాకుతలం చేశాయి. ఈ ప్రకృతి విపత్తులో దాదాపు 500 మంది గల్లంతయ్యారని నేపాల్ అధికారులు వెల్లడించారు. వీరిలో 105 మంది భారతీయ పర్యాటకులు ఉన్నట్లు తెలుస్తోంది. మరో 37 మంది ప్రవాస భారతీయులు ఉన్నారు. గల్లంతయిన వారిలో 93 మంది నేపాల్ మిగతా 2లో..



నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదల ధాటికి బురదలో కూరుకు పోయిన ఇళ్లు, వాహనాలు

# ఒలింపిక్స్‌లో తెలంగాణ సత్తాచాటుతుంది

**పల్లెలు, పట్టణాల నుంచి విశ్వక్రీడల పోడియం వైపు ప్రయాణానికి సిద్ధమవుతోంది**
**పారిస్ ఒలింపిక్స్‌లో కేఎన్ఎస్‌యూ అథ్లెట్లు 16 మందికి పతకాలు : ముఖ్యమంత్రి రేవంత్**
**కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీతో ఎంవోయూ హర్షం వ్యక్తం చేసిన సీఎం**



యంగ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీతో ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి

> పల్లెలు, పట్టణాల నుంచి ఒలింపిక్ పోడియం వైపు ప్రయాణానికి తెలంగాణ సిద్ధమవుతోంది. ప్రపంచంలోని అత్యున్నత క్రీడా ప్రతిభ సంస్థల్లో ఒకటైన కేఎన్ఎస్‌యూతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంవోయూ చేసుకోవడం సంతోషకరం. మన దేశం 2036 ఒలింపిక్స్ వైపు చూస్తున్న సందర్భంలో కేవలం ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా, భారత్ గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను తయారు చేసేందుకు తెలంగాణ సిద్ధమవుతోంది యంగ్ ఇండియా.. స్పోర్టింగ్ ఇండియా..
> - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): పల్లెలు, పట్టణాల నుంచి ఒలింపిక్ పోడియం వైపు ప్రయాణానికి తెలంగాణ సిద్ధమవుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇవాళ యంగ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీతో ఎంవోయూ చేసుకుంది. ఎంవోయూపై హర్షం వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రపంచంలోని అత్యున్నత క్రీడా ప్రతిభ సంస్థల్లో ఒకటైన కేఎన్ఎస్‌యూతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంవోయూ చేసుకోవడం సంతోషకరమని పేర్కొన్నా రు. దక్షిణ కొరియా వెళ్లినప్పుడు కేఎన్ఎస్‌యూ బృందాన్ని కలిసి భాగస్వామ్యంపై చర్చించిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఎంవోయూ తెలంగాణ క్రీడా ప్రతిభకు అథ్లెటిక్ శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, అత్యున్నత స్థాయి విద్య విధానాలకు వారధిగా సీఎం అభివర్ణించారు. పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా 31 పతకాలు సాధించగా అందులో కేఎన్ఎస్‌యూలో శిక్షణ పొందిన అథ్లెట్లు 16 మంది ఉన్నారని ముఖ్య మంత్రి ప్రస్తావించారు. కేఎన్ఎస్‌యూ విశిష్ట సంస్కృతి రాష్ట్రానికి తీసుకురావాలనుకుంటున్నామని తెలిపారు.

**యంగ్ ఇండియా, స్పోర్టింగ్ ఇండియా**

తెలంగాణ రాష్ట్రంలో యువ అథ్లెట్లకు ప్రపంచ స్థాయి క్రీడా సామర్థ్యాలు నేర్చుకునే కొత్త అవకాశాలు సృష్టించేలా ఎంవోయూ చేసుకోవడంలో మిగతా 2లో..



# హైవేపై మృత్యుఘోష..

- కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఆరుగురు మృతి.. 14 మందికి తీవ్ర గాయాలు
- ప్రమాదానికి గురైన కంటైనర్‌ను వెనుకనుంచి ఢీకొట్టిన ప్రైవేటు బస్సు
- మృతుల్లో ఐదుగురు మహిళలు
- ఘటనపై సీఎంలు రేవంత్, చంద్రబాబు దిగ్భ్రాంతి

కోదాడ(జనంసాక్షి): దొరకుంట సమీపంలోని హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున 4.50 గంటల ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డివైడర్‌పై నిలిచి ఉన్న కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంతో జాతీయ రహదారిపై మిగతా 2లో..

# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

**చెట్టును ఢీకొన్న కారు.. ముగ్గురు దుర్మరణం**

**మృతుల్లో నిజామాబాద్ వాసి నవీన్**

నిజామాబాద్,ఆగస్ట్26(జనంసాక్షి) అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మూడు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవు తున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ మిగతా 2లో..

# సుష్మిత వ్యాఖ్యలతో మాకేం సంబంధం?

- కొండా మురళీనోటా అదేమాట
- నా బిడ్డ ప్లాన్–బి ఏంటో నాకు తెలియదు
- తాము కాంగ్రెస్‌ను వీడేదిలేదని స్పష్టీకరణ
- భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ



హైదరాబాద్(జనంసాక్షి): తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త, ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యా రు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. అ నంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. "కొండా సురేఖ అం శం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుష్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ ప్లాన్–ఎ ప్రకారం వ్యాఖ్యలు చేసింది. ప్లాన్–బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి మిగతా 2లో..



## పెట్టుబడులను ఆకర్షించేలా
# ఇన్వెస్ట్ తెలంగాణ

**తెలంగాణ సమ్మిట్ కోసం వార్ రూమ్ • నిపుణులతో కమిటీల ఏర్పాటు**

- దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలతో పెట్టుబడి దారులను ఆకర్షించాలి
- అతిథులకు ఆహ్వానాలు పంపడం ఏమాత్రం ఆలస్యం చేయొద్దు
- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి
- ప్రజాభవన్‌లో మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష

హైదరాబాద్,ఆగస్ట్26(జనంసాక్షి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026–ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో మిగతా 2లో..

# ఢీ అంటే ఢీ..



**అమెరికా, కెనడా మధ్య వాణిజ్య యుద్ధం**
**అగ్రరాజ్యంపై ప్రతీకార కెనెడా సుంకాలు**

కెనడా,ఆగస్ట్26(జనంసాక్షి): అమెరికా, కెనడా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమవుతోంది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించింది. 27.6 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన.. 700లకు పైగా అమెరికా వస్తువులపై టారిఫ్‌లు విధిస్తున్నట్లు ఆ దేశ పరిశ్రమల శాఖ మంత్రి ఫ్రాంకోయిస్–ఫిలిప్ షాంపేన్ ప్రకటించారు. 25 శాతం సుంకాలు ఉన్న వస్తువుల్లో గృహోపకరణాలు, జున్ను వంటి పాల ఉత్పత్తులు, చేపలు, సముద్రపు ఆహారం వంటివి ఉన్నాయి. ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులతో పాటు ఫర్నిచర్, వస్త్రాలకు అత్యధికంగా 50 శాతం సుంకాలు అమల్లోకి రానున్నాయి. మరికొన్ని వస్తువులు, ఉత్పత్తులపై 15, 25 శాతం చొప్పున ప్రతిసుంకాలు విధించింది. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ తాజా ప్రకటన వెలువడింది. అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలతో పాటు, దేశీయ వ్యాపారాలు, కార్మికుల కోసం మిగతా 2లో..



# ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 'టగ్ ఆఫ్ వార్'ను ఎదుర్కొంటోంది

**ఏఎంఎఫ్ క్రిస్టిలినా ఎండీ జార్జివా ఆందోళన**

వాషింగ్టన్(జనంసాక్షి):పశ్చిమాసియా నుంచి వచ్చే ప్రతికూలతలు, ఏఐ రంగానికి లభిస్తోన్న సానుకూల డిమాండ్‌కు మధ్య ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 'టగ్ ఆఫ్ వార్' లాంటి పరిస్థితిని ఎదుర్కొంటోందని మిగతా 2లో..

## అమెరికా బెదిరింపులకు భయపడే
# రోజులు పోయాయి

- ప్రస్తుతం ఇతర దేశాలను శాసించే స్థితిలో లేదు
- ఇరాన్ స్పీకర్ మహ్మద్ బాగేర్ గాలిబఫ్ హెచ్చరిక



టెహ్రాన్,ఆగస్ట్26(జనంసాక్షి): ఇరాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగించే దేశాలపై మరిన్ని ఆంక్షలు విధిస్తామనే అమెరికా హెచ్చరికలపై ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ తీవ్రంగా స్పందించారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ఇతర దేశాలను శాసించే స్థితిలో లేదని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రపంచ దేశాలపై ఒత్తిడి తేచ్చేందుకు అమెరికా పెద్ద పెద్ద హెచ్చరికలు చేస్తుంటుందని, వాటిని ప్రపంచంలోని ఏ దేశాలూ పెద్దగా పట్టించుకోవడం లేదన్నారు. ఆ విషయం అమెరికాకు కూడా తెలుసని ఎద్దేవా చేశారు. ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలు.. తమ వైఖరిని స్పష్టంగా తెలిపాయని గాలిబఫ్ చెప్పారు. ఇటీవల అమెరికా మంత్రి స్కాట్ బెసెంట్ ఇరాన్‌తో ఆర్థిక లావాదేవీలు కొన సాగించే దేశాలు, సంస్థలపై కొత్త ఆంక్షలు విధిస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిం దే. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచే చర్యలకు అమెరికా శ్రీకారం చుట్టింది. అయితే అమెరికా ఒత్తిళ్లకు తాము తలొగ్గ బోమని గాలిబఫ్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఇరాన్– మిగతా 2లో..

# '22ఏ'ను తొలగించకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తాం

**భూకబ్జాలతో హైదరాబాద్‌కు బ్రాండ్‌కు దెబ్బ : హరీశ్**



హైదరాబాద్,ఆగస్ట్26(జనంసాక్షి): కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే మిగతా 2లో..

## ఇరాన్‌పై కొత్తగా దాడులు చేయబోం
విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడి 2లో..

## వీసా ఇంటర్వ్యూల నిలిపివేత
అమెరికా మరో దుందుడుకు చర్య 2లో..

## హెచ్-1బీ ఫీజుల పెంపుతో అమెరికాకే నష్టం
ఇండియన్-అమెరికా అడ్వొకసీ గ్రూప్ ఆందోళన

# ఒలింపిక్స్‌లో తెలంగాణ సత్తాచాటుతుంది

క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, అధికారులు కీలక పాత్ర పోషించారంటూ రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మన దేశం 2036 ఒలింపిక్స్ వైపు చూస్తున్న సందర్భంలో కేవలం ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా, భారత్ గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను తయారు చేసేందుకు తెలంగాణ సిద్ధమవుతోందన్న సీఎం యంగ్ ఇండియా, స్పోర్టింగ్ ఇండియా అంటూ వ్యాఖ్యానించారు.

**అంతర్జాతీయ వేదికల్లో మన ప్రతిభ**

కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం తెలంగాణ క్రీడా రంగానికి చరిత్రాత్మక ముందడుగని క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభివర్ణించారు. ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణను రాష్ట్ర క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మన ప్రతిభకు అంతర్జాతీయ వేదికలు మరింత చేరువ కానున్నాయని వివరించారు

# హెచ్-1బీ ఫీజుల పెంపుతో అమెరికాకే నష్టం

వాషింగ్టన్(జనంసాక్షి):హెచ్-1బీ వీసాలపై అమెరికా ప్రతిపాదించిన అధిక ఫీజులపై ఇండియన్-అమెరికా అడ్వొకసీ గ్రూప్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అసాధారణ ఫీజుల వల్ల చట్టబద్ధమైన నియామకాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. అంతేగాక, అధిక వేతనం ఉండే ఉద్యోగాలు తెలియకుండానే విదేశాలకు తరలిపోతాయని హెచ్చరించింది. ఈ మేరకు ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పొరా స్టడీస్ ఓ ప్రకటనలో పేర్కొంది. "దేశ భద్రతను కాపాడటం, మోసాలను నివారించడంతో పాటు చట్టబద్ధమైన వలసలను ప్రోత్సహించేందుకు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం, సంస్థలకు తగిన వనరులు కల్పించడం అవసరమే. కానీ, హెచ్-1బీ ఫీజును 103,265 డాలర్లకు పెంచడం అంటే.. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్టార్టప్‌లను మరింత కుంగదీయడమే అవుతుంది. అదే సమయంలో వేలాదిగా హెచ్-1బీ ఉద్యోగులను నియమించుకునే కంపెనీలు.. వందల మిలియన్ల డాలర్ల మేర అదనపు ఖర్చులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్పుడు కంపెనీలు అధిక వేతనం ఇచ్చే ఉద్యోగాలను విదేశాలకు మళ్లించేందుకు ఆసక్తి చూపిస్తాయి" అని తన ప్రకటనలో తెలిపింది.

ట్రంప్ సర్కార్ సడన్ షాక్.. వీసా అపాయింట్‌మెంట్లు నిలిపివేత

ఇప్పటికే అమెరికా విద్యాసంస్థల్లో విదేశీ విద్యార్థుల చేరిక తగ్గుతోందని, ఇప్పుడు ఓపీటీ ప్రోగ్రామ్ ఫీజు కూడా లక్ష డాలర్లు చేస్తే మరింత నష్టం కలుగుతుందని ఇండియన్-అమెరికన్ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా కార్మికులను పరిరక్షించడంతో పాటు సాంకేతికతలో అగ్రరాజ్య నాయకత్వాన్ని నిలబెట్టుకోవడం ఏకకాలంలో జరగాలని పిలుపునిచ్చింది. హెచ్-1బీ ఆశావహులకు ట్రంప్ సర్కారు మరో షాకిచ్చేందుకు సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. ఈ వీసా దరఖాస్తులపై కొత్తగా 1,03,265 డాలర్ల రుసుమును ఇటీవల ప్రతిపాదించింది. దీంతో పాటు ఎఫ్-1 ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్‌పైనా కొత్తగా దాదాపు లక్ష డాలర్ల మేర రుసుము విధించే యోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈఏఏఊా స్పందించింది.

# ఇరాన్‌పై కొత్తగా దాడులు చేయబోం

వాషింగ్టన్,ఆగస్ట్26(జనంసాక్షి): పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య పరస్పర దాడులు ప్రస్తుతానికి ఆగినా.. యుద్ధ మేఘాలు మాత్రం తొలగిపోలేదు. ఇరాన్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి వేరుచేసేలా ఆంక్షలు విధించిన అగ్రరాజ్యం తాజాగా కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతానికి ఇరాన్‌పై కొత్తగా దాడులు ఉండవని విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. మిత్రదేశాలకు ఈ విషయాన్ని తెలియజేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఇరాన్ వైపు నుంచి మళ్లీ దాడులు ప్రారంభమయితే అమెరికా సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని తోసిపుచ్చలేమని అధికారులు వెల్లడించారు. దాడులు ఉండవని చెప్పినప్పటికీ.. ఇరాన్ ఓడరేవుల నుంచి నౌకల రాకపోకలను కట్టడిచేసేలా హర్మూజ్‌లో దిగ్బంధాన్ని అమెరికా కొనసాగిస్తోంది. మరోవైపు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ నడ్డివిరిచేలా కొత్త ఆంక్షలతో విరుచుకుపడింది. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట 60 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, పెట్రోలియం, పెట్రో కెమికల్ వాణిజ్యంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ వాటిని ప్రకటించింది. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల లక్ష్యమని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

వాషింగ్టన్,ఆగస్ట26(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇమిగ్రేషన్ విధానాలతో వలసదారుల్ని వణికిస్తున్నారు. తాజాగా అమెరికా ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను అర్ధాంతరంగా నిలిపివేసింది. కొన్ని షెడ్యూల్డ్ ఇంటర్వ్యూలను రద్దు చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో శిక్షణా కార్యక్రమం ప్రారంభమైందని, దానిలో భాగంగానే వీసా అపాయింట్‌మెంట్ల సర్దుబాటు జరుగుతుందని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. ఇప్పటికే ఇంటర్వ్యూలు షెడ్యూల్ అయిన దరఖాస్తుదారులకు రద్దుపై మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రీషెడ్యూలింగ్ సమయం గురించి త్వరలో తెలియజేయనున్నారు. రాయబార కార్యాలయాల్లో నిర్వహిస్తోన్న శిక్షణ కార్యక్రమం దేని గురించి, అది ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై విదేశాంగ శాఖ పూర్తి వివరాలు వెల్లడించలేదు. అయితే.. యూఎస్ ప్రభుత్వ పథకాలపై ఆధారపడే అవకాశం ఉన్న దరఖాస్తుదారులను కాన్సులర్ అధికారులు వడపోసి, తొలగించేలా ఈ శిక్షణా కార్యక్రమం ఉండనున్నట్లు తెలుస్తోంది.

# పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేశారు'..!

ముంబై(జనంసాక్షి):

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గ్రూప్-బి పోస్టుల నియామక ప్రక్రియను మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ రద్దు చేసింది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పరీక్షలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ప్రాథమిక విచారణ అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. ఈ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షల చొప్పున అమ్మేశారని ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపించారు."రాష్ట్రవ్యాప్త ఏజెంట్ల నెట్‌వర్క్ ద్వారా ఒక్కో ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేసినట్లు నాకు సమాచారం అందింది. ఈ విషయం కమిషన్‌కూ తెలుసు. కానీ.. ఒక్క అభ్యర్థికే ఆ ప్రశ్నపత్రం అందినట్లు చెబుతోంది. ఇది కమిషన్ విశ్వసనీయతకు సంబంధించిన అంశం. కమిషన్ ఛైర్మన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి" అని రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. మరోవైపు.. ఈ వ్యవహారంపై తాను సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కలిశానని భాజపా ఎమ్మెల్యే అభిమన్యు పవార్ తెలిపారు. ప్రశ్నపత్రం లీక్‌ను సీఎం తీవ్రంగా పరిగణించారని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు.పరీక్ష నిర్వహణకు ముందే ఒక అభ్యర్థికి ప్రశ్నపత్రం అందినట్లు పోలీసు విచారణలో ప్రాథమికంగా తేలిందని అంతకుముందు ఎంపీఎస్సీ వెల్లడించింది. ఈ అంశం తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న అనంతరం నియామక ప్రక్రియను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఈ పరీక్ష రద్దు.. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న అభ్యర్థులకు దక్కిన విజయంగా కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత విజయ్ వడెట్టీవార్ పేర్కొన్నారు.





# నేపాల్‌లో మెరుపు వరదలు

జాతీయులూ ఉన్నారు.భోటెకోశీ నది బుధవారం ఉదయం ఉద్ధృతంగా ప్రవహించింది నదిలో ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో రసువా జిల్లాలోని పలు గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని నేపాల్ ఆర్మీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇళ్లు, ప్రాజెక్టు కేంద్రాలు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు 46 మంది ప్రాణాలు కోల్పోయారు. 41 మంది భద్రతా సిబ్బంది గల్లంతయ్యారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రభుత్వం అత్యవసర సహా యక చర్యలు చేపడుతోంది. అయితే పర్వత ప్రాం తాలు కావడంతో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి.

**బిహార్, ఉత్తరప్రదేశ్‌కు అడ్వైజరీలు..**

నేపాల్‌కు సరిహద్దులో ఉన్న బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌కు కేంద్రం అడ్వైజరీలు జారీ చేసింది. గండక్ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితి నిశితంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించింది. ప్రకృతి విపత్తు ప్రభావం చైనాను తాకింది. టిబెట్‌లోని చైనా-నేపాల్ సరిహద్దులో కొండచరియలు విరిగిపడటంతో ప్రాణనష్టం సంభవించింది. నివాస ప్రాంతాలకు నష్టం వాటిల్లింది. దీంతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పూర్తిస్థాయి సహాయక చర్యలకు ఆదేశించారు. మరోవైపు, మెరుపు వరదలకు సంబంధించి ముందస్తు వార్నింగ్ ఇవ్వడంలో చైనా విఫలమైందనే ఆరోపణలు నేపాల్‌లో వినిపిస్తున్నాయి.

**నేపాల్ విలయానికి కారణమిదే..**

నేపాల్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. ప్రకృతి ప్రకోపానికి రసువా జిల్లాలో భోటెకోశీ నది ఉగ్రరూపం దాల్చడంతో భారతీయులు సహా వందలాది మంది గల్లంతయ్యారు. అనేక భవనాలు, వాహనాలు కొట్టుకుపోయాయి. బురదలో అనేక మంది కూరుకుపోయినట్లు అంచనా వేస్తున్నారు. అయితే, భూకంపం ఆపై కొండచరియలు విరిగిపడటంతోనే భోటెకోశీ నది ప్రళయానికి కారణమని నేపాల్ విదేశాంగ శాఖ వెల్లడించింది. "బుధవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో భూకంపం వచ్చింది. దాని కారణంగా భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. నది ప్రవాహానికి అడ్డుపడడం ఆకస్మిక వరదలకు కారణమైనట్లు తెలుస్తోంది" అని విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టామని, పొరుగు దేశాల సహకారం తీసుకుంటున్నామని అన్నారు.

**నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్**

వరదల కారణంగా ప్రాణనష్టం సంభవించడంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. మానవతాసాయం అందించడంతోపాటు రెస్క్యూ ఆపరేషన్‌లో తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆపద కాలంలో నేపాల్‌కు యావత్ భారత ప్రజలు తోడుగా ఉంటారని భరోసా ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు ఆపన్నహస్తం అందించేందుకు భారత్ ఏర్పాట్లు మొదలుపెట్టింది. వాయుసేన విమానాల ద్వారా సహాయక సామగ్రి తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నిత్యావసర సరుకులు, ఔషధాలు పంపిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను తరలించే యోచనలో ఉన్నట్లు సమాచారం.

# సుష్మిత వ్యాఖ్యలతో మాకేంసంబంధం?

సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను" అని కొండా మురళి వ్యాఖ్యానించారు.

**క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే ఫైనల్: రాజగోపాల్‌రెడ్డి**

తన నియోజకవర్గ బిల్లుల కోసమే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసినట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అప్పటికే ప్రజాభవన్‌లో కొండా మురళి ఉన్నట్లు తెలిపారు. దీంతో ఆయన్ను కలిసి మాట్లాడినట్లు రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తాను సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. కొండా సురేఖపై క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం చెప్పినదే తన అభిప్రాయమన్నారు.

# పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ

ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్ఠం చేయాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్‌లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడి దారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే పక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయా ణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరి గింది.



ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తు న్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 'టగ్ ఆఫ్ వార్'ను ఎదుర్కొంటోంది

ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ ఎండీ క్రిస్టిలినా జార్జివా తెలిపారు. పశ్చిమాసియాలోని పరిణామాలతో చమురు సరఫరాకు ఎదురైన ఇబ్బందులను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే మెరుగ్గానే ఎదుర్కొందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే సమయంలో కృత్రిమ మేధ రంగంలో పెరుగుతోన్న పెట్టుబడులు ప్రపంచ వృద్ధికి ఊతమిస్తున్నాయని చెప్పారు. హర్మూజ్ జలసంధి మూసివేతతో ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని.. గల్ఫ్ ప్రాంతాల నుంచి సరఫరా పెరగడం వంటి అంశాలు కొంతమేర తగ్గించాయని వివరించారు.అమెరికాలో మొదలైన ఏఐ పెట్టుబడుల జోరు ఇప్పుడు ఇతర దేశాలకూ విస్తరిస్తోందని ఆమె చెప్పారు. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం ఎక్కువై.. కేంద్ర బ్యాంకులు కఠిన విధానాలను కొనసాగించవచ్చని వివరించారు.

# కుటుంబ కలహాలతో ఒకే కుటుంబంలోని ఆరుగురి ఆత్మహత్య

బెంగుళూరు(జనంసాక్షి):

కుటుంబ కలహాల నేపథ్యంలో.. బతుకు భారమై.. ఒకే కుటుంబంలోని ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కర్ణాటకలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదర్శనగర్ పీఎస్ పరిధిలోని విజయపుర సమీపంలో ఉన్న భూతనాల చెరువులో మృతదేహాలు కనిపించడంతో బుధవారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు చెరువులో తేలియాడుతున్న మృతదేహాలను బయటకు తీసి వివరాలు సేకరించారు.మృతులను శోభా జాలగెరి (45), కుమార్తెలు విద్య (16), సువర్ణ (14), శానిక (7), కుమారులు గౌడేష్ (10), వికాస్ (5)లుగా గుర్తించారు. కుటుంబ సభ్యులు కనిపించడం లేదని మృతురాలు శోభా భర్త భీమరాయ.. ఆదర్శనగర పోలీస్ స్టేషన్‌లో ఈనెల 24న ఫిర్యాదు చేశారు. అదే రోజు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భీమరాయ మద్యానికి బానిసవడం, కుటుంబ పోషణ భారం కావడంతో శోభ అతనితో ఘర్షణపడి పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయిందని పోలీసులు తెలిపారు. తాము ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించి మరీ వెళ్లిపోయిందని చెప్పాడు. సోమవారం ఇంటి నుంచి వెళ్లిన వారు బుధవారం ఉదయం చెరువులో విగత జీవులుగా కనిపించారన్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఢీ అంటే ఢీ..

కెనడా 7.5 బిలియన్ కెనడియన్ డాలర్లతో సహాయ ప్యాకేజీని ప్రకటించింది. 'అమెరికా ప్రతిపాదించిన కొత్త నిబంధనలు కెనడా ప్రయోజనాలకు అనుకూలంగా లేవు. కెనడా నుంచి ఎక్కువ ఆశిస్తున్న అగ్రరాజ్యం.. ప్రతిఫలంగా మాకు చాలా తక్కువ వనరులను ఇస్తోంది. అందువల్లే మా కార్మికులు, వ్యాపారాలు, వ్యూహాత్మక రంగాలు.. జాతీయ ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండేందుకు ఆ దేశంతో చర్చలు నిలివేశాం' అని కెనడా ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కెనడా దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటోందని మరోవైపు అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్ హౌస్ ఆరోపించింది. తాజా సుంకాలతో ట్రంప్ దాని దోపిడీకి ముగింపు పలికారని తెలిపింది. వివక్షపూరితమైన ఆ దేశ వాణిజ్య పద్ధతులను ఇకపై తాము అంగీకరించబోమని స్పష్టం చేసింది. 'చర్చల సమయంలో ఉక్కు, అల్యూమినియం, కలప ఇతర వస్తువులపై భారీ తగ్గింపులు చేపట్టడానికి హామీ ఇచ్చాం. ప్రపంచంలోని ఏ దేశానికీ ఇవ్వని ప్రాధాన్యతను కెనడాకు ఇచ్చాం. అయినప్పటికీ ఒప్పందం నుంచి వైదొలిగారు. చర్చలకు బదులుగా ప్రతీకారాన్ని ఎంచుకున్నారని పేర్కొంది.

# అమెరికా బెదిరింపులకు భయపడే రోజులు పోయాయి

అమెరికా మధ్య ఆర్థిక, దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# హైవేపై మృత్యుఘోష..



కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**అసలేం జరిగింది?**

తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ప్రమాదానికి గురైన కంటైనర్ డివైడర్‌పై నిలిచి ఉండగా, దాన్ని గమనించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి కంటైనర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి కంటైనర్‌లో ఉన్న ఇనుప రాడ్లు బస్సులోకి దూసుకెళ్లడంతో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో కొందరు అందులో చిక్కుకుపోయారు. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

మృతులంతా ఏపీ వాసులే.

ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురూ ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. ఎన్టీఆర్ జిల్లా పడమటి లంకపల్లికి చెందిన చెన్నకేశవులు నాగేంద్రబాబు, ఊట్కూరు మండలం తెల్లప్రోలు గ్రామానికి చెందిన యాసారపు చిన్ని, విజయవాడకు చెందిన బేలిపోగు మేరీ కృష్ణ, కొండూరు భావన వర్ష, సురవరపు షకీనా, పిడికిటి లక్ష్మి తేజగా గుర్తించారు. పిడికిటి లక్ష్మి తేజ ఫొటోను కుటుంబ సభ్యులు ఇవ్వడానికి నిరాకరించారు.

**సీఎం రేవంత్‌రెడ్డిగ్ర్భ్రాంతి..**

కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగ్ర్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిగ్ర్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

బస్సు ప్రమాద ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి

సూర్యాపేట జిల్లాలోని కోదాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలను అధికారుల ద్వారా పవన్ తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర అధికారులతో ఏపీ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా అన్ని బస్సుల యాజమాన్యం, డ్రైవర్లు వ్యవహరించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.ఈ బస్సు ప్రమాదంపై ఏలూరు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. డీసీఎం కంటైనర్‌ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో ఆరుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నుంచి ఏలూరు వస్తుండగా ఈ బస్సు ప్రమాదానికి గురైంది.

# '22ఏ'ను తొలగించకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తాం

సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22-ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమిషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22-ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22-ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్‌ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్‌ఆర్‌ఎస్‌ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్ లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసి పోయిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు. 98 శాతం భూములను తీసేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నాడని అన్నారు. సెక్షన్ 22 ఏ కారణంగా చాలామందికి లోన్లు రాలేదని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు బాధపడాలని ప్రశ్నించారు.

# కోడెల మృతి కారకులపై చర్యలు

**గోశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేములవాడ, ఆగస్ట్26 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ తిప్పాపూర్ గోశాలలో ఐదు కోడెలు మృతి చెందాయి. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. గోశాల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గోశాలలో కోడెల సంరక్షణ, నిర్వహణపై అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో తిప్పాపూర్ గోశాలను బుధవారం ఆది శ్రీనివాస్ సందర్శించారు. గోశాలలో పరిస్థితులను పరిశీలించి, కోడెలకు అందుతున్న సంరక్షణ, ఆహారం, వైద్య సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా గోశాల నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో 40 ఎకరాల్లో ఆధునిక గోశాల నిర్మించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న కోడెల సంఖ్యకు అనుగుణంగా గోశాల సామర్థ్యాన్ని పెంచుతున్నామని తెలిపారు. అవసరమైన మేరకు కోడెలను ఇతర ప్రాంతాలకు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు సమర్పించే నిజ కోడెలను గోశాలకు తీసుకువచ్చిన వెంటనే ప్రత్యేకంగా క్వారంటైన్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా వచ్చే కోడెల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన తర్వాతే వాటిని ఇతర కోడెలతో కలపాలని సూచించారు. దీనివల్ల వ్యాధుల వ్యాప్తిని అరికట్టే అవకాశం ఉంటుందని ఆది శ్రీనివాస్ తెలిపారు. అలాగే, పాలు మానేసిన కోడెలను మాత్రమే భక్తులు స్వామివారికి సమర్పించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. గోశాలలో కోడెలకు మెరుగైన సంరక్షణ అందించడంతో పాటు భక్తుల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. దు కోడెల మృతికి గల కారణాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# కీలక ఖనిజాల వైపు సింగరేణి పరుగులు

- నైనీ స్ఫూర్తితో.. దేవదుర్గపై ఫోకస్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కీలక ఖనిజాల వైపు సింగరేణి పరుగులు పెడుతోందని, నైనీ స్ఫూర్తితో దేవదుర్గపై ఫోకస్ పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కర్ణాటకలోని దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కర్ణాటకలో సింగరేణి దక్కించుకున్న దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. ఖనిజ అన్వేషణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల్లో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారాన్ని తీసుకుంటామని ఆయన చెప్పారు. దేవదుర్గ ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా బొగ్గు నుంచి కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోకి సింగరేణి విస్తరణకు బలమైన పునాది పడుతుందని ఆయన చెప్పారు. మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి ఇకపై బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగాల్లోకి విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణకు గుండెకాయలాంటి ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని మరింత లాభదాయకంగా తీర్చిదిద్ది, భవిష్యత్ తరాలకు బలమైన సంస్థగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

### దేవదుర్గపై ప్రత్యేక దృష్టి

దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో ఇప్పటి వరకు చేపట్టిన పనులు, భౌగోళిక పరిస్థితులు, ఖనిజ నిక్షేపాల అన్వేషణకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ఉప ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారుల బృందంతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నారు. ఖనిజ అన్వేషణ వేగవంతానికి అవసరమైన సహకారంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. కీలక ఖనిజాల రంగంలో సింగరేణి విస్తరణకు దేవదుర్గ బ్లాక్‌ను ఒక కీలక అవకాశంగా మలచాలని అధికారులకు సూచించారు.

### అన్ని ఖనిజ వేలాల్లో పాల్గొనాలి

దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ సింగరేణి తన కార్యకలాపాలను విస్తరించాలని భట్టి విక్రమార్క సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే బొగ్గు, కీలక ఖనిజాల వేలం ప్రక్రియలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, సింగరేణికి అనుకూలమైన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. సింగరేణి ఇకపై కేవలం బొగ్గు మైనింగ్‌కే పరిమితం కాకుండా ఇతర ఖనిజాల మైనింగ్‌లోనూ తనదైన ముద్ర వేయాలని పేర్కొన్నారు. త్వరలో వనాడియం, టైటానియం వంటి కీలక ఖనిజ బ్లాక్‌లు వేలానికి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిని దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని సూచించారు. ఇందుకు అవసరమైన అన్ని విధాల సహకారాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, పారిశ్రామిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల మైనింగ్ వైపు సింగరేణి అడుగులు వేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో ఈ ఖనిజాలకు పెరగనున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త అవకాశాలను గుర్తించాలని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఖనిజ అవకాశాలను అధ్యయనం చేసేందుకు దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ తదితర దేశాల్లోని అవకాశాల పరిశీలనకు అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు తెలిపారు. అంతర్జాతీయంగా అందుబాటులోకి వచ్చే అవకాశాలను పరిశీలించి సింగరేణికి ప్రయోజనకరమైన ప్రాజెక్టులపై ముందడుగు వేయాలని సూచించారు.

### డిమాండ్‌కు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తి

ఒకవైపు కీలక ఖనిజాల రంగంలో విస్తరిస్తూనే మరోవైపు సంస్థ ప్రధాన కార్యకలాపమైన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, ఇంధన భద్రతకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని, ఈ విషయంలో సింగరేణి కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తిలో అనుభవాన్ని ఉపయోగించుకుంటూనే, కీలక ఖనిజాల రంగంలోనూ సింగరేణిని దేశంలో అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# టీయూలో ఘనంగా తీజ్ నిమజ్జన వేడుకలు



**డిచ్‌పల్లి (జనంసాక్షి) :** తెలంగాణ విశ్వవిద్యాలయంలో తీజ్ నిమజ్జనం వేడుకలు ఘనంగా జరిగాయి. అదే సందర్భంలో తీజ్ పండుగ ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు సందర్భంగా నవధాన్యాలు, గోధుమలకు నీళ్లు పోశారు. బంజారా ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్, భవాని మాత భోగ్ భండార్ నిర్వహించారు. బంజారా సాంప్రదాయాలు సంస్కృతిని తెలియజేస్తూ నృత్యాలు, ప్రసంగాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బంజారా ప్రొఫెసర్లు, టీచింగ్ స్టాప్స్, నాన్ టీచింగ్ స్టాప్స్, విద్యార్థిని విద్యార్థులు, టీయూ ప్రొఫెసర్లు, ఎంప్లాయీస్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేయాలి

- దేశీయ సాంకేతికత మరింత అభివృద్ధి
- పెట్రోలియం, సహజవాయువు శాఖ అధ్యయన యాత్రలో ఎంపీ వద్దిరాజు



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** పరిశోధనా సంస్థలు పరిశ్రమలు కలిసి పని చేయడం ద్వారా దేశీయ సాంకేతికత మరింతగా అభివృద్ధి చెందడంతో పాటు కొత్త మేధో సంపత్తి,పేటెంట్లు, వాణిజ్య స్థాయి ఉత్పత్తి అవకాశాలు సృష్టించవచ్చని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం చమురు సంస్థల అధికారులు,వివిధ బ్యాంకుల ప్రతినిధులతో చెన్నైలో సమావేశమైంది. సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై జరిగిన చర్చలో ఎంపీ రవిచంద్ర పాల్గొని తన అభిప్రాయాలు వెల్లడించారు. వివిధ రంగాలలో ఇథనాల్ మిశ్రమం ప్రభావంపై పెట్రోలియం, సహజవాయువు శాఖ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)అధికారులతో స్థాయీ సంఘం సభ్యులు చర్చించారు. అలాగే,సతాట్ పథకం కింద ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై సమావేశంలో చర్చ జరిగింది. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన రుణ సౌకర్యాల విస్తరణపై పెట్రోలియం, సహజవాయువు, ఆర్థిక శాఖల అధికారులు, ఓఎన్జీసీ,స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్ మెంట్,కెనరా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల ప్రతినిధులతో స్థాయీ సంఘం చర్చించింది. సమావేశంలో ఎంపీ రవిచంద్ర పలు సూచనలు చేశారు. సలహాలిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు ఎంపీ వద్దిరాజుకు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించారు.

# గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం

- 4 కోట్ల 46 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- వ్యవసాయ మార్కెట్ యార్డుల అభివృద్ధికి 3 కోట్ల 11 లక్షల రూపాయలు
- శివాపూర్, గోగుపల్లిలో కోటి 35 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభం
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, ఆగష్టు 26(జనంసాక్షి) : గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో 4 కోట్ల 46 లక్షల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తాడ్వాయి వ్యవసాయ మార్కెట్ యార్డులో 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం సీఆర్ఆర్-ప్లెయిన్ 2025-26 నిధులతో ఏటూరు నాగారం మండలం శివాపూర్ గ్రామంలో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు, సీసీ డ్రైన్లను ప్రారంభించారు. శివాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోగుపల్లిలో 55 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం ఏటూరునాగారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ నిధులు 2 కోట్ల 28 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణంతోపాటు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో వసతుల కల్పనకు అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కుక్కల బాధకు రంగునీళ్ల సీసాలు

- వేములవాడలో ప్రజల వినూత్న ప్రయోగం

**వేములవాడ, ఆగస్ట్26 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గాంధీ నగర్ వీధిలో ఏ ఇంటి ముందు చూసిన రంగు నీళ్ల డబ్బాలే దర్శనమిస్తున్నాయి. ఇదేమిటి అబ్బా అని అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే వీధి కుక్కల బాధ నుండి తప్పించుకునేందుకు రంగు నీళ్ల డబ్బాతో వినూత్న ప్రయత్నానికి దిగినట్లుగా తెలిసింది. అయితే వీధి కుక్కలు కాలనీలో విచ్చలవిడిగా తిరుగుతూ ఇంటి ముందున్న చిన్నారులను వృద్ధులను గాయపరచడమే కాకుండా ఇంట్లోకి చొచ్చుకు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు ఈ రంగు నీళ్ల డబ్బా పెట్టడంతో ఇంటి వైపు కుక్కలు రావడం లేదని ప్రస్తుతం ప్రశాంతంగా ఉంటున్నామని కాలనీవాసులు వెల్లడించారు. శునకాల బాధకు రంగు నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడగా ప్రతి ఇంటి ముందు రంగు నీళ్ల డబ్బా దర్శనం ఇస్తోంది.

# డాక్టర్ బాలుకు వాసవి నవరత్న అవార్డు

**కామారెడ్డి, ఆగస్టు 26 (జనంసాక్షి) :** రక్తదాన సేవల్లో విశేష కృషి చేస్తున్న కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ బాలుకు "వాసవి నవరత్న అవార్డు"ను ప్రముఖ సామాజిక సేవకులు గంజి రాజమౌళి గుప్త అందజేశారు. డాక్టర్ బాలు 2007 సంవత్సరం నుంచి నిరంతరం రక్తదాన కార్యక్రమాలను నిర్వహిస్తూ, తాను వ్యక్తిగతంగా 84 సార్లు రక్తదానం చేయడంతో పాటు, తలసేమియా బాధిత చిన్నారుల కోసం సుమారు 6,000 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. అలాగే ఇప్పటివరకు 25 వేల యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించి, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న అనేకమందికి సకాలంలో రక్తాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారు.

# కళ్ల ముందే నా భార్య చనిపోయింది

- డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం అంటూ ప్రయాణికుల రోదన

**సూర్యాపేట, ఆగస్ట్26 (జనంసాక్షి) :** తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదం గురించి బస్సులో ప్రయాణిస్తూ.. తృటిలో ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికుడు చెప్పిన మాటలు వింటే కన్నీళ్లు రాక మానవు. హైదరాబాద్ నుండి ఏలూరు వెళ్తుండగా కోదాడ మండలం దుర్గాపురం స్టేజి వద్ద ఈ ప్రమాదం జరిగింది. టీ బ్రేక్ తీసుకున్న అనంతరం బస్సు తిరిగి ప్రారంభమైన గంటలోపే ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగినట్లు బస్సులో ప్రయాణిస్తున్న ఓ క్షతగాత్రుడు చెప్పాడు. వెనుక సీట్లో తన భార్య కూర్చుందని, ప్రమాదంలో ఆమె మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే ముందు సీట్లలో కూర్చున్న ప్రయాణికులు కూడా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారన్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని క్షతగాత్రుడు ఆరోపిస్తున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే పెద్దపెద్ద ఇనుప రాడ్లు బస్సులోని ప్రయాణికులపై పడటంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయని, ఆ గాయాల కారణంగానే కొంతమంది ప్రాణాలు కోల్పోయారని చెప్పాడు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ఆరుగురి ప్రాణాలను బలితీసుకుందని ప్రయాణికులు చెబుతున్నారు. అప్పటికే ప్రమాదానికి గురై రోడ్డుపై ఆగిపోయిన లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన తర్వాత లారీ రోడ్డుపైనే ఆగిపోవడం, ఆ లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ గుర్తించకపోవడం వల్లే ప్రాణనష్టం జరిగిందన్నా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ప్రమాదంలో ఆరుగురు ఆసుపత్రికి చేరుకునేలోపే మృతి చెందారని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. మరో 14 మంది తీవ్ర గాయాలతో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు ఆసుపత్రికి వచ్చిన క్షతగాత్రులకు తల, ఛాతి, కడుపు భాగాల్లో తీవ్ర గాయాలైనట్లు చెబుతున్నారు. బలమైన ఇనుప రాడ్లపై పడటం వల్లే పలువురికి తీవ్ర గాయాలయ్యాయన్నారు.

# రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగికి డిజిటల్ అరెస్టు

- ఆధార్ వివరాలతో రూ.2.50 కోట్ల మోసం
- సకాలంలో స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు



**హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** 'డిజిటల్ అరెస్ట్' పేరుతో 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎన్ఐఏ అధికారినంటూ గుర్తుతెలియని వ్యక్తి బాధితుడికి ఫోన్ చేశాడు. ఆయన ఆధార్ వివరాలతో రూ.2.50 కోట్ల మోసం జరిగిందని రిటైర్డ్ ఉద్యోగిని నిందితుడు భయపెట్టాడు. అనంతరం ఈ కేసు నుంచి బయట పడేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెరిఫికేషన్ పేరుతో నమ్మించి.. తన బ్యాంక్ ఖాతాలో రూ.85.20 లక్షలు జమ చేయాలని బాధితుడికి సైబర్ కేటుగాడు సూచించాడు. నిందితుడి మాటలు నమ్మిన బాధితుడు ఆ మొత్తాన్ని అతను సూచించిన ఖాతాలో జమ చేశాడు. మరో రూ.42 లక్షలు చెల్లించాలని నిందితుడు డిమాండ్ చేయడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. దీంతో సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన రిటైర్డ్ ఉద్యోగి.. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తెలంగాణ సైబర్ పోలీసులు.. కోయంబత్తూరులోని ఐడీఎఫ్‌సి బ్యాంక్ బ్రాంచ్‌లో నిందితుడి ఖాతాను గుర్తించి, అందులో ఉన్న రూ.85.20 లక్షలను ఫ్రీజ్ చేశారు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలంగాణ సిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.

# పటేల్ పట్వారీ విధానంతో భూసమస్యలు తక్కువే

- బిఆర్ఎస్ ధరణితో దోపిడీ మొదలు పెట్టింది
- ప్రభుత్వ సలహాదారు విహెచ్ విమర్శలు



**హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** గతంలో పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. గతంలో భూ సమస్యలు అంతగా వచ్చేవి కావన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకొచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని హనుమంతరావు సూచించారు. ఈ మేరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు. ఈరోజు ముఖాముఖీ కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారని వీహెచ్ అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యమని.. భారత దేశంలో కాదన్నారు. ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని.. అందుకే భారత్‌ను అమెరికాలా చేయాలని మోదీ చూస్తున్నారని అన్నారు. భారత్ సెక్యులర్ దేశమని.. ఇక్కడ వన్ నేషన్ వన్ ఎలక్షన్ సాధ్యం కాదని చెప్పారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాల ఉన్నాయన్నారు. కేంద్రం చేస్తున్న క్యాస్ట్ సెన్స్, కులగణనలో బీసీల కాలమే లేదని తెలిపారు. అలాంటిది వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎక్కడిదని ప్రశ్నించారు. 70 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ముందు బీసీల సంగతి తేల్చాలన్నారు. 'మేము వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. కులగణన పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్లకు, ఈసీ లెక్కలకు తేడా ఉందని వీహెచ్ పేర్కొన్నారు.

## ఇస్రోను బలహీనపరిచే
# ప్రైవేటీకరణ వద్దు

*జాతి గర్వకారణమైన సంస్థను వాణిజ్యీకరణ పేరుతో క్రమంగా బలహీనపరచడం సమర్థనీయం కాదు*

సంపాదకీయం

చంద్రయాన్ నుంచి మంగళయాన్ వరకు ప్రపంచాన్ని అబ్బురపరిచిన భారత అంతరిక్ష ప్రయాణం వెనుక ఉన్న అసలు శక్తి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో). పరిమిత వనరులతో ప్రపంచ స్థాయి సాంకేతిక సామర్థ్యాన్ని నిర్మించుకున్న ఇస్రో కేవలం ఒక ప్రభుత్వ సంస్థ కాదు. అది భారత వ్యూహాత్మక సామర్థ్యం, సాంకేతిక స్వావలంబన, జాతీయ భద్రతకు కీలకమైన వ్యవస్థ.

అందుకే ఇస్రో కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రక్రియపై జైరాం రమేష్ లేవనెత్తిన ప్రశ్నలను కేవలం రాజకీయ విమర్శగా కొట్టిపారేయలేం. అసలు ప్రశ్న ఒక్కటే-ఇస్రోను ఆధునీకరి స్తున్నామా? లేక దాని ప్రధాన సాంకేతిక సామర్థ్యాన్ని క్రమంగా బయటకు అప్పగిస్తున్నామా?

'వాణిజ్యీకరణ' అనే అందమైన పదం వినడానికి ఆకర్షణీయంగా ఉంటుంది. కానీ పేరును మార్చినంత మాత్రాన విధానంలోని ప్రమాదాలు మాయమవ్వవు. ప్రజాధనంతో దశాబ్దాలుగా అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు, నిపుణుల అనుభవాన్ని ప్రైవేట్ రంగానికి బదిలీ చేస్తే, దాని దీర్ఘకాలిక పరిణామాలపై దేశం ప్రశ్నించాల్సిందే.

ప్రైవేట్ రంగానికి అవకాశాలు ఇవ్వడాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ పోటీ, జవాబుదారీతనం, భద్రత, పారదర్శకతకు స్పష్టమైన హద్దులు ఉండాలి. ముఖ్యంగా రాకెట్ తయారీ, ప్రయోగ వాహనాలు, రక్షణ రంగానికి సంబంధించిన అంతరిక్ష వ్యవస్థలు వంటి వ్యూహాత్మక రంగాల్లో లాభాపేక్ష కంటే జాతీయ ప్రయోజనానికే ప్రాధాన్యం ఉండాలి.

ప్రభుత్వ వాదన ప్రకారం ప్రైవేట్ భాగస్వామ్యంతో ఇస్రో సాధారణ ఉత్పత్తి పనుల నుంచి బయటపడి, లోతైన అంతరిక్ష పరిశోధనలు, మానవ సహిత అంతరిక్ష యాత్రలు, అత్యాధునిక పరిశోధనలపై దృష్టి పెట్టగలదు. వినడానికి ఇది మంచి సంస్కరణ విధానంగానే కనిపిస్తుంది. కానీ అమెరికాలోని నాసా-స్పేస్ఎక్స్ నమూనాను చూపించడం మాత్రమే సరిపోదు. అక్కడ ఉన్న నియంత్రణ వ్యవస్థ, పోటీ వాతావరణం, సంస్థాగత పర్యవేక్షణ భారత పరిస్థితుల్లో కూడా అదే స్థాయిలో ఉన్నాయా? అన్నదే అసలు ప్రశ్న.

ఇస్రో తన సాంకేతిక సామర్థ్యాన్ని ప్రైవేట్ రంగంతో పంచుకోవచ్చు. కానీ సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి, వ్యూహాత్మక నియంత్రణకు మధ్య ఉన్న గీత చెరిగిపోకూడదు. ఉత్పత్తి సామర్థ్యం పెంచాలనే పేరుతో రేపు పీఎస్ఎల్వీ, ఎల్వీఎం-3 వంటి కీలక వ్యవస్థలపైనా ప్రభుత్వ సంస్థ నియంత్రణ తగ్గితే, ఇస్రో తన అసలు స్వరూపాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది ప్రైవేట్ రంగానికి వ్యతిరేకమైన వాదన కాదు. ఇది వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి అనుకూలమైన వాదన.

ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ ఇప్పుడు ఒక సాంకేతిక శక్తిగా ఎదుగుతోంది. ఈ స్థాయికి తీసుకొచ్చిన సంస్థను కేవలం ఖర్చు తగ్గింపు, వాణిజ్య సామర్థ్యం లెక్కలతో చూడటం ప్రమాదకరం. ఒక రాకెట్ విఫలమైతే డబ్బు నష్టం మాత్రమే కావచ్చు. కానీ ఒక వ్యూహాత్మక అంతరిక్ష సామర్థ్యం బలహీనపడితే దాని మూల్యం తరతరాలు చెల్లించాల్సి రావచ్చు. అందుకే జైరాం రమేష్ లేవనెత్తిన ప్రశ్నకు ప్రభుత్వం రాజకీయ సమాధానం కాకుండా విధానపరమైన సమాధానం ఇవ్వాలి.

ఏ కార్యకలాపాలు ప్రైవేట్ రంగానికి? ఏ కార్యకలాపాలు ఇస్రో ఆధీనంలో?

సాంకేతిక పరిజ్ఞానం యాజమాన్యం ఎవరిది?వ్యూహాత్మక నియంత్రణ ఎవరిది?

జవాబుదారీతనం ఎవరిది?

ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకుండా వాణిజ్యీకరణ పేరుతో ముందుకు వెళ్లడం సరైంది కాదు. ఇస్రోను ప్రైవేట్ రంగానికి అప్పగించడం సంస్కరణ కాదు. ఇస్రో సామర్థ్యాన్ని పెంచుతూ, దాని వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడటమే అసలైన సంస్కరణ.

జాతి గర్వకారణమైన సంస్థను బయటి సంస్థలకు అప్పగించడం కాదు-బలోపేతం చేయాలి. బలహీనపరచడం కాదు-అభివృద్ధి చేయాలి. వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం చేయడం కాదు-దేశ ప్రయోజనాలకు మరింత శక్తివంతం చేయాలి. ఇస్రో దేశ ఆస్తి. దాని భవిష్యత్తును ప్రైవేట్ సంస్థల లాభనష్టాల పట్టిక నిర్ణయించకూడదు. జాతీయ ప్రయోజనమే నిర్ణయించాలి.

# మిడిల్ ఈస్ట్ మృత్యు రాజధాని

## నెతన్యాహు యుద్ధ నేరాలకు స్వదేశంలో ప్రజల తిరుగుబాటు



తెల్ అవీవ్ వీధుల్లో "నెతన్యాహును జైలుకు పంపాలి" అంటూ వేలాది ఇజ్రాయెలీల నిరసన కేవలం రాజకీయ వైఫల్యంపైనే కాదు. అది ఒక నాయకుడు చేసిన మానవతా విరుద్ధ చర్యల పరాకాష్టకు ప్రతిబింబం. ఇజ్రాయెల్ యొక్క ఈ దాడులు 72,757 మందికి పైగా పాలస్తీనియన్ల ప్రాణాలను బలిగొన్నాయి. ఏడాది పాటు సాగిన ఈ హింసాకాండలో స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, సామాన్య ప్రజలు అనే తేడా లేకుండా లక్ష్యమయ్యారు. ఇది యుద్ధం కాదు, ఇది జాతి నిర్మూలన (జినోసైడ్) కు నిదర్శనం.

**మృత్యువు కౌగిట్లోకి నలిగిపోతున్న గాజా శిశువులు:**
2025 అక్టోబరులో కాల్పుల విరమణ ప్రకటించినా, గాజాలో బాల మరణాలు ఆగలేదు. 2026 వరకు సైతం ఏడాది పొడవునా రోజుకు సగటున ఒక పిల్లవాడు చనిపోయాడని యునిసెఫ్ నివేదిక హెచ్చరిస్తోంది. 2025 అక్టోబర్ నుంచి 2026 ఏప్రిల్ వరకు మాత్రమే 214 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. 13, 15 ఏళ్ళ బాలురు కట్టెలు ఏరుకునే క్రమంలో డ్రోన్ దాడులకు గురైన విషాద ఘటనలు, నుసైరత్ శరణార్థి శిబిరంలో పదేళ్ల బాలుడు తల్లిదండ్రులతో కలిసి మృతి చెందిన సంఘటనలు మానవత్వం పై జరిగిన నేరాలు. పాఠశాలలు, ఆసుపత్రులు ఇక సురక్షితమైన ప్రదేశాలు కావని, అవి కూడా బాంబు దాడులకు లక్ష్యమవుతున్నాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది.

**ఆకలి, దప్పికల మధ్య నిలబడిన జీవితాలు:**
గాజాలో 24 లక్షల మంది ప్రజలు తాగునీరు, ఆహారం, వైద్యం, నివాస సౌకర్యాలు లేకుండా దుర్భర జీవితం గడుపుతున్నారు. 60 శాతం కుటుంబాలు స్వచ్ఛమైన తాగునీటికి దూరంగా ఉన్నారు. ఐక్యరాజ్యసమితి నీటి బావులపై దాడులు జరిపి మానవతా సహాయ కార్యకర్తలను హత్య చేసిన ఘటనలు నమోదు చేసింది. 80 శాతం మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులయ్యారు, వేలాది తాత్కాలిక శిబిరాల్లో మురికి నీరు, వ్యాధుల బెడద ఎదుర్కొంటున్నారు. ఆహారం కొరతతో 90 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఐదు నెలల్లో ఆరు మంది పిల్లలు చలి తట్టుకోలేక చనిపోవడం వినాశనం యొక్క దుర్భర స్థితిని తెలియజేస్తుంది.

**అమానుషాత్వం: స్త్రీలు, బాలికల మౌన విలాపం:**
యుద్ధం మొత్తం 2025 చివరి వరకు 38,000 మందికి పైగా స్త్రీలు, బాలికలు ప్రాణాలు కోల్పోయారు. రోజుకు సగటున 47 మంది. ఐక్యరాజ్యసమితి స్త్రీల కోసం 85 సురక్షిత కేంద్రాలు నెలకొల్పినా, నిరంతర బాంబు దాడులు, సైనికుల అమానుష ప్రవర్తనలకు వేలాది మంది స్త్రీలు గురవుతున్నారు. వీరి బాధలు, భర్తలు, పిల్లలు, తల్లిదండ్రులు పోగొట్టుకున్న విషాదం వర్ణనాతీతం. అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘిస్తూ స్త్రీలు, పిల్లలు సామూహిక శిక్షకు గురవడం ప్రపంచాన్ని సిగ్గుపడేలా చేస్తోంది.

**న్యాయాన్ని ధిక్కరించిన నేత: అంతర్జాతీయ న్యాయస్థానం ముందు నిలబడని నెతన్యాహు**
అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీసీ) 2024లోనే నెతన్యాహు అరెస్టు వారెంట్ జారీ చేసింది. అతనిపై "యుద్ధ నేరాలు, మానవత్వం పై నేరాలు" ఆరోపణలు ఉన్నాయి. న్యూయార్క్ మేయర్ అతనిని "యుద్ధ నేరస్థుడు" అని పిలుపిచ్చింది, న్యూయార్క్ వస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించినా, అతను "ఇజ్రాయెల్ స్పెషల్ ఫోర్సెస్ నన్ను కాపాడుతుంది" అంటూ ధిక్కారంగా సమాధానం ఇచ్చాడు. టర్కీ 2026 జూలైలో అతనిపై "జాతి నిర్మూలన, మానవత్వం పై నేరాలు" ఆరోపణలతో అరెస్టు వారెంట్ జారీ చేసి, ఇంటర్పోల్ ద్వారా అంతర్జాతీయ రెడ్ కార్నర్ నోటీసు కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే నెతన్యాహు ఈ అంతర్జాతీయ న్యాయ ప్రక్రియలను పట్టించుకోకుండా, తన హింసాకాండ కొనసాగిస్తున్నాడు.

**అమెరికా ఆయుధాలు, ఆర్థిక సహాయం - నెతన్యాహు రక్తపాతం:**
ట్రంప్ పరిపాలన నెతన్యాహుకు ఆయుధాలు, ఆర్థిక సహాయం అందిస్తోంది. అమెరికా అధ్యక్షుడు "అమెరికా నేలపై నెతన్యాహును అరెస్టు చేయను" అని ప్రకటించడం, అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను సవాలు చేస్తున్నట్లు తెలియజేస్తోంది. ట్రంప్ గాజా శాంతి ప్రణాళికలో భాగంగా 2026 జూలైలో కాల్పుల విరమణ, హమాస్ నిరాయుధీకరణ, ఇజ్రాయెల్ వైదొలిగింపును ప్రతిపాదించినా, నెతన్యాహు ఆ ప్రణాళికకు మద్దతు ఇవ్వడం మానేశాడు. బదులుగా యుద్ధాన్ని తీవ్రతరం చేసి 2026 ఆగస్టులో 28 మంది పాలస్తీనియన్ల మరణానికి కారణమయ్యాడు. అమెరికా ప్రజలు కూడా ట్రంప్ గాజా విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. 48 శాతం మంది ఇజ్రాయెలీలు కూడా ట్రంప్ గాజా విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు.

**ఇజ్రాయెల్ సమాజంలో భిన్నాభిప్రాయాలు**
ఒక వైపు యుద్ధం పేరుతో నెతన్యాహు ప్రభుత్వం సైనిక చర్యలు తప్పనిసరని వాదిస్తుండగా, మరోవైపు బందీల కుటుంబాలు, విపక్షాలు, పౌర సమాజం "బందీలను తీసుకురండి, యుద్ధం ఆపండి" అంటూ నిరసనలు ముదిరాయి. టెల్ అవీవ్ నిరసనలు, రాజకీయ ఘర్షణలు నెతన్యాహు రాజీనామా డిమాండ్లకు దారితీస్తున్నాయి. 2026 అక్టోబరు ఇజ్రాయెల్ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో నెతన్యాహు తన మనుగడ కోసం యుద్ధాన్ని పొడిగిస్తున్నాడని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మానవత్వం ఓడిపోయిన యుద్ధం:**
నెతన్యాహు యొక్క ఈ హింసాకాండ ప్రపంచాన్ని ఒక మహా విషాదానికి గురిచేసింది. అతను యుద్ధ నేరాలకు, మానవత్వం పై నేరాలకు పాల్పడినా, ఈ నేరానికి న్యాయం జరగకపోవడం మానవత్వాన్ని అవమానిస్తోంది. గాజా నేడు అనుభవిస్తున్నది రాజకీయ యుద్ధం కాదు. అది ప్రజల మనుగడకు వ్యతిరేకంగా సాగుతున్న ఒక మహా వినాశనం. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయస్థానం, ఇతర దేశాలు ఇప్పుడు కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, నెతన్యాహును న్యాయస్థానం ముందు నిలబెట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉంది. ఈ మానవ మారణకాండ ముగియాలంటే, ప్రపంచ నాయకులు శాంతి, న్యాయం, మానవ హక్కుల పక్షాన నిలబడాలి. నేటి గాజా రేపటి ప్రపంచంలో మరెక్కడా పునరావృతం కాకూడదు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ఆగస్టు రాజకీయ సంక్షోభం వస్తుందా?

భారత రాజకీయ చరిత్రలో కొన్ని తేదీలు అధికార మార్పులు, తిరుగుబాట్లు, నాయకత్వ సంక్షోభాలకు ప్రతీకలుగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆగస్టు నెలకు అలాంటి ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. ముఖ్యంగా 1984 ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు ఎదుర్కొన్న రాజకీయ సంక్షోభం దేశ చరిత్రలోనే సంచలనాత్మక అధ్యాయంగా నిలిచింది. 1983 జనవరి 9న ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి కాంగ్రెస్ ఆధిపత్యానికి సవాల్ విసిరారు. అయితే కొద్దికాలానికే పార్టీలో అంతర్గత విభేదాలు మొదలయ్యాయి. అప్పటి ఆర్థిక మంత్రి నాదెండ్ల భాస్కరరావుతో ఎన్టీఆర్కు విభేదాలు పెరిగాయి. 1984లో గుండె శస్త్రచికిత్స కోసం ఎన్టీఆర్ అమెరికా వెళ్లిన సమయంలో ఈ విభేదాలు తీవ్రరూపం దాల్చాయి.

ఎన్టీఆర్ తిరిగి వచ్చిన కొద్దికాలానికే 1984 ఆగస్టు 16న గవర్నర్ రామ్లాల్ ఆయన మంత్రివర్గాన్ని తొలగించి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా నియమించారు. అయితే తనకు శాసనసభలో మెజారిటీ ఉందని ఎన్టీఆర్ ప్రకటించారు. తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేలను సమీకరించి ఢిల్లీకి తీసుకెళ్లారు. సుమారు 160 మంది ఎమ్మెల్యేలు తనకు మద్దతుగా ఉన్నారని అప్పటి వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామం క్రమంగా ప్రజా ఉద్యమంగా మారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆగస్టు 24న గవర్నర్ రామ్లాల్ రాజీనామా చేయడం కీలక మలుపుగా మారింది. అనంతరం శంకర్ దయాళ్ శర్మ గవర్నర్గా నియమితులయ్యారు. పార్టీ అంతర్గత అసంతృప్తి, నాయకత్వంపై విశ్వాసం తగ్గడం, ఎమ్మెల్యేల సమీకరణలు, ప్రత్యామ్నాయ నాయకత్వ ప్రయత్నాలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, ప్రజాభిప్రాయం వంటి అంశాలే అసలు కారణాలు. కాబట్టి "ఆగస్టు వస్తే సంక్షోభం వస్తుంది" అనే భావనకు శాస్త్రీయ ఆధారం లేదు. ఎన్టీఆర్ రాజకీయ జీవితంలో 1995 ఆగస్టు మరో కీలక మలుపుగా నిలిచింది. తెలుగుదేశం పార్టీలోనే ఎమ్మెల్యేలలో ఒక వర్గం ఆయన నాయకత్వంపై అసమ్మతి వ్యక్తం చేసింది. నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎమ్మెల్యేల సమీకరణ జరిగి, ఆగస్టు 24, 25 తేదీల్లో పరిణామాలు తీవ్రరూపం దాల్చాయి. ఈ రెండు సంఘటనలు ఒకే విధమైనవి కాకపోయినా, పార్టీలో అంతర్గత ఐక్యత బలహీనపడితే బలమైన నాయకత్వం కూడా సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశాయి.నేటి రాజకీయ పార్టీలకు ఇదే ప్రధాన పాఠం. సంక్షోభం క్యాలెండర్ చూసుకుని రాదు. నాయకత్వంపై అసంతృప్తి, పదవుల పంపకంపై అసహనం, ఎన్నికల పరాజయాలు, ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్తుపై అనిశ్చితి, ప్రత్యామ్నాయ అధికార కేంద్రాల ఏర్పాట్లు వంటి అంశాలు పేరుకుపోయినప్పుడు ఏ సమయంలోనైనా తిరుగుబాటు తలెత్తవచ్చు. 1984 సంఘటన మరో ముఖ్యమైన విషయాన్ని కూడా గుర్తు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ స్థిరత్వం కేవలం గవర్నర్ నిర్ణయాలపై కాకుండా శాసనసభలోని సంఖ్యాబలంపై ఆధారపడాలి. మెజారిటీపై అనుమానం ఉంటే దాన్ని శాసనసభలోనే పరీక్షించడం ప్రజాస్వామ్య పద్ధతి. ఎన్టీఆర్ సంక్షోభం తర్వాత గవర్నర్ పాత్ర, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, మెజారిటీ నిరూపణ వంటి అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. 2026లోనూ ఏదైనా పార్టీలో అంతర్గత విభేదాలు కనిపిస్తే వాటిని 1984 లేదా 1995తో పోల్చడం సహజమే. కానీ ప్రతి ఆగస్టులో రాజకీయ సంక్షోభం తప్పనిసరిగా వస్తుందని చెప్పడం మాత్రం సరైన విశ్లేషణ కాదు. కాలం మారింది, రాజకీయ వ్యవస్థ మారింది, సమాచార వ్యవస్థ మరింత వేగవంతమైంది. అయినప్పటికీ ఒక విషయం మాత్రం మారలేదు-పార్టీ అంతర్గత ఐక్యత బలహీనపడితే అధికారంలో ఉన్న నాయకత్వానికి ప్రమాదం తప్పదు.

గత చరిత్ర నుంచి వర్తమానానికి పాఠాలు నేర్చుకోవడం. 1984 ఆగస్టు ప్రజాస్వామ్య విలువలను, 1995 ఆగస్టు పార్టీ అంతర్గత ఐక్యతను గుర్తు చేస్తాయి. రాజకీయ పార్టీలకు అసలు హెచ్చరిక ఆగస్టు కాదు-అంతర్గత అసంతృప్తి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

జనంసాక్షి

## చీకటిని చీల్చిన టార్చ్లైట్ల నుంచి ర్యాంప్లైట్ల దాకా
# అప్పుడు వీళ్లంతా నక్సలైట్లు

చీకటిని చీల్చే టార్చ్లైట్లు..
ఇప్పుడు ర్యాంప్ వాక్ చేసే మోడల్లు..
అందరికీ అన్నం.. ఆవాసం.. నిండుబట్ట కావాలన్నోళ్లు..
ఇప్పుడు మొండి బట్టలు ఏసుకున్న మోడల్స్..
ఆపరేషన్ కగార్ చేసిన ఇచ్చంత్రాలు..
రాజ్యం తల్చుకుంటే సింహాన్ని పిచ్చికుక్కను చేస్తుంది..
మావోయిస్టులను ర్యాంప్ వాక్ చేయిస్తుంది.."

సోషల్ మీడియాలో విస్తృతంగా తిరుగుతున్న ఈ పంక్తులు ఒక దృశ్యాన్ని మాత్రమే వ్యంగ్యంగా చూడటం లేదు. ఒక కాలం తనను తాను నిగ్గదీసుకుంటున్నది. ఒకప్పుడు రాజ్యాన్ని ప్రశ్నించిన, దండకారణ్య అడవుల్లో తుపాకులు పట్టిన మహిళలు ఇవాళ ప్రభుత్వ కార్యక్రమంలో ర్యాంప్పై నడవడం వ్యక్తిగత జీవిత మార్పుగా చూస్తే అది ఒక సాధారణ మానవ కథ. కానీ అదే దృశ్యాన్ని "మావోయిజంపై రాజ్యం సాధించిన విజయం"గా ప్రచారం చేసినప్పుడు అది రాజకీయ ప్రశ్నగా మారుతుంది.

ఆగస్టు 7న రాయ్పూర్లో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో బస్తర్కు చెందిన తొమ్మిది మంది మాజీ మహిళా మావోయిస్టులు ర్యాంప్పై నడిచారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన వార్తలు, వీడియోలు ఆగస్టు 13 నుంచి విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. అధికారిక కథనం దీనిని పునరావాసం, నైపుణ్యాభివృద్ధి, ఆత్మవిశ్వాసం, ప్రధాన స్రవంతిలోకి పునరేకీకరణకు ప్రతీకగా చూపించింది. వార్తా కథనాల ప్రకారం, సుక్మాలోని పునరావాస కేంద్రం నుంచి వచ్చిన ఈ మహిళలకు ర్యాంప్ వాక్, గ్రూమింగ్, దుస్తుల ప్రదర్శన, మైక్పై మాట్లాడటం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే ఈ అధికారిక కథనానికి భిన్నంగా ఆలస్యంగా కొన్ని ప్రశ్నలు, ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కుట్టు మిషన్ లేదా ఉపాధి శిక్షణ కోసం తీసుకెళ్తున్నామని చెప్పి రాయ్పూర్కు తీసుకెళ్లారని, అక్కడికి వెళ్లిన తర్వాతే ర్యాంప్ వాక్ విషయం తెలిసిందని, ముందస్తుగా పూర్తి సమాచారం ఇవ్వలేదని, కార్యక్రమంలో పాల్గొనడానికి మొదట సంకోచించిన వారిపై ఒత్తిడి తెచ్చారని కొన్ని వర్గాల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవి నిజమా కాదా అనే దానిపై స్వతంత్ర విచారణ జరగాలనే ప్రశ్న మాత్రం సముచితమే. ఇక్కడ అసలు ప్రశ్న ర్యాంప్ వాక్ మంచిదా చెడ్డదా అనేది కాదు. ఒక వ్యక్తికి తన ఇష్టాన్ని నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉందా అనేదే కీలకం. ఒక మాజీ మావోయిస్టు మహిళ స్వచ్ఛందంగా చేనేత దుస్తులు ధరించి ర్యాంప్పై నడవాలనుకుంటే అందులో తప్పేమీ లేదు. ఆమెకు కొత్త జీవితం కావాలి. ఉపాధి కావాలి. గౌరవం కావాలి. సమాజంలో తనకంటూ ఒక స్థానం కావాలి. అది ఆమె హక్కు. కానీ కుట్టు మిషన్ శిక్షణ పేరుతో తీసుకెళ్లి, అక్కడికి వెళ్లిన తర్వాత రాజకీయంగా అత్యంత ప్రతీకాత్మకమైన ఒక కార్యక్రమంలో పాల్గొనాలని ఒత్తిడి చేస్తే, అది పునరావాసం ప్రశ్నను దాటి వ్యక్తి స్వేచ్ఛ, సమ్మతి, గౌరవం ప్రశ్నగా మారుతుంది. అప్పుడు ర్యాంప్పై నడుస్తున్నది కేవలం ఒక మహిళ కాదు. ఆమె శరీరాన్ని ఒక రాజకీయ సందేశానికి వేదికగా ఉపయోగిస్తున్నారా అనే ప్రశ్న ముందుకు వస్తుంది. మాజీ మావోయిస్టు మహిళ కొత్త జీవితం ఎంచుకోవడాన్ని ఎవరూ ఎగతాళి చేయాల్సిన అవసరం లేదు. తుపాకీ వదిలి కుటుంబంతో బతకాలని కోరుకోవడం తప్పు కాదు. ఉపాధి పొందడం తప్పు కాదు. చేనేత దుస్తులు ధరించి ర్యాంప్పై నడవడం కూడా తప్పు కాదు. కానీ, ఒక వ్యక్తి పునరావాసాన్ని ఒక రాజకీయ ఉద్యమం పరాజయానికి ట్రోఫీగా చూపించడం మాత్రం ప్రశ్నించాల్సిన విషయమే. "చూడండి, నిన్న తుపాకీ పట్టిన వాళ్లు ఇవాళ ర్యాంప్పై నడుస్తున్నారు. తుపాకీ మార్గం ఓడిపోయింది. ప్రధాన స్రవంతి గెలిచింది" అనే కథనం ఇందులో దాగి ఉంది.

ఇది యాదృచ్ఛికం కాదు. ఈ ర్యాంప్ వాక్ను పునరావాసం, పునరేకీకరణ, హింస నుంచి అభివృద్ధికి మార్పు వంటి ప్రతీకలతో వివరించే అధికారిక, మీడియా కథనాలు వెలువడ్డాయి. ఒక వ్యక్తి జీవితంలో వచ్చిన మార్పును మొత్తం రాజకీయ ఉద్యమం పరాజయానికి ప్రతీకగా నిలబెట్టడం ద్వారా ఒక సంక్లిష్టమైన సామాజిక రాజకీయ చరిత్రను ఒకే ఫ్రేమ్లో బంధించే ప్రయత్నం జరుగుతుంది. కానీ మార్క్సిస్ట్ ప్రశ్న అక్కడితో ఆగదు. ఒక వ్యక్తి మారితే సమాజం మారిందా? కొంతమంది లొంగిపోతే వారిని అడవిలోకి నెట్టిన సామాజిక పరిస్థితులు మాయమయ్యాయా? భూమి సమస్య పరిష్కారమైందా? ఆదివాసీలకు అడవిపై హక్కు పూర్తిగా వచ్చిందా? ఖనిజ సంపదపై స్థానిక ప్రజల నిర్ణయాధికారం పెరిగిందా? నిరుద్యోగం, పేదరికం, భూస్వామ్య అవశేషాలు, కుల వివక్ష, సామాజిక అసమానత అంతమయ్యాయా? ఇదే అసలు గీటురాయి.

పునరావాసం అంటే వ్యక్తి జీవితాన్ని తిరిగి నిర్మించడమా? లేక అతని లేదా ఆమె జీవితాన్ని ప్రభుత్వ ప్రచార కథనానికి అనుగుణంగా మలచడమా? పునరావాసం నిజమైనదైతే అందులో స్వేచ్ఛ, సమ్మతి, గౌరవం తప్పనిసరిగా ఉండాలి. ఒక మాజీ మహిళా మావోయిస్టుకు కుట్టు మిషన్ ఇవ్వడం, ఉపాధి నేర్పడం, వ్యవసాయానికి అవకాశం కల్పించడం, పిల్లలకు విద్య అందించడం, ఆరోగ్య సదుపాయాలు కల్పించడం వంటివన్నీ నిజమైన పునరావాస చర్యలు. కానీ.. ఆమెను కెమెరాల ముందు నిలబెట్టి "నిన్న అడవిలో తుపాకీ పట్టింది, ఇవాళ ర్యాంప్పై నడుస్తోంది" అనే దృశ్యాన్ని తయారు చేయడం మాత్రం మరో రాజకీయ ప్రక్రియ. అందుచేత ఈ కార్యక్రమంపై ప్రశ్నించాల్సింది. ఆమె స్వచ్ఛందంగా వచ్చిందా? ముందుగానే పూర్తి సమాచారం ఇచ్చారా? ర్యాంప్ వాక్కు ఆమె సమ్మతి తీసుకున్నారా? నిరాకరించే స్వేచ్ఛ ఆమెకు ఉందా? కుట్టు మిషన్ లేదా ఉపాధి శిక్షణ పేరుతో తీసుకువచ్చి వేరే కార్యక్రమంలో పాల్గొనమని ఒత్తిడి చేశారా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి. ఇవి మాజీ మావోయిస్టుల పట్ల సానుభూతి చూపించే ప్రశ్నలు మాత్రమే కావు. పునరావాసం పొందుతున్న ప్రతి మనిషి గౌరవాన్ని రక్షించే ప్రజాస్వామిక ప్రశ్నలు.

నక్సల్బరీని కేవలం తుపాకీ, హింస, నిషేధిత సంస్థల చరిత్రగా చదవడం దాని సామాజిక మూలాలను చెరిపేయడమే. భూమి ఎవరిది? భూమిలేని రైతు బతుకేంటి? వ్యవసాయ కూలీకి హక్కులేంటి? ఆదివాసీకి అడవిపై అధికారం ఎవరిది? భూసంబంధాలు ఎలా మారాలి? రాజ్యాధికారం ఎవరికి అనుకూలంగా పనిచేస్తోంది? అనే ప్రశ్నల నుంచే నక్సల్బరీ రాజకీయ సవాలు పుట్టింది. అయితే, ఇక్కడే లిబరేషన్ దృక్పథంలోని విమర్శనాత్మక మార్క్సిజం అవసరం. సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా తిరుగుబాటు పుట్టిందని చెప్పడం ఒక విషయం. ఆ తిరుగుబాటు అనుసరించిన ప్రతి వ్యూహాన్ని సరైనదని చెప్పడం మరో విషయం. మావోయిస్టు రాజకీయాన్ని విమర్శించడానికి భూసమస్యను తిరస్కరించాల్సిన పని లేదు. అదే విధంగా రాజ్య అణచివేతను విమర్శించడం అంటే మావోయిస్టు ఉద్యమంలోని ప్రతి రాజకీయ పద్ధతినీ సమర్థించడం కాదు. విప్లవ లక్ష్యం ఒకటి. దానికి అనుసరించిన రాజకీయ వ్యూహం మరోటి. ఈ రెండింటినీ కలిపేయడం మార్క్సిజం కాదు. బస్తర్లో ఇటీవలి కాలంలో పెద్ద సంఖ్యలో లొంగుబాట్లు జరుగుతున్నాయి. వీటిని కేవలం "రాజ్యం గెలిచింది" అని చదవడం ఎంత సరళీకరణో, "లొంగిపోయిన వాళ్లంతా ద్రోహులు" అని చెప్పడం కూడా అంతే సరళీకరణ. ఒక కార్యకర్త ఎందుకు వెనక్కి తగ్గాడు? ఏ భౌతిక పరిస్థితులు అతడిని లేదా ఆమెను ఆ నిర్ణయానికి నెట్టాయి? దీర్ఘకాలిక అడవి జీవితం, కుటుంబాలకు దూరం, మరణ భయం, సంస్థాగత సంక్షోభం, నాయకత్వంపై అసంతృప్తి, భవిష్యత్తుపై అనిశ్చితి, మరోవైపు ప్రభుత్వ పునరావాస ప్యాకేజీలన్నీ కలిసి పనిచేసి ఉండవచ్చు. అందుకే ప్రశ్న "వాళ్లు ఎందుకు లొంగిపోయారు?" అన్నదొక్కటే కాదు. "వాళ్లు లొంగిపోయే పరిస్థితి ఎందుకు ఏర్పడింది?" అనేదే అసలు ప్రశ్న.

ఆపరేషన్ కగార్ను కూడా ఇలాగే చూడాలి. బస్తర్ను కేవలం "భద్రతా సమస్య"గా కుదించేస్తే అక్కడి రాజకీయ ఆర్థిక వ్యవస్థ కనిపించదు. అడవి ఉంది. భూమి ఉంది. ఖనిజ సంపద ఉంది. రహదారులు ఉన్నాయి. మౌలిక వసతులు ఉన్నాయి. పెట్టుబడులు ఉన్నాయి. ఆదివాసీ ప్రజల జీవన హక్కులు ఉన్నాయి. భద్రత, భూమి, ఖనిజం, పెట్టుబడి, అభివృద్ధి, ఆదివాసీ హక్కులు విడివిడిగా ఉన్న ప్రశ్నలు కావు. అందుకే "ప్రధాన స్రవంతిలోకి వచ్చారు" అనే మాటను కూడా నిగ్గదీయాలి. ప్రధాన స్రవంతి అంటే ఎవరిది? అడవితో జీవించడం వెనుకబాటుతనమా? నగర వినియోగ సంస్కృతిలోకి రావడమే అభివృద్ధా? చేనేత దుస్తులు ర్యాంప్పైకి వచ్చినప్పుడు మాత్రమే వాటికి విలువ వస్తుందా? ఆ చేనేతను ఉత్పత్తి చేసే కార్మికుడి బతుకు ఏమిటి? లిబరేషన్ రాజకీయ దృక్పథం ఇక్కడ ఒక కీలకమైన తేడాను ముందుకు తెస్తుంది. ప్రజలను "ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం" కాదు. ప్రజలే తమ హక్కులతో ప్రజాస్వామిక ప్రధాన స్రవంతిని నిర్మించాలి. ఒక ఆదివాసీ మహిళ తన అడవిలో గౌరవంగా జీవించగలిగితే అదే అభివృద్ధి. ఒక మాజీ మావోయిస్టు మహిళ తనకు నచ్చిన ఉపాధిని ఎంచుకోగలిగితే అదే పునరావాసం. ఆమె ర్యాంప్పై నడవాలా వద్దా అన్న నిర్ణయాన్ని ఆమెట్ట తీసుకోగలిగితే అదే స్వేచ్ఛ.

ఇదే సమయంలో విప్లవోద్యమం తనను తాను కూడా నిగ్గదీయాలి. ప్రజల నుంచి దూరమైపోయిందా? విస్తృత ప్రజా ఉద్యమాల నిర్మాణం బలహీనపడిందా? సైనిక చర్యకు రాజకీయ ఉద్యమంపై అధిక ప్రాధాన్యం వచ్చిందా? కార్మికులు, రైతులు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, విద్యార్థులు, యువతతో నిరంతర ప్రజా సంబంధం ఎంతవరకు ఉంది? కుల నిర్మూలనను వర్గ పోరాటంతో ఎలా మిళితం చేయాలి? ప్రజాస్వామిక హక్కుల పోరాటాలను ఎలా విస్తరించాలి? ఇవి అసౌకర్యమైన ప్రశ్నలే కావచ్చు. కానీ విప్లవ రాజకీయానికి ఆత్మవిమర్శ లేకపోతే అది సిద్ధాంతం కాదు, స్వీయ సమర్థన. లెనిన్ నుంచి నేర్చుకోవాల్సిన పాఠం ఇదే.. విప్లవ పార్టీ ప్రజల జీవితాల నుంచి వేరుపడకూడదు. కార్మిక వర్గం, రైతాంగం, పీడిత వర్గాలు, మహిళలు, యువత, ఆదివాసీల దైనందిన పోరాటాలతో రాజకీయానికి జీవ సంబంధం ఉండాలి. ప్రజా ఉద్యమాలు, ప్రజాస్వామిక హక్కులు, సంస్థాగత నిర్మాణం, విస్తృత ఐక్యతలను పక్కనబెట్టి కేవలం సైనిక శక్తితో సామాజిక విప్లవాన్ని సాధించలేం.

అందుకే తుపాకీ పడిపోవడం అంటే విప్లవ ప్రశ్న పడిపోవడం కాదు. అదే విధంగా తుపాకీ పట్టుకోవడమంటే విప్లవ రాజకీయమే కాదు. విప్లవాత్మకతకు కొలమానం ఆయుధం కాదు. ప్రజలతో సంబంధం, వర్గ దృక్పథం, సామాజిక విముక్తి లక్ష్యం, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ, ప్రజా సంస్థల నిర్మాణం, ప్రత్యామ్నాయ రాజకీయాన్ని నిర్మించే సామర్థ్యం అసలు కొలమానాలు. "చైతన్యానికి చెదులు పట్టిందా?" అనే ప్రశ్నకు సమాధానం వ్యక్తుల్ని తిట్టడంలో లేదు. ఉద్యమాల రాజకీయ వైఫల్యాలను గుర్తించడంలో ఉంది. లొంగిపోయిన మహిళను "ద్రోహి" అని తిట్టడం సులభం. ఆమెను ప్రభుత్వ ప్రచారంలో "విజయ ట్రోఫీ"గా మార్చడం కూడా సులభమే. కానీ ఆమె జీవితాన్ని, ఆమె నిర్ణయాన్ని, ఆమె స్వేచ్ఛను, ఆమె గతాన్ని, ఆమె భవిష్యత్తును అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. అదే నిజమైన రాజకీయ బాధ్యత.

"దిద్దుబాటు, తిరుగుబాటు లేదా?" అంటే పాత నినాదాలను మళ్లీ పలకడం కాదు. గత తప్పిదాల నుంచి నేర్చుకుని కొత్త సామాజిక వాస్తవాలకు తగిన కొత్త ప్రజా రాజకీయాన్ని నిర్మించడం. మొన్న వాళ్లు. నిన్న వీళ్లు. ఇవాళ నేను. రేపు నువ్వు. ఈ పంక్తి భయపెట్టే హెచ్చరికగా మాత్రమే మిగలకూడదు. అది బాధ్యతగా మారాలి. పోరాటానికి తలకొరివి పెట్టడం అంటే తుపాకీని వదిలేయడం మాత్రమే కాదు. అన్యాయాన్ని ప్రశ్నించే చైతన్యాన్ని వదిలేయడం. అదే సమయంలో కొత్త పోరాటాన్ని నిర్మించడం అంటే పాత తప్పులను మళ్లీ చేయడం కూడా కాదు. ర్యాంప్లైట్లు వెలుగుతాయి. ఆరిపోతాయి. రాజకీయ ప్రతీకలు మారుతాయి. నిన్న "శత్రువు"గా చూపిన మనిషి ఇవాళ "విజయ ప్రతీక"గా చూపబడవచ్చు. కానీ భూమి, అడవి, కూలి, ఆకలి, గౌరవం, సమానత్వం, స్వేచ్ఛల ప్రశ్నలు ఇంకా బతికే ఉంటే చరిత్ర ముగియదు. చీకటిని చీల్చిన టార్చ్లైట్ ఆరిపోయి ఉండొచ్చు. ర్యాంప్లైట్లు వెలిగి ఉండొచ్చు.

ఆమె స్వేచ్ఛగా నడిచిందా? లేక ఎవరో చూపించిన దారిలో నడిపించారా? ఈ ప్రశ్నకు సమాధానం కావాలి. అదే సమయంలో ఆమె తుపాకీ వదిలిన తర్వాత నిజంగా ఏమి పొందింది? ఉపాధి? గౌరవం? భద్రత? స్వేచ్ఛ? రాజకీయ హక్కు? లేక కేవలం ఒక రోజు ర్యాంప్లైట్? అనేదీ అడగాలి. ఎందుచేతనంటే.. నిజమైన పునరావాసం ఒకరోజు కెమెరా ముందు జరిగే కార్యక్రమం కాదు. ఒక మనిషి తన జీవితాన్ని తానే నిర్ణయించుకునే స్థితికి చేరుకోవడం. అదే నిజమైన విముక్తి. మొన్న వాళ్లు. నిన్న వీళ్లు. ఇవాళ నేను. రేపు నువ్వు.. పోరాటానికి తలకొరివి పెట్టేది మనమేనా? లేక ఓడిపోయిన చరిత్రను నిగ్గదీసి, కొత్త కాలానికి కొత్త పోరాట భాషను నిర్మించేది మనమేనా?



- మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్)
లిబరేషన్ తెలంగాణ

## ప్రశాంతంగా ముగిసిన మిలాద్-ఉన్-నబీ వేడుకలు



**మెదక్ బ్యూరో, ఆగస్టు 26 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా వ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా ముగిశాయి. మెదక్ టౌన్, చేగుంట, శంకరంపేట-ఏ, టేక్మాల్, నార్సింగి, నర్సాపూర్ పట్టణాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. వేడుకలు, ప్రార్థనలు, ఊరేగింపుల సందర్భంగా ప్రజల రాకపోకలు, ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, సున్నితమైన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించారు. ఊరేగింపుల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్ బృందాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు జిల్లా పోలీసు శాఖ కృతజ్ఞతలు తెలిపింది. పోలీసులకు సహకరించిన మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులను అధికారులు అభినందించారు. జిల్లాలో అన్ని పండుగలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహిస్తూ మెదక్ జిల్లా ప్రశాంతతకు ప్రజలు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

# గురుకులాల్లో ఖాళీ పోస్టులను పదోన్నతులతో వెంటనే భర్తీ చేయాలి

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :** నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో చాలా కాలంగా ఖాళీగా ఉన్న పోస్టులతో పాటు పదవీ విరమణల కారణంగా ఏర్పడిన ఖాళీలను అర్హత కలిగిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం ద్వారా వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆవుల సైదులు, టీఆర్ లెఫ్ట్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి. సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందుబాటులో లేని కారణంగా ఆయన ఓఎస్డీ విజయ్ కుమార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఓఎస్డీ దృష్టికి తీసుకెళ్లారు. గురుకుల విద్యాలయాల్లో సిబ్బంది కొరత కారణంగా బోధన, విద్యా నిర్వహణపై ప్రభావం పడకుండా ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాల్సిన అవసరం ఉందని వారు వివరించారు. ముఖ్యంగా పదోన్నతులకు అర్హత కలిగిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా అన్ని క్యాడర్లలో ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే చేపట్టాలని కోరారు.

### 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని సంఘం నాయకులు కోరారు. 15 రోజుల్లోగా సమస్యలను పరిష్కరించకపోతే



విద్యార్థుల సంక్షేమం, ఉపాధ్యాయుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని, అవసరమైతే సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వివరించిన సమస్యలను ఓపికగా విన్న ఓఎస్డీ శ్రీ విజయ్ కుమార్, సమస్యలను అంతదాకా రానీయకుండా అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలను మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో మంత్రి సమావేశం ఏర్పాటు చేయించేందుకు కూడా కృషి చేస్తానని తెలిపారు.

### ప్రధాన కార్యదర్శి కార్యాలయంలోనూ వినతిపత్రం

అనంతరం సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీమతి విజయేందిర బోయి, ఐఏఎస్ కార్యాలయంలో కూడా సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల ప్రొబేషన్ డిక్లరేషన్, ఏకరూప స్టాఫింగ్ ప్యాట్రన్ అమలు, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న జెడ్.ఓ. పోస్టులు, సుమారు 150 ప్రిన్సిపల్ పోస్టులు, జూనియర్ లెక్చరర్ పోస్టులు, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులతో పాటు అన్ని క్యాడర్లలో ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడం వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ ఎరియర్స్ విడుదల చేయాలని, అన్ని గురుకులాలకు కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, పీఈటీ ఉపాధ్యాయులకు క్రాస్ ప్రమోషన్లు ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, వ్యాయామ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా క్రాస్ ప్రమోషన్లకు అవకాశం కల్పించాలని వారు కోరారు. అదేవిధంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)ల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ పోస్టులను అర్హత కలిగిన వారితో వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించడం ద్వారా బోధనా సిబ్బందిలో మరింత ఉత్సాహం పెరిగి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు దోహదపడుతుందని సంఘం నాయకులు తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, గురుకులాల పనితీరు మరింత మెరుగుపడేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టి.జి.ఎస్.డబ్ల్యు. ఆర్.ఈ.టి.ఎల్.ఎ సహాయ కార్యదర్శి కె. నాగరాజు, టీఆర్ లెఫ్ట్ సహాయ కార్యదర్శి డి. నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్
- రాష్ట్ర మహాసభల గోడ పత్రికలు ఆవిష్కరణ

**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్ లో జరుగుతాయని సిద్దిపేట జిల్లాలోని విభాగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్ లో కార్మికులతో కలిసి వాల్ పోస్టర్లు విడుదల విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిందని నాటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి 44 కార్మిక చట్టాలు సాధించిందని అన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో కార్మికులను, కర్షకులను ఐక్యం చేసి పోరాటం చేసిందని, భారతదేశానికి పూర్తి స్వాతంత్రం కావాలని పోరాటం చేసిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ




అని అన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, కార్మిక వ్యతిరేక అయిన నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రైవేటీకరణ ఎత్తివేయాలని, కనీస వేతనం 26000, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈఎస్ఐ, గ్రాట్యుటీలపై సీలింగును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి వీబిజీ రాంజీ పథకం తీసుకొచ్చి ఉపాధి హామీ కూలీలకు అనేక షరతులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, హమాలి, భవన నిర్మాణ రంగం, ఆటో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు ఏఐటీయూసీ జాతీయ నాయకులు పాల్గొంటారని జిల్లాలోని కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అందె అశోక్, పిట్ల మల్లేశం, కర్నాల చంద్రం, సహాయ కార్యదర్శి తపాస్ పల్లి బిక్షపతి, గంగి రాజు, పట్టణ అధ్యక్షులు చెక్క ఐలయ్య, జిల్లా కోశాధికారి గోవిందారం బాలయ్య, జిల్లా నాయకులు కొరిమి మురళి, చింతమడక రాజు, భూమయ్య, బాలయ్య, సుదర్శన్, రమేష్, పర్షయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## పీజీ పరీక్షకు పటిష్ట భద్రత



**రంగారెడ్డి, ఆగస్టు 26 (జనంసాక్షి) :** పకడ్బందీగా లేటు పీజీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ పీజీ (నీట్ – పీజీ) ప్రవేశ పరీక్ష నేపథ్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను పోలీసులు బుధవారం పరిశీలించారు. సీఐ మద్ది మహేందర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి సిబ్బందితో కలిసి శ్రీ చక్ర కాలేజీలోని టీసీఎస్ ఐఓఎన్ డిజిటల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలోని సీసీటీవీ కెమెరాల పనితీరు, పార్కింగ్ ఏర్పాట్లు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అలాగే పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులతో పాటు వారితో వచ్చే తల్లిదండ్రులకు కూడా పరీక్ష పూర్తయ్యే వరకు అవసరమైన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నీట్ పీజీ ప్రవేశ పరీక్షను సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇబ్రహీంపట్నం పోలీసులు అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలే..

- ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి
- హిటాచి వాహనం ఫీజు
- మట్టి వ్యాపారులపై కేసు నమోదు

**రంగారెడ్డి, ఆగస్టు 26 (జనం సాక్షి) :** ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి తరలిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం సీఐ ఎం. మహేందర్ రెడ్డి, తహసీల్దార్ సునీతరెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, రెవెన్యూ భూముల్లో అక్రమ మట్టి రవాణాకు పాల్పడే వారిపై పోలీస్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిఘా తీవ్రతరం చేసినట్లు వారు స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంపేట్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ మట్టి తవ్వకాలకు ఉపయోగిస్తున్న ఒక ఇటాచి వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటనపై అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వ్యక్తులపై క్రైమ్ నంబర్ 588/2026 కింద యూ/ఎస్303(2), 329(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఇలాంటి అక్రమాలకు పాల్పడితే




చట్టపరమైన కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి మట్టిని తరలించే వారిపై కేవలం వాహనాలను సీజ్ చేయడంతో సరిపెట్టకుండా, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి పదేపదే ఇలాంటి అసాధారణ కార్యకలాపాలకు పాల్పడే వారిపై మరింత సీరియస్‌గా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమ మట్టి తవ్వకాలు లేదా రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. అక్రమ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని అధికారులు తేల్చిచెప్పారు.

## జల్సాలకు అలవాటు పడి మూగ జీవాలే లక్ష్యంగా దొంగతనాలు

- నిందితుడిని పట్టుకున్న బొంరాస్ పేట పోలీసులు
- మరో నలుగురు నిందితుల పరారీ
- వివరాలు వెల్లడించిన ఎస్సై బాల వెంకటరమణ

**బొంరాస్‌పేట, ఆగస్టు 26 (జనం సాక్షి) :** జల్సాలు, తాగుడుకు అలవాటు పడి మూగజీవాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాటుపడుతున్న నిందితుడిని బొంరాస్ పేట పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. బుధవారము నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ బాల వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లాలో వరుసగా జరుగుతున్న పశువుల దొంగతనాలపై నిఘా పెట్టాలని ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు ఎస్సై బాల వెంకటరమణ ఆధ్వర్యంలో మాఫ్టిలో ఉన్న పోలీసులు బాలు, బాలయ్య, శ్రీనివాస్ లు బొంరాస్ పేట పెద్ద చెరువు శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న స్కార్పియో వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న వ్యక్తిని పట్టుకుని విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మహమ్మద్ సల్మాన్ ( 39) హైదరాబాద్ నగరానికి చెందిన అతనితో పాటు వారి స్నేహితులు హర్యానాకు చెందిన సౌకత్, తాహిర్ ,సాబీర్, నట్ట మద్యం త్రాగుడుకు జల్సా లకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో రాత్రి వేళల్లో వికారాబాద్ జిల్లాలోని బొంరాస్ పేట,పరిగి,దోమ,కుల్కచర్ల,ధరూర్, బంట్వరం, దుద్యాల, చెన్గోముల్,నారాయణపేట జిల్లా కోస్గి తదితర




ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇప్పటికే ఆయా పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు కావడం జరిగిందన్నారు. ఈనెల 25న మధ్యాహ్నం పశువులను దొంగతనం చేసేందుకు ఐదు మంది వ్యక్తులు స్కార్పియో వాహనంలో రాగా మహమ్మద్ సల్మాన్ అని నిందితుడు దొరికాడు. మిగిలిన నలుగురు పరారైనట్లు వెల్లడించారు. సల్మాన్ నుండి రూ.3,55,000 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టు ముందు హాజరు పరచడం జరిగిందన్నారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలో పట్టుకొని అరెస్టు చేస్తామని ఎస్ఐ బాల వెంకటరమణ తెలిపారు.

## తాండూరులో స్థలాల మార్కెట్ విలువలు తగ్గింపు

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి డాక్యుమెంట్ రైటర్ల కృతజ్ఞతలు



**తాండూరు, అగస్టు 26 (జనంసాక్షి) :** తాండూరు పట్టణంలో స్థలాల మార్కెట్ విలువలను తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై డాక్యుమెంట్ రైటర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ గతంలో తాండూరు పట్టణంలో అధికంగా ఉన్న మార్కెట్ విలువల కారణంగా స్థలాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల సమయంలో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడేదని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని తాము పలుమార్లు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశామన్నారు. తమ విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే ప్రభుత్వం మరియు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి మార్కెట్ విలువలు తగ్గేలా చొరవ చూపారని తెలిపారు. ప్రజల సమస్యను గుర్తించి పరిష్కారం చూపిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

- సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం
- ఆగస్టు 30న బాచుపల్లిలో జిల్లా విద్యా సదస్సు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 26 (జనంసాక్షి) :** కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి, ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టపర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న బాచుపల్లి ప్రగతినగర్‌లోని లీలా సుందరయ్య భవన్‌లో జిల్లా విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కమలనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.సత్యం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేస్తున్నాయని విమర్శించారు. విద్యా కార్పొరేటీకరణ పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాల్సిన పరిస్థితి నుంచి, ఆర్థిక స్థోమత ఉన్నవారికే పరిమితమయ్యే ప్రమాదం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్నా ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. నూతన విద్యా విధానం --2020 పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగంలో పెను మార్పులు తీసుకొస్తూ విద్యను కాషాయీకరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. సమానత్వం, సామాజిక న్యాయం, లౌకికవాద విలువలను పరిరక్షిస్తూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ఫీజుల పేరుతో భారీ వసూళు జరుగుతున్నాయని, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా తదితర ఖర్చులు అదనపు భారంగా మారాయని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు సమగ్ర ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్య అనేది వ్యాపార వస్తువు కాదని, ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను పెంచాలని కోరారు. ప్రతి మండలానికి ఒక జూనియర్ కళాశాల, ప్రతి నియోజకవర్గానికి సొంత భవనంతో కూడిన డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలని, మధ్యాహ్న భోజన పథకం నిధులు, స్కాలర్‌షిప్‌లను పెంచాలని కోరారు. ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యకు కేంద్ర ప్రభుత్వం జీడీపీలో 6 శాతం, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో



30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యా సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వరరావు, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, జి.శ్రీనివాసులు, ఎర్ర అశోక్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.శ్రీనివాస్, జి.యాదగిరిరావు, జి.వి.రావు, వెంకటేశ్వరరావు, శ్రీమన్నారాయణ, శివరామకృష్ణ, భాస్కర్, శోభ, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- **వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :** గిరిజనుల సంక్షేమం, అభివృద్ధితో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ యార్డులో బుధవారం జిల్లా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని గిరిజన సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన యువతులు తీజ్ మొలకలతో ఎమ్మెల్యేను సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తీజ్ పండుగ బంజారా సమాజానికి ఎంతో పవిత్రమైన, ప్రత్యేకమైన పండుగ అని మేఘారెడ్డి అన్నారు. తీజ్ సందర్భంగా మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో మొలకలను పెంచి పూజించడం, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకోవడం బంజారా సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని తెలిపారు. తీజ్ పండుగ కేవలం పండుగ మాత్రమే కాదని, బంజారా సమాజ సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.



### ప్రతి తండాలో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి కృషి

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో గిరిజన సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రతి గిరిజన తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని తెలిపారు. సేవాలాల్ మహారాజ్ స్మృతివనం ఏర్పాటుకు రూ.200 కోట్లతో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గిరిజన సమాజం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు.
గిరిజనుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి, విద్య, ఉపాధి, మౌలిక వసతులతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

### వనపర్తిలో సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు

వనపర్తి పట్టణంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బంజారా సేవా సంఘం నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డిని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ గిరిజన సమాజం ఆకాంక్షను నెరవేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
"గిరిజనుల అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక అభివృద్ధి మాత్రమే కాదు. వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని కాపాడుతూ అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే నిజమైన అభివృద్ధి" అని ఎమ్మెల్యే అన్నారు.
వనపర్తి గడ్డపై బంజారా సంస్కృతికి ప్రతీకగా నిలిచే తీజ్ ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని, గిరిజన సోదరసోదరీమణులతో కలిసి సంప్రదాయ పూజల్లో పాల్గొనడం తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు, గిరిజన పెద్దలు, యువతులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గౌతాపూర్‌లో మహిళా సంఘాలకు అవగాహన శిక్షణ




**బాలానగర్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండలం గౌతాపూర్ గ్రామంలో బుధవారం గ్రామ సంఘం ఆధ్వర్యంలో చిన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సంఘం ఓబీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఆర్పీలు ఎస్.కె. చందా సుల్తానా, విజయలక్ష్మి మహిళలకు సంఘాల నిర్వహణ, పొదుపు విధానాలు, బ్యాంకు లావాదేవీలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సంఘాల ద్వారా ఆర్థికంగా ఎలా ఎదగాలో వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ తాళ్ల ప్రకాష్ గౌడ్, ఉప సర్పంచ్ పెద్దోని యాదయ్య హాజరై మహిళా సంఘాలు గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రదీప్ కుమార్, రామకృష్ణ, వీవో అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి అమృత, సీసీ కరీం, వీవోఏ రవీందర్ తో పాటు పలు స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



**తూప్రాన్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** యూరియా ఆప్ ద్వారా రైతుల ఇబ్బంది పడుతున్నారని నేరుగా యూరియా విక్రయించాలని అని కోరుతూ రైతులు ధర్నాకు దిగారు. మెయిన్ రోడ్ లో యూరియా దుకాణం ముందు ఆందోళన దిగారు. యాప్ ద్వారా బుక్ చేసిన యూరియా ఇవ్వడం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతులకు అందుబాటులో యూరియా తేవాలని కోరారు, లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్సై గంగరాజు ఆందోళన కారులను శాంతింపచేశారు.

## బడంపేటలో 'లోక కల్యాణార్థమై' పాదయాత్ర గోడపత్రిక ఆవిష్కరణ

- **సెప్టెంబర్ 6న 4వ ఆధ్యాత్మిక పాదయాత్ర**
- **భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకుల పిలుపు**

**కోహీర్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం బడంపేట గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ రచ్చన్న స్వామి దేవస్థానంలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ నిర్వహించనున్న 4వ 'లోక కల్యాణార్థమై' ఆధ్యాత్మిక పాదయాత్ర గోడపత్రిక, ఆహ్వాన పత్రికలను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ దయానంద్ పాటిల్, పాదయాత్ర నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందిన అనంతరం పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికలు, ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. లోక శాంతి, సకల జనుల



సుఖసంతోషాలు, సౌభాగ్యం, సౌభ్రాతృత్వం కోసం ఈ ఆధ్యాత్మిక పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
సెప్టెంబర్ 6న ఆధ్యాత్మిక సందడి..
నాలుగోసారి నిర్వహించనున్న ఈ పాదయాత్రకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. పాదయాత్రలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. పాదయాత్ర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.
ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి జహీరాబాద్, బీదర్, నారాయణ్‌ఖేడ్, చిట్గుప్ప, సదాశివపేట్ ప్రాంతాల్లోని 'వేంకటేశ్వర షాపింగ్ మాల్' సహకారం అందిస్తోందని నిర్వాహకులు వెల్లడించారు.
పాదయాత్రకు సంబంధించిన ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తూ భక్తులను ఆహ్వానిస్తున్నామని, గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటే కార్యక్రమం మరింత వైభవంగా సాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక పాదయాత్రను భక్తులందరూ విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో వైభవంగా కళ్యాణ మహోత్సవం



**పెద్ద శంకరంపేట, ఆగస్టు 26 (జనంసాక్షి) :** పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో బుధవారం శ్రీ అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర దేవత కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర ఆలయ శిఖర ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పందిరిలో అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర దేవత కళ్యాణ మహోత్సవం వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో వైభవంగా జరిపించారు. ఆలయంలో. పుణ్యాహవాచనము. అఖండ దీప స్థాపనము. గణపతి పూజ. వాస్తు నవగ్రహ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం తిలకించడానికి అధిక సంఖ్యలో మహిళలు భక్తులు తరలివచ్చారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు చేశారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కొత్త ప్రభులు దాదిగారి గంగాధర్ కందుకూరి నర్సింలు. గడ్డం వెంకటేశం. కందుకూరి రవీందర్ పి సంతోష్ రాఘవులు రాజు శివశంకర్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానం

- **ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 26 (జనం సాక్షి) :** "రక్తదానం మహాదానం. రక్తానికి మతంతో సంబంధం లేదు.. ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత" అని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈద్ మిలాద్–ఉన్–నబీ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మహబూబ్‌నగర్ టీమ్ సోషల్ వర్కర్స్ ు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తానికి మతం, కులం, ప్రాంతం వంటి భేదాలు ఉండవని, మానవత్వమే అందరికీ ప్రధానమని అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "ఐక్యత, మానవత్వం, సామాజిక సేవ" అనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం సమాజంలో మతసామరస్యం, ఐక్యతను చాటిచెప్పే



కార్యక్రమం అని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రక్తదానం చేసిన దాతలను ఎమ్మెల్యే అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సాదుల్లా, నాయకులు అజ్మత్ అలి, మైత్రి యాదయ్య, సల్మాన్, అబ్దుల్ హక్, ఖాజా పాషా, రియాజుద్దీన్, మహ్మద్ అలీ, ఇమ్రాన్, మహబూబ్‌నగర్ టీమ్ సోషల్ వర్కర్స్, వెల్ఫేర్ సొసైటీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు లయన్ నటరాజ్, సభ్యులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రవక్త మహమ్మద్ బోధనలు మానవాళికి మార్గదర్శకం

- **వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :** ప్రవక్త మహమ్మద్ జీవితం, బోధనలు యావత్ మానవాళికి ఆదర్శప్రాయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి పట్టణంలోని గాంధీ చౌక్ మహమ్మదీయ మసీదుతో పాటు 2వ వార్డు మసీదులో



నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రేమ, కరుణ, దయ, నిజాయితీ, సహనం, సోదరభావం, పేదల పట్ల ఆదరణ వంటి గొప్ప మానవతా విలువలను ప్రవక్త మహమ్మద్ ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకుంటూ శాంతి, సామరస్యంతో జీవించాలని ఆయన బోధించారని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, పేదలకు సహాయం చేయడం, మనిషిని మనిషిగా గౌరవించడం, సమాజంలో సోదరభావాన్ని పెంపొందించడం ప్రవక్త బోధనల్లోని ముఖ్యమైన సందేశాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో వనపర్తి పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, ఎస్ ఎల్ ఎన్ రమేష్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, కౌన్సిలర్లు క్రాంతి, పరుశురాం, బి.కృష్ణ, ఏర్పుల రవి, పాల రవి, రఘు, మైనార్టీ నాయకులు రహీం, రఫిక్, సలీం, వక్ఫ్ బోర్డు సభ్యులు, ఆర్టిఏ సభ్యుడు జహంగీర్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు అబ్రార్, సమీర్, మైనార్టీ నాయకులు వసీం, ఇర్ఫాన్, జమీల్, ఆయుబ్ ఖాన్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గుడిసెల జాబితాను వెంటనే సమర్పించాలి

- **నివేదికలు ఇవ్వని అధికారులపై అసంతృప్తి**
- **అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక**
- **అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 26 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల మంజూరికి గుడిసెల జాబితాను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేసి వెంటనే సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లతో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, గుడిసెల జాబితా సమర్పణపై మహబూబ్‌నగర్ జిల్లా స్థాయిలో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ మండలాల నుంచి అందిన స్థితిగతుల నివేదికలను వివరంగా పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటివరకు గుడిసెల జాబితాను సమర్పించని మండలాల అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమాచారాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే జిల్లా కార్యాలయానికి నివేదించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం పట్ల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరమైన తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ ఉపేందర్ రెడ్డి, డీఈలు, ఏఈలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులేని ప్రయాణ సదుపాయాలు అందించాలి

- **ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి**

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :** ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన, ఇబ్బందులేని ప్రయాణ సదుపాయాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాపిడో సేవలను బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సుమారు 180 మంది రైడర్లతో రాపిడో సేవలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. వనపర్తి పట్టణంలో ప్రతిరోజూ సుమారు 40 నుంచి 45 వేల మంది ప్రజలు వివిధ అవసరాల కోసం ప్రయాణిస్తుంటారని, వారికి తక్కువ సమయంలో సౌకర్యవంతంగా గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. వనపర్తి పట్టణం రోజురోజుకూ విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో రాపిడో సేవలను పట్టణంతో పాటు అవసరమైన ప్రాంతాలకు విస్తరించి




ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. రాపిడో సేవల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైన అనుమతులు, పత్రాలు కలిగి ఉండేలా చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సేవల నాణ్యత విషయంలో రాజీ పడకుండా విశ్వసనీయమైన రవాణా సదుపాయాన్ని అందించాలని అన్నారు. రాపిడో సేవల ప్రారంభంతో పట్టణ ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు లభించడం సంతోషకరమైన విషయమన్నారు. యువత తమ నైపుణ్యాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి అనుగుణంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ప్రతి కార్యక్రమానికి తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అవసరమైన రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు మరింత పెరిగేలా భవిష్యత్తులోనూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, ఎస్ ఎల్ ఎన్ రమేష్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, కౌన్సిలర్లు క్రాంతి, పరుశురాం, బి.కృష్ణ, ఏర్పుల రవి, పాల రవి, రఘు, మైనార్టీ నాయకులు రహీం, రఫిక్, సలీం, వక్ఫ్ బోర్డు సభ్యులు, సభ్యుడు జహంగీర్, సమీర్, మైనార్టీ నాయకులు వసీం, ఇర్ఫాన్, జమీల్, ఆయుబ్ ఖాన్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**రాజాపూర్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** రంగారెడ్డి గూడ గ్రామానికి చెందిన చిత్తనూరి రవికుమార్ గుప్తా మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో శ్రీ వేంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించగా, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొని భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, శ్రీనివాస్ నాయక్, గోపినాయక్, రాములు గౌడ్, యాదయ్య, వినోద్ కుమార్, లక్ష్మీ నారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- చిట్యాల రైతు వేదికలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే




**చిట్యాల, ఆగష్టు 26(జనం సాక్షి) :** మహిళల సంక్షేమానికి ప్రజాపాలన ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం చిట్యాల మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు మహిళా సంఘాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. వీవో భవన నిర్మాణాలకు వీవీబీజీ రామ్‌జీ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో ముచినిపర్తి, గుంటూరుపల్లి, ఒడితల, దూతుపల్లి గ్రామాల్లో వీవో భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.మండలంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకొని అనేక ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలని లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు గతంలో ఎన్నో సంవత్సరాలుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూసిన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని పేర్కొన్నారు స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పారదర్శకంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి రైతుల సంక్షేమం పేదల జీవన ప్రమాణాలను మెరుగుదలకు కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వసంతరావు, ఎంపీడీవో జయశ్రీ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దబ్బేట అనిల్, సర్పంచులు రాజేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, తవటం లక్ష్మి, కొడారి అశోక్, బండి భగవాన్, నాయకులు పులి తిరుపతిరెడ్డి, ఓరం సమ్మయ్య, రాయ కొమురు, దొడ్డి కిష్టయ్య, కట్కూరి నరేందర్, బుర్ర లక్ష్మణ్,కంచర్ల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



**ఉట్నూర్ ఆగష్టు 26(జనం సాక్షి) :** ఉట్నూర్ మండలంలోని లింగోజితండా ఎక్స్ రోడ్ గ్రామంలో బుధువారం నూతన ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయంను ఐటీడీఏ ఏ పివో జాదవ్ వసంత్ రావు, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, స్థానిక సర్పంచ్ మాయహరి నాయక్ జాదవ్ ల చేతుల మీదుగా రబ్బీన్ కట్ చేసి కార్యాలయానికి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... ప్రభుత్వనికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టు వ్యవహారిస్తారని, వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ట్రైబల్ లో కూడా జర్నలిస్ట్ లు ఉండడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు లాకావత్ రమేష్, కార్యదర్శి మాడవి మాణిక్ రావు, చవాన్ రామేశ్వర్, కోశాధికారి జాదవ్ వసంత్ రావు, ఆదిలాబాద్ జిల్లా ఉప అధ్యక్షులు రాథోడ్ సంతోష్, ఆశిఫాబాద్ కొమురంభీం జిల్లా ఉప అధ్యక్షులు ఆత్రం రాము, ఉట్నూర్ ప్రచార కార్యదర్శి సిడం కైలాష్, రాథోడ్ నాందేవ్, జాయింట్ సెక్రటరీ జాదవ్ రవికిరణ్, డివిజన్ అధ్యక్షుడు రథోడ్ అజయ్, భీమ్ రావు, రవీందర్, మనోజ్, పీత నాయక్, దత్త, తదితరులు పాల్గొన్నారు.త

## రంగసాయిపేటలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



**వరంగల్ మండలం, ఆగష్టు 26 ( జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని రంగసాయిపేటలో బుధ వారం రాత్రి స్థానిక బంజారా మహిళలు, పురుషులు తీజ్ ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు గంగూర్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిం చారు. సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున హాజరై డాన్సులు చేస్తూ ఆనందాన్ని కలిగించారు. ఈ కార్యక్రమంలో గూగులోత్ రాము నాయక్, బాదావత్ సీతారాం నాయక్, బానోత్ మల్సూర్ నాయక్, బానోత్ మహేశ్వర్ నాయక్, బానోత్ వీరన్న నాయక్, భూక్య రవీందర్ నాయక్, మునావత్ హనుమంతు నాయక్, బానోత్ నాగమణి, గుగులోత్ సోనా భాయి, బానోత్ విజయ భాయి, బాదావత్ విజయ భాయి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ప్రజాప్రతినిధుల పేరుతో భర్తల పెత్తనం సరికాదు

- స్వేరోస్ జిల్లా నాయకులు గోలేటి నాగేష్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 26(జనంసాక్షి ):** రెబ్బన మండలంలోని గ్రామ పంచాయతీలలో మహిళా ప్రజాప్రతినిధుల పేరుతో వారి భర్తలు, కుటుంబ సభ్యులు పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయని స్వేరోస్ జిల్లా నాయకులు గోలేటి నాగేష్ అన్నారు. ఎన్నికైనది మహిళా ప్రజాప్రతినిధి అయితే, ప్రజల ముందు బాధ్యత వహించాల్సింది కూడా ఆమెనేనని పేర్కొన్నారు. మహిళకు పదవి ఇచ్చి, ఆ పదవికి సంబంధించిన నిర్ణయాలను మరొకరు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి, పంచాయతీ నిధులు ఎలా ఖర్చవుతున్నాయి, సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా అని ప్రజలు ప్రశ్నించడం వారి హక్కు అని తెలిపారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన చోట వ్యక్తిగత ఆరోపణలు చేయడం, కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజల సమస్యలను ప్రశ్నించే వారిని శత్రువులుగా చూడకుండా, వారి ప్రశ్నలకు పారదర్శకంగా సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రజాప్రతినిధుల పదవి పెత్తనం కోసం కాదు.. ప్రజలకు సేవ చేయడానికి అని స్పష్టం చేశారు. మహిళా సాధికారత అంటే మహిళకు పదవి ఇవ్వడం మాత్రమే కాదని, ఆ పదవికి సంబంధించిన నిర్ణయాధికారం కూడా మహిళ చేతుల్లోనే ఉండాలని అన్నారు. భర్తలు లేదా కుటుంబ సభ్యులు అధికారిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు నిజమైతే అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలను ప్రశ్నించకుండా చేయడం ప్రజాస్వామ్యం కాదు.. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పడమే నిజమైన ప్రజాస్వామ్యమని, మహిళా ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడుతూ, పంచాయతీల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గోలేటి నాగేష్ కోరారు. ప్రజల గొంతును అణచివేయకుండా, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

# గుప్పుమంటున్న గుడుంబా!

- గుట్టు చప్పుడు కాకుండా గ్రామాల్లో అమ్మకాలు
- మద్యానికి బదులు నాటు సారా తాగుతున్న పేదలు
- గుడుంబా మూలాలపై దృష్టి సారించని ఎక్సైజ్ శాఖ



**కౌటాల ఆగష్టు 26 (జనంసాక్షి) :** గ్రామాల్లో ఎక్కడ చూసిన గుడుంబా గుప్పుమంటోంది.గుడుంబా రహస్య ప్రాంతాల్లో తయారు చేస్తూ రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా అమ్మకదారులకు సరఫరా చేస్తున్నారు. మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద,మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు తక్కువ ధరల్లో లభించే గుడుంబా వైపు మరులుతున్నారు. దీంతో కౌటాల మండలంలోని పల్లెల్లో నాటు సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.పల్లెల్లో ప్లాస్టిక్ కవర్లలో నింపి రవాణా చేస్తున్నారు.గ్రామ శివార్లలో వాగులు, పంట చేనులో తయారు చేసి ఇతర గ్రామాలు ద్విచక్ర వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారు. కొందరు సారా తయారీనే వృత్తిగా మలుచుకొని పెద్దఎత్తున తయారుచేసి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.కొంత మంది ఇప్పపువ్వుతో మేలి రకం సారా తయారు చేసుకుని తాగుతుండగా మరికొందరు ఇప్పపువ్వుతో పాటు బెల్లం, కుళ్లిన అరటిపండ్లు, ఇతర మత్తు పదార్థాలతో గుడుంబా తయారు చేసి దందా సాగిస్తున్నారు.

### మందుబాబులు నాటుసారా వైపు

మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన కొందరు మత్తు కోసం సారాకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం తాగాలంటే వందల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. క్వాటర్ మద్యం కోనాలన్నా రూ.100కు పైగానే ఖర్చవుతోంది. ఇలాంటి సమయంలో తక్కువ ధరల్లో దొరుకుతున్న గుడుంబా తాగేందుకు మందుబాబులు నాటుసారా వైపు చూస్తున్నారు. గుడుంబా అమ్మకాలు గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్నట్లు తెలుస్తోంది. రోజువారి కూలీ పనులు చేసుకుని బతికేవారు చాలా మంది సారా, గుడుంబా తాగుతున్నట్లు సమాచారం.

### కిరాణ షాపుల్లో బెల్లం, పటిక లభ్యం

గతంలో ఇప్పపూలతో నాటుసారా తయారుచేసేవారు.ఇప్పుడు కిరాణ షాపుల్లో విచ్చల విడిగా బెల్లం, పటిక లభిస్తుండడంతో వాటితో సారా తయారు చేస్తున్నారు. షాపుల్లో బెల్లం, పటిక పై నిఘా పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటే కొంత అరికట్టే అవకాశం ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు.



### గుడుంబాపై నిఘా కరువు

మండలంలో గుడుంబాపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టలేకపోతుందనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా నాటుసారా తయారు చేసే మూలాలపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో విచ్చలవిడిగా నాటుసారా తయారవుతుందనే వాదన వినిపిస్తోంది. సారా అమ్మకాలు ఆగాలంటే తయారీ మూలాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గుట్టుగా తయారీ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. కొందరు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో గుడుంబాను పెద్ద ఎత్తున తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో పంట చేన్ల వద్ద గుట్టుగా తయారు చేస్తున్నారు. అయితే అప్పుడప్పుడు ఎక్సైజ్ అధికారులు గ్రామాల్లో దాడులు నిర్వహించి సారా అమ్మకాలపై వెతుకుతున్నారు. మూలాలను వెతకకుండా ఎక్కడో ఒకచోట దాడులు నిర్వహిస్తున్నారు. సారా ఎక్కడ తయారు చేస్తున్నారో గుర్తించి పక్కా వ్యూహంతో దాడులు చేస్తే అసలు నిందితులు దొరికే అవకాశం ఉంది.

### కఠిన చర్యలు తీసుకుంటాం



గుడుంబా తయారీపై ప్రత్యేక నిఘా పెట్టి, విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాము. నాటు సారా ప్రాణాలకే ప్రమాదం అలాంటి మద్యానికి జోలికి వెళ్లి కుటుంబాలు పాడు చేసుకోవద్దు.

**- ఎక్సైజ్ సీ ఐ రవి కుమార్ కాగజ్ నగర్**

## 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు

- ఓటరు జాబితాలో పేర్లు, వివరాలను సరిచూసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 26(జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు, వార్డుసభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటరు జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకునేందుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. అర్హులైన పౌరులు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు నమూనా–6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం నమూనా–7, వివరాల సవరణ కోసం నమూనా–8ను వినియోగించుకోవాలని సూచించారు. ఆచూకీ లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన, రెండు చోట్ల నమోదైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ, వార్డు సభల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అందులో ఏవైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే తగిన ఆధారాలతో సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ జాబితాలతోపాటు అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత పాటించనున్నట్లు వెల్లడించారు. అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభమైందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారి ద్వారా ఓటరుకు లేదా వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేస్తారని పేర్కొన్నారు. నోటీసులో తెలిపిన తేదీ, సమయం, ప్రదేశంలో ఓటరు స్వయంగా విచారణకు హాజరై అవసరమైన అసలు ధ్రువపత్రాలను చూపించాలని సూచించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు సమీప గ్రామ పంచాయతీ భవనం లేదా వార్డు కార్యాలయంలో విచారణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల నమోదు అధికారి లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి ఎదుట హాజరై ధ్రువపత్రాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఓటర్ల సేవల అంతర్జాల వేదిక ద్వారా కూడా సంబంధిత పత్రాలను ముందుగానే జతచేయవచ్చని తెలిపారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. 1987 జూలై 1కి ముందు జన్మించిన వారు ఎన్నికల సంఘం గుర్తించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని పేర్కొన్నారు. 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లి లేదా తండ్రికి సంబంధించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి అందజేయాలని తెలిపారు. 2004 డిసెంబర్ 2 తరువాత జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లిదండ్రులిద్దరి ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. శాశ్వత నివాస, అటవీ హక్కులు, కుల, జనన ధ్రువపత్రాలు, కుటుంబ నమోదుపత్రం, ప్రభుత్వ భూమి లేదా గృహ కేటాయింపు పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, పదో తరగతి లేదా ఇతర విద్యార్హత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డు, పింఛను చెల్లింపు ఆదేశ పత్రం, జాతీయ పౌరుల నమోదుపత్రంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, జీవిత బీమా సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారని పేర్కొన్నారు. 2002 ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాతో వివరాలు సక్రమంగా అనుసంధానమైన ఓటర్లు అదనపు ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆగస్టు 10లోగా గణన పత్రాన్ని సమర్పించని వారు దావాలు, అభ్యంతరాల స్వీకరణ కాలంలో దరఖాస్తు నమూనా–-6తోపాటు నిర్ణీత ప్రకటన పత్రాన్ని అందజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని కలెక్టర్ కోరారు. పేరు నమోదు కాకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా సవరణకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియపై సందేహాలు లేదా సమస్యలు ఉంటే దూరవాణి సంప్రదింపుల నమోదు సేవ, జాతీయ ఓటరు సేవల ఫిర్యాదుల అంతర్జాల వేదిక ద్వారా లేదా 1950 ఉచిత సహాయ సంఖ్యను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.

## అసౌకర్యాలతో 'కుస్తీ'.. విద్యార్థుల సాధన నాస్తి

- గాయాలపాలవుతున్న రెజ్లర్స్
- అవస్థల నడుమ అరకొర శిక్షణ



**మావల ఆగస్ట్ 27( జనం సాక్షి):** భవిష్యత్తు క్రీడాకారులకు ఆదిలోనే సమస్యలు పలకరిస్తున్నాయి. అరకొర వసతుల నడుమ సాధన చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడ పాఠశాలకు చెందిన విద్యార్థులు సౌకర్యాలు లేక రెజ్లింగ్ సాధనలో వెనుకబడి పోతున్నారు. నేర్చుకోవాలనే తపన, ఆసక్తి ఉన్నప్పటికీ అసౌకర్యాలతో పూర్తిస్థాయిలో తమ సామర్థ్యాన్ని ప్రదర్శించలేక పూర్తిస్థాయిలో రాణించలేకపోతున్నారు. ఇన్నీ సమస్యలున్నప్పటికీ, పట్టుదలతో శ్రమించి పతకాలు సాధిస్తుండడం విశేషం. మరిన్ని అధినేతన సదుపాయాలు కల్పిస్తే మరిన్ని విజయాలు నమోదు చేసే అవకాశాలు ఉంటాయి.

### మ్యాటే లేకపోయే..

కుస్తీ సాధనకు రెజ్లింగ్ మ్యాట్ తప్పనిసరి. ఈ మ్యాట్ లేకపోతే శిక్షణ సంగతి అటుంచితే, ఆటను ఆడటమే సాధ్యం కాదు. అలాంటిది క్రీడా పాఠశాల విద్యార్థులకు అత్యవసరమైన ఈ మ్యాట్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీంతో శిక్షకుడు చిన్నపాటి ఫోమ్‌ను ఏర్పాటు చేసి, దానిపై కవర్ పరచి విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. చిన్నప్పటి నుంచే అసలైన రెజ్లింగ్ మ్యాట్‌పై శిక్షణ పొందితే, పోటీల్లో తమ సామర్థ్యానికి అనుగుణంగా రాణించే అవకాశం ఉంటుంది. మ్యాట్ ఉపరితలంపై సాధన చేయడం వల్ల బ్యాలెన్స్, వేగవంతమైన కదలికలు, క్రీడా సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపడతాయని శిక్షకుడు తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలన్నీ ఇలాంటి మ్యాట్‌పైనే నిర్వహిస్తుండడంతో క్రీడాకారులు కూడా అదే తరహా ఉపరితలంపై శిక్షణ పొందడం ఎంతో అవసరం. అయితే ప్రస్తుతం ప్రామాణికమైన మ్యాట్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన ఫోమ్‌పై సాధన చేయాల్సి వస్తోంది. దీంతో సాధన సమయంలో పలువురు చిన్నారులు గాయాల పాలవుతుండగా, ఆటపై భయంతో ప్రాక్టీస్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా వారు రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాల వేటలో వెనుకబడుతున్నారు.

### సమస్యల మధ్య సాధన..

ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వినియోగంలో లేని ఓ ఫంక్షన్ హాల్లో కుస్తీ సాధనకు రెజ్లింగ్ హాల్ కేటాయించారు. ఆ హాల్లో సరైన సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల సౌకర్యాలు అధ్వానంగా ఉండడంతో దోమలతో సావాసం చేస్తున్నారు. వర్షం పడినప్పుడు చుట్టుపక్కల నుంచి మ్యాట్ వరకు నీరు వస్తుండటం, పైనుంచి నీరు ఊరుస్తుండడంతో మ్యాట్స్ పై పడి ఆటకు అంతరాయం కలుగుతుంది. దీంతో ఆటలో నైపుణ్యం సాధించడం పక్కన పెడితే, సాధారణ మెళకువలు ను అభ్యసించేందుకు నెలల సమయం పడుతుంది. ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా, చేస్తామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇబ్బందులు దూరం కావడం లేదు.

### క్రీడా కిట్లు కొనుక్కోవాల్సిందే..

కుస్తీ క్రీడాకారులు ధరించే ప్రత్యేకమైన దుస్తులను 'రెజ్లింగ్ సింగ్లెట్' అని పిలుస్తారు. ఇవి ఇతర క్రీడా దుస్తుల కంటే భిన్నంగా ఉంటాయి. కుస్తీ ఆడేటప్పుడు ప్రత్యర్థిని పట్టుకోవడానికి వీలు లేకుండా, అలాగే రెఫరీలకు క్రీడాకారుల శరీర కదలికలు స్పష్టంగా కనిపించేలా వీటిని రూపొందిస్తారు. నాణ్యతను బట్టి వీటి ధర సుమారు రూ. 1,500 నుండి రూ. 5,000 వరకు ఉంటుంది. అలాగే, కుస్తీ క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన షూస్ కూడా ఉంటాయి. ఇవి మ్యాట్ మీద జారకుండా ఉండేలా డిజైన్ చేస్తారు. అయితే, క్రీడా పాఠశాలలోని చిన్నారులు ఇవేవీ లేకుండానే ప్రాక్టీస్ చేస్తున్నారు. పాఠశాల నుంచి ఈ కిట్లు అందాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు అందించకపోవడంతో తల్లిదండ్రులే సొంత ఖర్చులతో కొనుగోలు చేసి ఇస్తున్నారు.

### ఇవి సమకూరిస్తే సానుకూల ప్రభావం..

క్రీడాకారుల సాధనకు సంబంధించి అత్యవసరమైన రెస్లింగ్ మ్యాట్ రూ. 5 లక్షల వరకూ ఉంటుంది. ఇది 12 లి12 మీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుంది. దీనిని అందుబాటులోకి తీసుకువస్తే పూర్తిస్థాయిలో సాధన చేయవచ్చు. కుస్తీ ఆడేవారికి పట్టు అనేది ఎంతో కీలకం. దీంట్లో నైపుణ్యం సాధించాలంటే క్లైమ్బింగ్ రోప్స్ ఉపయోగపడతాయి. ప్రస్తుత క్రీడాకారుల అవసరాలకు అనుగుణంగా ఓ 4 రోప్స్ అవసరం ఉన్నట్లు తెలుస్తోంది.

అదేవిధంగా ప్రాథమిక అంశాలు అభ్యసించిన తర్వాత నిరంతరం సాధన చేయడానికి రెజ్లింగ్ డమ్మీలు ఎంత ఉపయుక్తంగా ఉంటాయి. ఇవి కూడా లేకపోవడంతో సాధన అరకొరగా సాగుతోంది. నాలుగు డమ్మీలను ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయిలో చిన్నారుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయవచ్చు. రెజ్లింగ్ హాల్లోని చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ సరైన గాలి వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేస్తే చిన్నారులు జిల్లా పేరును రాష్ట్ర, జాతీయ క్రీడా వేదికల్లో రెపరెపలాడిస్తారనే అభిప్రాయాలు క్రీడాభిమానుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
27 ఆగస్టు 2026

# నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి తుమ్మల

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** గిరిజన ప్రాంతంలో విద్యా ప్రమాణాలను మరింత పెంచడంతో పాటు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలతో పాటు చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులకు సైతం నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించే దిశగా రఘునాథపాలెం మండలం జింకలతండాలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్వామినారాయణ గురుకుల పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి బుధవారం భూమిపూజ, శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 13.10 ఎకరాల్లో స్వామి నారాయణ గురుకుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన అందించనున్నారన్నారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో పాఠశాల భవనాలు, విద్యార్థులకు అవసరమైన ఆధునిక సౌకర్యాలతో క్యాంపస్ రూపుదిద్దుకోనుందని తెలిపారు.



విద్యతో పాటు మానవతా విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా విద్యాబోధన సాగనుందని మంత్రి తెలిపారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ విలువలను విద్యార్థుల్లో పెంపొందించేలా గురుకుల్ విద్యా విధానం ఉండనుందన్నారు. తెలంగాణలో స్వామినారాయణ గురుకుల్‌కు ఇది 5వ విద్యాసంస్థ అని మంత్రి అన్నారు. పాఠశాలలో అందుబాటులో ఉండే సీట్లలో 10 శాతం సీట్లను ఎలాంటి ఫీజు లేకుండా నిరుపేద విద్యార్థులకు కేటాయించే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు అప్పగించారన్నారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందే అవకాశం లభించనుందని తెలిపారు. గిరిజన ప్రాంతాలతో పాటు ఖమ్మం జిల్లా, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు నాణ్యమైన విద్యను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఈ విద్యాసంస్థ ఏర్పాటు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందని, స్వామినారాయణ గురుకుల్ విద్యా విధానం ఈ లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని మంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, స్వామీ నారాయణ్ గురుకుల్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

- మహిళా సంక్షేమానికి కెసిఆర్ పెద్దపీట
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన గౌరవం దక్కే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మహిళా సమానత్వం అనేది కేవలం ఒక నినాదంగా కాకుండా ఆచరణలో కనిపించాల్సిన అంశమని అన్నారు. మహిళల సాధికారతతోనే ప్రతి కుటుంబం, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాటలకే పరిమితం చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తామని, యువతులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, హామీల అమలులో స్పష్టత లేకపోవడం, పూర్తిగా విస్మరించిన నేపథ్యంలో మహిళలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. గతంలో మహిళల సంక్షేమం, భద్రత, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉందని పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. మహిళలకు కేవలం పథకాలు ప్రకటించడం కాకుండా వాటిని సమర్థవంతంగా అమలు చేసి, వారి జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో పేదల కళ్ళల్లో ఆనందం



**చేర్యాల, ఆగస్టు 26 (జనంసాక్షి) :** జనగామ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప రెడ్డి ఆదేశాల మేరకు స్మార్ట్ రేషన్ కార్డులను జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు బుధవారం గ్రామంలో రేషన్ షాపు వద్ద పలువురికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు దారులకు తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ కార్డు మంజూరు చేయడం ఏంతో ఆనందం గా ఉందన్నారు. రేషన్ కార్డు అనేది పేదవారికి ఒక గుర్తింపు కార్డు అని, గత పది సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వం అణిచివేస్తే ప్రజాప్రభుత్వం పేదవారిని హక్కున చేర్చుకున్న ఘనత రేవంత్ రెడ్డి కి మాత్రమే దక్కిందన్నారు. కార్యక్రమంలో కరెడ్ల రంజిత్ రెడ్డి, కల్లూరి పర్శరాములు, చింటూ, వరుకోలు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# రంగంపేటలో రచ్చబండకు రావాలి

- దమ్ముంటే ఆరోపణలకు సమాధానం చెప్పాలి
- 29న రచ్చబండలో తేల్చుకుందాం
- బిఆర్ఎస్ నేతల సవాల్

**కొల్చారం, ఆగస్టు 26 (జనం సాక్షి) :** డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్‌పై కొల్చారం మండల కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలు సరికావని రంగంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ నెల 29న శనివారం రంగంపేటలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమానికి హాజరై తమ ఆరోపణలకు సమాధానం చెప్పాలని రంగంపేట ఉపసర్పంచ్ చిట్కుల సురేష్, బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు ఇసుక సుధాకర్, మాజీ సర్పంచ్ విజయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గమని గంగాధర్, ఎలుక గంగులు సవాల్ విసిరారు.

మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేటలోని అరిగే రమేష్ కుమార్ ఫామ్‌హౌస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రమేష్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుని వచ్చి రంగంపేటలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. ఆయన స్వయంగా సంపాదించిన డబ్బులతో సర్వే నంబర్ 204లో భూములు కొనుగోలు చేశారని పేర్కొన్నారు.

అయితే ఆయన వద్ద గతంలో పనిచేసిన కొందరు కార్యకర్తలు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకులుగా చలామణి



అవుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. రంగంపేట మాజీ సర్పంచ్ భర్త బండి రమేష్ గత ఐదేళ్లలో పలు వెంచర్లలో కమిషన్లు తీసుకున్నారని, దేవుని గుడి పేరిట కమాన్ కోసం ఇచ్చిన రూ.2 లక్షల విషయంలోనూ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే బీసీ కార్పొరేషన్ రుణాల్లో పర్సంటేజీలు వసూలు చేశారంటూ ఆరోపించారు.

ఈ ఆరోపణలకు ఆధారాలతో రచ్చబండ కార్యక్రమంలో సమాధానం చెప్పాలని, ఆరోపణలు నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు పేర్కొన్నారు.

సమావేశంలో గోపిగారి సత్యాగౌడ్, ఆరేటి మల్లేశం, నీలకంటి ప్రవీణ్, గమని గంగారం, శివరాములు, బక్కప్ప, గోకర్ నరసింహులు, రాయిని మల్లేశం, రమేష్, బోయి వెంకటేశం, ఎలివేషన్, బట్ట జీవులు తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం



**శంషాబాద్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** ఆర్థిక లావాదేవీల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ వ్యాపారి అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి ప్రకారం పెద్దషాపూర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గుల్ల నవీన్ కుమార్ (29) అదృశ్యమైనట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆర్థిక లావాదేవీల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నవీన్ కుమార్ ఆగస్టు 25న సాయంత్రం తన ఫోన్‌ను ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని సోదరి గుల్ల రావళి ఫిర్యాదు చేశారు. బంధువులు, పరిచయస్తులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. నవీన్ కుమార్ చామనచాయ రంగులో, గుండ్రటి ముఖంతో, నల్లటి జుట్టుతో, 5.5 అడుగుల ఎత్తు ఉంటాడని, ఇంటి నుంచి వెళ్లేటప్పుడు తెలుపు రంగు షర్ట్, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, ఆగస్టు 26 (జనంసాక్షి) :** పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, నియోజకవర్గ పరిధిలోని ప్రతి తండా, గ్రామ సమగ్ర అభివృద్ధికే నా మొదటి ప్రాధాన్యతని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు నక్కలబండ తండాకు చెందిన మునావత్ సుజాత రవి నాయక్ దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు నూతన గృహ ప్రవేశ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహాన్ని ప్రారంభించి దంపతులకు శుభాకాంక్షలు, ఆశీస్సులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోపాల్ నాయక్, నీలవేణి, కిషన్ నాయక్, కమలం శేఖర్, దినేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, వార్డు నాయకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకు పూర్తి మద్దతు



**సూర్యాపేట, ఆగస్టు 26 (జనంసాక్షి) :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకు తమ పూర్తి మద్దతు ఉంటుందని బీసీ ఉద్యమ నాయకులు వట్టె జానయ్య యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రైతు బజార్ లో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కేటాయించాలనే డిమాండ్‌తో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో కూర్చున్న దివ్యాంగుల ఐక్య సంఘాల నాయకులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సూర్యాపేట మీదుగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వస్తే జిల్లాలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక, విద్యా రంగాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు చేపడుతున్న ఉద్యమానికి బీసీ సంఘం తరఫున అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వచ్చేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకు జరిగే ఉద్యమాలకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సైతం బుల్లెట్ ట్రైన్ కోసం జరుగుతున్న నిరాహార దీక్షలో పాల్గొని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజల ఆకాంక్ష కోసం జరుగుతున్న ఉద్యమంలో ఎమ్మెల్యే ప్రత్యక్షంగా పాల్గొనాలని అన్నారు.

# బాలయ్య మృతి ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

**శేరిలింగంపల్లి, ఆగస్టు 26 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్పేట్ డివిజన్ పరిధి ప్రేమ్ నగర్ వాసి బాలయ్య ఆర్‌ఓబి వద్ద నాలో కొట్టుకుపోయి దుర్మరణం చెందడం, ఇప్పటికీ ఆయన మృతదేహం లభించకపోవడం ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ బాధ్యతారహిత్యమేనని టిఆర్ఎస్ పార్టీ శేర్లింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి వాసిలి చంద్రశేఖర ప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం శేరిలింగంపల్లి లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ జులై 28న జరిగిన ఘటన నెల రోజులు గడుస్తున్న నాళాలు బాలయ్య మృతదేహం ఎక్కడ ఉందో అంతుచిక్కకపోవడం ఎంతవరకు సమంజసం అని ? దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని..?? ఆయన ప్రశ్నించారు. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న బాలయ్య దుర్మరణంతో ఆ కుటుంబం అత్యంత దయనీయ పరిస్థితికి చేరుకుందని, ఘటన జరిగిన ఒకటి, రెండు రోజులు కంటితడుపు చర్యగా వచ్చిన అధికారులు, పాలకులు ఆ తర్వాత బాలయ్య మృతదేహాన్ని వెతకడం, ఆయన కుటుంబానికి మనో ధైర్యాన్ని అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కూడా నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగడం లేదని, మనుషులకు స్థాయిని నిర్ణయించి ప్రభుత్వం సహకరిస్తుండడం సిగ్గుచేటని అన్నారు. బాలయ్యకు ఆర్థిక, సామాజిక, రాజకీయ పలుకుబడి లేనందుకే వారిని అనాధలుగా చులకన భావంతో చూస్తున్నారని, ఆయన కుటుంబ సభ్యులను కదిలిస్తే ఈ సమాజానికి అర్థమవుతుందని అన్నారు. ఉదయం లేచింది మొదలు పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి, ప్రజా పాలన



అని జబ్బులు చరుచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం బాలయ్య విషయంలో ఎందుకు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందో ఆయన కుటుంబానికి, శేరిలింగంపల్లి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బాలయ్య కుటుంబ సభ్యులలో పిల్లలకు సిఎంసిలో వెంటనే ప్రభుత్వ ఉద్యోగం, ఒక డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఇదే తరహాలో చందానగర్ డివిజన్ పిజెఆర్ రోడ్డులో శ్రీకాంత్ రెడ్డి అనే వ్యక్తి పీజేఆర్ ఎంక్లేవ్ నాలాలో పడి చనిపోతే తాను లక్షా 50 వేల రూపాయలను ఆర్థిక సహకారం కింద అందించిన విషయాన్ని గుర్తు చేస్తూ బాలయ్య సతీమణి పద్మకు సైతం తన వంతు సహకారంగా 50 వేల రూపాయలను అందజేస్తున్నట్లు తెలిపారు. బాలయ్య కుటుంబానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని, వారి కుటుంబానికి ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందే వరకు తాను అండగా నిలబడతానని ఆయన భరోసాను వ్యక్తం చేశారు.

## బస్సు ప్రమాదంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పిస్తాం

- బస్సు ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ




**కోదాడ, ఆగస్టు 26 (జనం సాక్షి) :** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ఫ్రెష్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే. నరసింహ కలిసి ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను స్థానికులను, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కోదాడ ఆసుపత్రికి, తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘటన ప్రాంతంలో స్థానిక పోలీస్ అధికారులు, రెవెన్యూ , వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మానస విద్యా మందిర్ 'లెక్కల' మాస్టారు సంతోష్ సార్‌కు కన్నీటి వీడ్కోలు..

- బతికించుకోవాలని ఆరాటపడినా దక్కని ప్రాణాలు
- ఆసుపత్రి ఖర్చుల కోసం చందాలు వేసుకున్న విద్యార్థులు, గ్రామస్తులు
- శోక గీతాలు, బైక్ ర్యాలీతో అశ్రునయనాల మధ్య భౌతికకాయానికి స్వాగతం
- చాడ గ్రామంలో తీరని విషాదం

**మోటకొండూరు, ఆగస్టు 26 (జనం సాక్షి) :** ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఆదర్శ గురువు ఇక లేరు. తరగతి గదిలో అంకెలతో ఆడుకుంటూ విద్యార్థులకు లెక్కల భయం పోగొట్టిన ఆ మాస్టారు.. అనారోగ్యంతో పోరాడుతూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామానికి చెందిన, మానస విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ప్రముఖ మ్యాథ్స్ ఉపాధ్యాయుడు నీరానెముల సంతోష్ సార్ మరణవార్త విని గ్రామం కన్నీరుమున్నీరవుతోంది.



### గురువు రుణం తీర్చుకునేందుకు..

సంతోష్ సార్‌పై ఉన్న ప్రేమను, భక్తిని విద్యార్థులు ఆయన బతికి ఉన్నప్పుడే చాటుకున్నారు. సార్‌కు తీవ్ర అనారోగ్యం చేసిందని తెలియగానే.. ఆయన ప్రాణాలు నిలబెట్టుకోవడం కోసం మానస విద్యా మందిర్ విద్యార్థులు, గ్రామ యువత, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఏకమయ్యారు. తలా ఒక చేయి వేసి, చందాలు సేకరించి ఆసుపత్రి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. 'మా సంతోష్ సార్ మాకు కావాలి.. ఎలాగైనా బతికించుకుంటాం' అని పరితపించారు. కానీ, వారి ప్రార్థనలు ఫలించలేదు. విధి కాటేయడంతో ఆయన తుదిశ్వాస విడిచారు.

### గుండెలు పిండేసిన వీడ్కోలు..

తమ ప్రాణప్రదమైన ఉపాధ్యాయుడి భౌతికకాయాన్ని ఆసుపత్రి నుంచి స్వగ్రామమైన చాడకు తీసుకొచ్చే క్రమంలో గుండెలు పిండేసే దృశ్యాలు కనిపించాయి. శిష్యులు, గ్రామ యువకులు, మిత్రులంతా కలిసి బైక్ ర్యాలీగా ఎదురెళ్లి తమ గురువుకు కన్నీటితో ఘన స్వాగతం పలికారు. డీజేలో శోక గీతాలు మార్మోగుతుండగా.. అశ్రునయనాల మధ్య ఆయన భౌతికదేహాన్ని గ్రామంలోకి తీసుకొచ్చారు. 'మమ్మల్ని వదిలి వెళ్ళిపోయావా సార్' అంటూ విద్యార్థులు బోరున విలపించడం అక్కడున్న వారిని కలచివేసింది. అనంతరం గ్రామస్తులు, విద్యార్థులు, బంధుమిత్రుల సమక్షంలో సంతోష్ సార్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ముగిశాయి. ఒక మంచి గురువును, మంచి మనిషిని కోల్పోయామని చాడ గ్రామస్తులు, విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

# విపణి

# ఒత్తిడికి చిత్తైన సూచీలు

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ.. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం సూచీలను పడేసింది. ఐటీ, ఎఫ్‌సీఎంజీ, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సూచీలు నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 183.15 పాయింట్ల కోల్పోయి 77,472.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 126.80 పాయింట్లు పతనమై 24,207.75 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30లో ప్రధానంగా ఇన్ఫోసిస్, భారతీఎయిర్‌టెల్, ఎల్‌అండ్‌టీ, పవర్‌గ్రిడ్, టెక్‌మహీంద్రా, ఎన్‌టీపీసీ షేర్లు నష్టాలను చవిచూశాయి. కోటక్‌బ్యాంక్, అల్ట్రాటెక్‌సిమెంట్, యాక్సిస్‌బ్యాంక్, టాటాస్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ షేర్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 85.88 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,618.87 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ఆఖరి గంటలో కొనుగోళ్లు..**

రోజులో చాలా వరకు నష్టాల్లో కదలాడిన సూచీలు.. ఆఖరి గంటలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధర బాగా తగ్గడం ఇందుకు కారణం. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 26 పైసలు పెరిగి 95.44 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 3.92% తగ్గి 88.56 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.27 లక్షల కోట్లు పెరిగి రూ.493.23 లక్షల కోట్ల (5.15 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,295.49 పాయింట్ల వద్ద నష్టాల్లో ఆరంభమై, ఒక దశలో 77,125.91 పాయింట్లకు దిగివచ్చింది. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ, చివరకు 286.98 పాయింట్ల లాభంతో 77,656.09 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 115.50 పాయింట్లు లాభపడి 24,334.55 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,115.45 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది కూడా. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 6 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. ఇండిగో 2.05%, అదానీ పోర్ట్స్ 1.19%, ఇన్ఫోసిస్ 1.15%, ట్రెంట్ 1.10%, టైటన్ 0.98%, ఎస్‌బీఐ 0.87% పెరిగాయి. ఎటర్నల్ 0.85%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.68%, పవర్‌గ్రిడ్ 0.53%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.29%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.26% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో టెలికాం, హాస్పిటల్స్, లోహ, సర్వీసెస్, గృహ రుణాల సూచీలు పెరగ్గా ప్రైవేట్ బ్యాంకెక్స్, బీమా డీలాపడ్డాయి. హిందుస్థాన్ కాపర్‌లో 6% వాటా విక్రయానికి మంచి స్పందన లభిస్తోంది. సంస్థాగత మదుపర్లకు 2.61 కోట్ల షేర్లను కేటాయించగా.. దీనికి 3.41 రెట్లు అధికంగా 8.91 కోట్ల షేర్లకు బిడ్‌లు మంగళవారం దాఖలయ్యాయి. వీటి విలువ రూ.4,600 కోట్లు. మొత్తం 5.8 కోట్ల షేర్లను రూ.514 కనీస ధర వద్ద ప్రభుత్వం విక్రయిస్తోంది. చిన్న మదుపర్లు బుధవారం దరఖాస్తు చేసుకోవచ్చు. శంకేశ్ జ్యువెలరీస్ షేరు ఇష్యూ ధర రూ.93తో పోలిస్తే, బీఎస్ఈలో 9.89% అధికంగా రూ.102.20 వద్ద నమోదైంది. ఒక దశలో 19.34% పెరిగి రూ.110.99ను చేరింది. చివరకు 2.18% లాభపడి రూ.95.03 వద్ద ముగిసింది. సన్‌షైన్ పిక్చర్స్ షేరు రూ.394 వద్ద బీఎస్ఈలో నమోదైంది. ఇష్యూ ధర రూ.360 కంటే ఇది 9.44% ఎక్కువ. చివరకు 2.47% లాభంతో రూ.368.90 వద్ద ఈ షేరు ముగిసింది. స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ ఐపీఓ రెండో రోజుకే 2.46 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 3.53 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. హై-టెక్ ఇంజినీర్స్ లిమిటెడ్ ఐపీఓ రెండో రోజుకే 19.31 రెట్లు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 27.22 రెట్ల అధిక స్పందన లభించింది. ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఐపీఓకు ధరల శ్రేణిగా రూ.408- 429ను నిర్ణయించారు. రూ.720 కోట్ల ఐపీఓ ఈనెల 28న ప్రారంభమై సెప్టెంబరు 1న ముగియనుంది. పర్పుల్ స్టైయిల్ ల్యాబ్స్ ఐపీఓ ఆగస్టు 31న ప్రారంభమై సెప్టెంబరు 2న ముగియనుంది. ఇష్యూ పూర్తిగా తాజా షేర్ల జారీ రూపేణా ఉండనుంది. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా కంపెనీ రూ.680 కోట్లు సమీకరించనుంది.

## ప్రపంచంలో అత్యంత ఆదరణ పొందిన కంపెనీ యాపిల్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ మరో ఘనత సాధించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన కంపెనీగా నిలిచింది. మైక్రోసాఫ్ట్, అమెజాన్ కంపెనీలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ మేరకు ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ కార్న్ ఫెర్రీ, ఫార్చ్యూన్.కామ్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 1500 కంపెనీలపై సర్వే నిర్వహించి ఈ ర్యాకింగ్‌లు ఇచ్చారు. ఆదాయం ఎక్కువ ఉన్న కంపెనీలను వడబోసి జాబితా రూపొందించారు. 3 వేల మందికి పైగా ఎగ్జిక్యూటివ్‌లు, డైరెక్టర్లు, సెక్యూరిటీస్ విశ్లేషకుల ఆధారంగా టాప్-50 ర్యాంకులను నిర్ణయించారు. ఆవిష్కరణలు, నిర్వహణ, సామాజిక బాధ్యత, కంపెనీ ఆస్తులు వంటి పలు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి యాపిల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఏఐ రంగంలో నాయకత్వం, ఓపెన్‌ఏఐ భాగస్వామ్యం, కోపైలట్ బ్రాండెడ్ ఏఐ అప్లికేషన్స్ ఆధారంగా మైక్రోసాఫ్ట్ రెండో స్థానంలో నిలిచింది. అమెజాన్-3, ఎన్విడియా-4, జేపీమోర్గాన్ చేజ్-5, బెర్క్‌షైర్ హాత్వే-6, కాస్ట్‌కో హోల్‌సేల్-7, ఆల్ఫాబెట్-8, వాల్‌మార్ట్-9, అమెరికన్ ఎక్స్‌ప్రెస్-10వ స్థానాలను ఆక్రమించాయి.

### మళ్లీ ఎల్‌సీడీ డిస్‌ప్లేల వైపు స్మార్ట్‌ఫోన్ కంపెనీలు..

## ఎందుకీ పరిస్థితి?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ప్రస్తుతం ఖర్చులు తగ్గించుకునే పనిలో పడ్డాయి మెమొరీ చిప్‌ల ధరల పెరుగుదలతో స్మార్ట్‌ఫోన్ తయారీ వ్యయాన్ని భర్తీ చేసేందుకు డిస్‌ప్లే ఖర్చును తగ్గించుకుంటున్నాయి. ఒకప్పుడు రూ.20వేల ధరలో అమోలెడ్ స్క్రీన్లతో ఫోన్లు లాంచ్ చేసిన కంపెనీలు.. ఇప్పుడు రూ.30వేల బడ్జెట్ కలిగిన స్మార్ట్‌ఫోన్‌లోనూ ఎల్‌సీడీ డిస్‌ప్లేతో సరిపెట్టేస్తున్నాయి. ఇటీవల కాలంలో లాంచ్ అయిన ఫోన్లే అందుకు ఉదాహరణ. ఇంతకీ ఎందుకిలా చేస్తున్నాయ్? ఎల్‌సీడీ, అమోలెడ్, ఓఎల్ఈడీ డిస్‌ప్లేలకు మధ్య తేడా ఏంటి?

**స్క్రీన్ల మధ్య ఏమిటి తేడా?**

ఓఎల్ఈడీ డిస్‌ప్లే: ఓఎల్ఈడీ అంటే ఆర్గానిక్ లైట్ ఎమిటింగ్ డయోడ్. ఇందులో ప్రతి పిక్సెల్ సొంతంగా లైటింగ్‌ను ఉత్పత్తి చేస్తుంది. అంటే ప్రతి చిన్న డాట్‌కు సొంత లైటింగ్‌ను, రంగును ఇస్తుంది. దీనికి ప్రత్యేకంగా ఎలాంటి బ్యాక్‌లైట్ ఉండదు. నలుపు రంగులను చూపించాల్సి వచ్చినప్పుడు ఆ పిక్సెల్స్ పూర్తిగా ఆఫ్ అయిపోతుంది. దీనివల్ల మంచి పిక్చర్ క్వాలిటీతో పాటు బ్యాటరీ కూడా ఆదా అవుతుంది.

**అమోలెడ్ డిస్‌ప్లే:** అమోలెడ్ అంటే యాక్టివ్ మ్యాట్రిక్స్ ఆర్గానిక్ లైట్ ఎమిటింగ్ డయోడ్. ఇది ూఒఇఆకి అప్‌గ్రేడెడ్ వెర్షన్. యాక్టివ్ మ్యాట్రిక్స్‌ను జోడించడం వల్ల ప్రతి పిక్సల్‌పై మరింత వేగవంతమైన నియంత్రణ లబి.స్తుంది. ఇందులో ఉండే ట్రాన్సిస్టర్ గ్రిడ్ చాలా వేగంగా ఆన్, ఆఫ్ అవుతుం ది. దీనివల్ల బ్యాటరీ మరింతగా ఆదా అవుతుంది. ఈ డిస్‌ప్లే ఎక్కువగా ప్రీమియం, మిడ్ రేంజ్ ఫోన్లలో కనిపిస్తాయి. వీటి తయారీ ఖర్చూ ఎక్కువే.



**ఎల్‌సీడీ డిస్‌ప్లే:** ఎల్‌సీడీ అంటే లిక్విడ్ క్రిస్టల్ డిస్‌ప్లే. ఇందులో లిక్విడ్ క్రిస్టల్స్ వెనుక ఒక ప్రత్యేకమైన లైట్ ప్యానెల్ ఉంటుంది. ఈ క్రిస్టల్స్ ద్వారా కాంతి ప్రసరిస్తుంది. తక్కువ ధరలో ఫోన్ అందించేందుకు ఈ ఎల్‌సీడీ డిస్‌ప్లేలను స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఎంచుకుంటూ ఉంటాయి.

**ఎవరికి ఏ స్క్రీన్?**

స్క్రీన్ చూడటానికి ప్రీమియంగా అనిపించాలన్నా, డీప్ బ్లాక్స్, మెరుగైన బ్రైట్‌నెస్ కావాలనుకుంటే ఓఎల్ఈడీ,అమోలెడ్ డిస్‌ప్లేలు ఉత్తమం. డార్క్ మోడ్‌లో ఫొటోలు, సినిమాలు చూడటానికి ఇవి చాలా బాగుంటాయి. తక్కువ ధరలో ఫోన్ కావాలనుకునేవారు, పెద్దగా సినిమాలూ, వీడియోలూ చూడనివారికి ఎల్‌సీడీ సరైన ఎంపిక.

**కంపెనీలు ఎల్‌సీడీకి ఎందుకు మారుతున్నాయ్?**

ఓఎల్ఈడీ, అమోలెడ్ డిస్‌ప్లేలతో పోలిస్తే ఎల్‌సీడీ డిస్‌ప్లేల తయారీ ఖర్చు చాలా తక్కువ. అందుకే బడ్జెట్, ఎంట్రీ-లెవల్ స్మార్ట్‌ఫోన్‌లలో వీటిని ఎక్కువగా వాడతారు. విడిభాగాల ధరలు తగ్గుతూ వచ్చినప్పుడు బడ్జెట్ ఫోన్లలోనూ అమోలెడ్ డిస్‌ప్లేలను కంపెనీలు అందించేవి. ఇటీవల మెమొరీ చిప్‌ల ధరల పెరుగుదల వల్ల ఆ ఖర్చును భరిస్తూ, మరోవైపు ఖరీదైన అమోలెడ్ డిస్‌ప్లేను ఇస్తే స్మార్ట్‌ఫోన్ తయారీ ఖర్చు మరింత పెరిగిపోతుంది. ఆ ధరను పెంచకుండా ఉంచాలంటే కంపెనీలు ఎక్కడో ఒకచోట ఖర్చు తగ్గించుకోవాలి. అందువల్ల అమోలెడ్‌కు బదులు తక్కువ ధరలో లభించే ఎల్‌సీడీ డిస్‌ప్లేలను ఎంచుకుంటున్నాయి. బడ్జెట్ ఫోన్లలో కూడా వినియోగదారులు 5జీ కనెక్టివిటీ, పెద్ద బ్యాటరీ కోరుకుంటుండడంతో డిస్‌ప్లే దగ్గర రాజీ పడుతున్నాయి. అమ్మకాలపై ప్రభావం పడకుండా చూసుకుంటున్నాయి. ఇటీవల విడుదలైన వన్‌ప్లస్ ఔ6, రియల్‌మీ నార్జో 100ఎక్స్, వివో టీ5 లైట్ వంటి స్మార్ట్‌ఫోన్లే ఇందుకు ఉదాహరణ. ఒకట్రెండేళ్లు ఇదే పరిస్థితి ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్


| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 1,68,426 | ₹ 1,83,734 |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,60,000

## హైదరాబాద్ విమానాశ్రయానికి వచ్చే వారిపైనా యూడీఎఫ్



**హైదరాబాద్:** శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మీదుగా రాకపోకలు సాగించే వారికి యూజర్ డెవలప్‌మెంట్ ఫీజు (యూడీఎఫ్) సెప్టెంబరు 1 నుంచి మారనుంది. విమానాశ్రయాల ఆర్థిక నియంత్రణ సంస్థ (ఏఈఆర్ఏ) ఆమోదించిన ప్రకారం.. ఈ విమానాశ్రయం నుంచి వెళ్లే ప్రయాణికులపై యూడీఎఫ్ కొంత తగ్గి, ఇక్కడ దిగే ప్రయాణికులపై కొత్తగా భారం పడనుంది. 2026 సెప్టెంబరు 1 నుంచి 2031 మార్చి 31 వరకు ఈ ఛార్జీలు అమలవుతాయి. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) నిర్వహిస్తోంది. విమాన గేట్ వద్దకు వెళ్లేవారు, విమానం దిగి వచ్చేవారు కూడా ట్రావలేటర్లు, కన్వేయర్ బెల్టులనుఉపయోగిస్తారు. అందుకే, ఇక్కడి సౌకర్యాలపై భారాన్ని ఇరు వర్గాలకూ విధించనున్నారు. దేశీయ ప్రయాణికులకు యూడీఎఫ్ రూ.750 నుంచి రూ.515కు, అంతర్జాతీయ ప్రయాణికులకు రూ.1,500 ఫీజు రూ. 1,030కి తగ్గుతుంది. దేశీయ ప్రయాణికులకు రూ.220, అంతర్జాతీయ ప్రయాణికులకు రూ.440 అవుతుంది. విమాన టికెట్‌లోనే యూడీఎఫ్ కలిసి ఉంటుంది. యూడీఎఫ్ అయిదేళ్ల కాలంలో ఏటా మారుతుంది. ఇక్కడ బయలుదేరే దేశీయ ప్రయాణికుడి ఛార్జీ రూ.515తో ప్రారంభమై, 2027-28లో రూ.555కు, 2028-29లో రూ.620కు, 2029ఏప్రిల్-అక్టోబరు మధ్య రూ.670కు చేరుకుంటుంది. 2029 నవంబరులో ఈ బేస్‌లైన్ ఫీజు రూ.415కు తగ్గుతుంది. ఇక్కడ దిగే దేశీయ ప్రయాణికుల రుసుము రూ.220తో మొదలై క్రమంగా రూ.240, రూ.265, రూ.285కు పెరుగుతుంది. 2029 నవంబరులో రూ.175కు దిగి వస్తుంది. అంతర్జాతీయ ప్రయాణికులకు యూడీఎఫ్ రూ.440తో ప్రారంభమై.. రూ.500కు చేరి, 2029 నాటికి రూ.375కు తగ్గుతుంది. చివరి ఏడాదిలో రూ.390గా ఉంటుంది. నిర్మాణంలో ఉన్న విమానాశ్రయ మౌలిక వసతులు పూర్తయి, అందుబాటులోకి వచ్చాకే, సంబంధిత వ్యయాలు వసూలు చేయాలన్న నియంత్రణ సంస్థ విధానం ఇక్కడా వర్తిస్తుంది. శంషాబాద్‌లో చేపడుతున్న నార్తర్న్ రన్‌వే, నార్తర్న్ ప్రిసింక్ట్ డెవలప్‌మెంట్‌లు పూర్తి ఆధారంగా 2029 నవంబరు 1 నుంచి మాత్రమే అదనపు వసూళ్లకు అనుమతించారు. ఈ ప్రాజెక్టులు 2029 సెప్టెంబరు 30 నాటికి పూర్తి కావాలి. నార్తర్న్ ప్రిసింక్ట్‌లో భాగంగా ఏటా అదనంగా రెండు కోట్ల మంది ప్రయాణికుల సామర్థ్యమున్న కొత్త టెర్మినల్ నిర్మిస్తున్నారు. ఈ మౌలిక వసతులు సిద్ధమయ్యాక దేశీయంగా వెళ్లే ప్రయాణికుడిపై రూ.286, కొత్త టెర్మినల్‌కు వచ్చే వారిపై రూ.122 అదనపు భారం ఉంటుంది. అంతర్జాతీయ ప్రయాణికులు రన్‌వేకుగాను వెళ్లేటప్పుడు రూ.175, వచ్చేటప్పుడు రూ.75, కొత్త టెర్మినల్‌కు వెళ్లేప్పుడు రూ.160, వచ్చినప్పుడు రూ.70 చొప్పున అదనపు ఛార్జీలు తోడవుతాయి. 2026-31కి గాను మొత్తం రూ.27,851 కోట్ల ఆదాయ అవసరాల అంచనాలను (ప్రస్తుత విలువ ప్రకారం రూ.20,025 కోట్లు) అనుమతించాలని జీహెచ్ఐఏఎల్ కోరింది. ఏఈఆర్ఏ. ఆ మొత్తాన్ని రూ.11,683 కోట్ల (ప్రస్తుత విలువ ప్రకారం రూ.9,308.20 కోట్ల)కు పరిమితం చేసింది. దీంతో సగటున ఒక ప్రయాణికుడి నుంచి రాబడి రూ.426.39గా తేలింది. ఈ మొత్తాన్ని ల్యాండింగ్, పార్కింగ్, యూడీఎఫ్ వంటి వివిధ సేవల కింద ఏఈఆర్ఏ వర్గీకరించింది. విమానాల ల్యాండింగ్ ధరలను కూడా నియంత్రణ సంస్థ క్రమద్దీకరించింది. దేశీయ విమాన సర్వీసులకు మెట్రిక్ టన్నుకు రూ.435, అంతర్జాతీయ సర్వీసులకు రూ.630గా ఛార్జీలను ఖరారు చేసింది. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు, కొత్త మార్గాల ద్వారా విస్తరణను ప్రోత్సహించేందుకు ల్యాండింగ్ ఛార్జీల ఆధారిత వేరియబుల్ టారిఫ్ ప్లాన్ (వీటీపీ) ప్రవేశపెట్టేందుకు ఏఈఆర్ఏ అనుమతి ఇచ్చింది. నిర్దేశిత అర్హతలను పూర్తి చేసిన విమానయాన సంస్థలు ఈ ప్రోత్సాహక పథకం ద్వారా ప్రయోజనం పొందొచ్చు.

## భారత్-జపాన్ స్టార్టప్ సిరీస్ ప్రతిపాదించిన గోయల్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్-జపాన్ మధ్య స్టార్టప్ భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఆసక్తికర ప్రతిపాదన చేశారు. 'షార్క్‌ట్యాంక్'లా.. భారత్-జపాన్ స్టార్టప్ సిరీస్‌ను నిర్వహించాలని సూచించారు. దీంతో రెండు దేశాల్లోని ఔత్సాహిక వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారుల మధ్య సమన్వయం తీసుకువచ్చి, వ్యాపార అవకాశాలు మెరుగుపర్చవచ్చని అభిప్రాయపడ్డారు. జపాన్ రాజధాని టోక్యోలో స్టార్టప్స్‌పై తాజాగా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.



షార్క్ ట్యాంక్ మాదిరిగా వర్చువల్‌గా సెషన్స్ నిర్వహించాలని పెట్టుబడిదారులకు గోయల్ సూచించారు. దాంతో స్టార్టప్‌లను నిర్వహిస్తోన్న ఔత్సాహికులు తమ ఆలోచనలను వివరించడానికి ఆ సిరీస్ మంచి వేదిక అవుతుందన్నారు. దీనివల్ల భారత్ స్టార్టప్ ఆలోచనలు జపాన్ పెట్టుబడిదారులకు తెలుస్తాయన్నారు. అదేవిధంగా జపాన్ స్టార్టప్‌లు భారత్‌లో వ్యాపార భాగస్వాములను గుర్తించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ఒక వ్యాపార ఆలోచన కార్యరూపం దాల్చితే.. అది క్రమంగా ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం చేయడానికి దోహదం చేస్తుందన్నారు. భారత్‌లో డీప్‌టెక్, ప్రారంభ దశలో ఉన్న సంస్థల్లో జపాన్ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. షార్క్‌ట్యాంక్ అంటే వ్యాపారరంగంలో రాణించాలనుకునేవారు తమ కొత్త ఆలోచనలు, ఉత్పత్తులను ఇన్వెస్టర్ల ముందు వివరించి.. పెట్టుబడులు పొందేలా రూపొందించిన ఒక బిజినెస్ రియాలిటీ షో.

## త్వరలో దేశీయ మార్కెట్‌లోకి ఫిలిప్స్ స్మార్ట్‌ఫోన్స్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫిలిప్స్ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లోకి అడుగుపెడుతోంది ఇప్పటి వరకూ ఫీచర్ ఫోన్లకే పరిమితమైన ఈ కంపెనీ.. త్వరలోనే కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేయనుంది. ూ7221 పేరిట తీసుకురాబోతుంది. ఇందుకు సంబంధింన ఫోన్ డిజైన్‌ను ఇప్పటికే అమెజాన్ మైక్రోసైట్‌లో కంపెనీ విడుదల చేసింది. ఫోన్ ధరలను, లాంచ్ తేదీని కంపెనీ పేర్కోనప్పటికీ.. కొన్ని ఫీచర్లను మాత్రం వెల్లడించింది. మైక్రోసైట్‌లోని వివరాల ప్రకారం.. 6జీబీ, 8జీబీ ర్యామ్, 128జీబీ, 256 జీబీ స్టోరేజ్ సదుపాయంతో ఈ ఫోన్ రానుంది. 5జీకి సపోర్ట్ చేస్తుంది. డ్యూయల్ స్టీరియో స్పీకర్స్ అల్ట్రా మాక్స్ ఆడియో ఫీచర్లు ఉన్నాయి. ఫోన్ వెనుక వైపు 64ఎంపీ ఏఐ ప్రధాన కెమెరా, ముందు వైపు 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంటుంది. ఐపీ 64 రేటింగ్‌తో రానున్న ఈ ఫోన్ వెనుక భాగంలో ఒఇఆ ఫ్లాష్ లైట్ ఉంది. బ్లాక్, సిల్వర్, వైట్ రంగుల్లో లభ్యం కానుంది. అమెజాన్ ద్వారా ఈ స్మార్ట్‌ఫోన్ విక్రయించనున్నారు.

## సరికొత్త ఎం6, ఎం5 చిప్‌లు విడుదల చేసిన యాపిల్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఏఐ వినియోగం పెరుగుతోన్న నేపథ్యంలో ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ కీలక ముందడుగు వేసింది. కొత్త ఎం6 చిప్‌తో మ్యాక్ మినీ, ఎం5 అల్ట్రా చిప్‌తో మ్యాక్ స్టూడియోను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎం6 చిప్‌ను యాపిల్ తొలిసారిగా 2 నానోమీటర్ తయారీ ప్రక్రియతో రూపొందించింది. చిన్న పరిమాణంలోనే మరింత కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అందించడమే దీని ప్రత్యేకత. ఇందులో 12 కోర్ సీపీయూ, 12 కోర్ గ్రాఫిక్స్ చిప్ ఉన్నాయి. ఏఐ పనుల కోసం కొత్త డ్యూయల్ 16 కోర్ న్యూరల్ ఇంజిన్‌ను అందించింది. సెకనుకు 170 జీబీ వరకు మెమొరీ బ్యాండ్‌విడ్త్‌ను అందిస్తుంది. దీంతో పనులను వేగంగా నిర్వహించవచ్చని యాపిల్ తెలిపింది. ఎం5 అల్ట్రాను ఇప్పటివరకు తయారు చేసిన అత్యంత శక్తిమంతమైన చిప్‌గా సంస్థ పేర్కొంది. ఇందులో కొత్త క్వాడ్-డై ఆర్కిటెక్చర్‌ను ఉపయోగించింది. రెండు డ్యూయల్ డై ఎం5 మ్యాక్స్ చిప్‌లను యాపిల్ అల్ట్రాఫ్యూజన్ సాంకేతికతతో అనుసంధానించింది. యాపిల్ సిలికాన్ చిప్‌లో ఇలాంటి నిర్మాణాన్ని తొలిసారిగా ఉపయోగించారు. ఫలితంగా ఎం5 అల్ట్రాలో 36 సీపీయూ కోర్లు, 80 గ్రాఫిక్స్ కోర్లు ఉంటాయి. సెకనుకు 1.2 టెరాబైట్ల మెమొరీ బ్యాండ్‌విడ్త్‌ను అందిస్తుంది. గతంలో అత్యంత శక్తిమంతమైన ఎం3 అల్ట్రాతో పోలిస్తే ఇది 50 శాతం అధికమని యాపిల్ వెల్లడించింది. ఎం5 మ్యాక్స్ మ్యాక్ స్టూడియో ధర రూ.2,79,900, ఎం5 అల్ట్రా మోడల్ ధర రూ.6,29,900 నుంచి ప్రారంభమవుతుంది.

## మిసైల్ సాంకేతికత 'ప్రైవేటు'కు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) సొంతంగా అభివృద్ధి చేసిన సంప్రదాయ క్షిపణి వ్యవస్థకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం ప్రైవేటు రంగానికి బదిలీ కానుంది. దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు, సాంకేతికత బదలాయింపునకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం ఆమోదముద్ర వేసినట్లు ఆ శాఖ తెలిపింది. మిసైళ్లను అభివృద్ధి దశ నుంచి వేగంగా ఉత్పత్తి దశకు తీసుకురావడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగానికి చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సుదూర లక్ష్యాలను ఛేదించే మిసైళ్లకు సంబంధించిన ప్రొపెల్లెంట్ నుంచి వార్‌హెడ్ వరకు వివిధ విడిభాగాలను సమీకరించే ప్రధాన సంస్థగా ఉంది. నౌకా మిసైళ్ల విషయానికొస్తే భారత్-రష్యా భాగస్వామ్యంలో ఏర్పాటైన బ్రహ్మోస్ ఏరోస్పేస్ కీలక పాత్ర పోషిస్తోంది. సూపర్‌సోనిక్ ఆయుధాలను తయారు చేస్తోంది. ఉత్పత్తి సామర్థ్యాన్నీ పెంచుతోంది. ఎలా అందజేస్తారంటే..సాంకేతికత బదిలీని అందుకునే హక్కు పొందేందుకు భారతీయ ప్రైవేటు కంపెనీల మధ్య పోటీ బిడ్డింగ్ నిర్వహిస్తారు. అందులో విజయవంతంగా నిలిచిన సంస్థలు, డీఆర్‌డీఓకు అభివృద్ధి-తయారీ భాగస్వామిగా మారతాయని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ సాంకేతికత బదిలీలో అణ్వాస్త్రాలను మోసుకెళ్లే అగ్ని వంటి వ్యూహాత్మక మిసైళ్లు ఉండవని తెలుస్తోంది. కేవలం వ్యూహాత్మకయేతర మిసైళ్లకు సంబంధించిన లైసెన్స్ టెక్నాలజీలను మాత్రమే ప్రైవేటు కంపెనీలకు డీఆర్‌డీఓ బదిలీ చేయనుంది.

## హెచ్ఐవీ నివారణ ఇంజెక్షన్ దేశీయంగా తయారీ

### డాక్టర్ రెడ్డీస్, ఎంక్యూర్‌కు క్లినికల్ పరీక్షల నుంచి మినహాయింపు

### సీడీఎస్‌సీఓ నిర్ణయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

హెచ్ఐవీ సంక్రమణను అడ్డుకునే ఇంజెక్షన్ లెనాకాపవిర్ త్వరలోనే భారత మార్కెట్లోకి వచ్చేందుకు మార్గం సుగమమైంది. హెచ్ఐవీ ముప్పు ఎక్కువగా ఉన్న, కనీసం 35 కిలోల బరువు ఉండే పెద్దలు, యుక్తవయస్కుల్లో లైంగిక సంపర్కం ద్వారా వచ్చే హెచ్ఐవీ-1 వ్యాప్తిని అడ్డుకునేందుకు ఈ నివారణ మందును ఏడాదికి 2 సార్లు ఇవ్వాలని సిఫారసు చేస్తున్నారు. ఈ సూదిమందును దేశీయంగా ఉత్పత్తి చేయడానికి, విక్రయించేందుకు వీలుగా డాక్టర్ రెడ్డీస్, ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్‌కు మూడో దశ క్లినికల్ పరీక్షలు, బయోఈక్వివలెన్స్ అధ్యయనాల నుంచి మినహాయింపు ఇవ్వాలని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ)కు చెందిన సబ్జెక్టు నిపుణుల కమిటీ (ఎస్ఈసీ) నిర్ణయం తీసుకుంది. ఈ నెలలో జరిగిన సమావేశంలో కమిటీ ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. మార్కెట్లోకి వచ్చిన తర్వాత నిర్వహించే ఫేజ్-4 క్లినికల్ పరీక్షల ద్వారా ప్రభావశీలత వివరాలను సేకరించి, సమర్పించాలని ఈ కంపెనీలను ఆదేశించింది. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఈ ఇంజెక్షన్‌ను 463.5 మిల్లీగ్రాములు/1.5మిల్లీలీటర్ల మోతాదు సామర్థ్యంతో దేశంలో తయారు చేసి, విక్రయించేందుకు అనుమతి కోరుతూ ప్రతిపాదనలు సమర్పించింది. దేశీయంగా క్లినికల్-3 ట్రయల్స్, అధ్యయనాల నుంచి మినహాయింపు ఇవ్వడానికి గల కారణాలను వివరించింది.



ఎంక్యూర్ కూడా ఇదే రకమైన ప్రతిపాదనలను సమర్పించింది. మార్కెటింగ్ అనుమతులు లభించిన మూడు నెలల వ్యవధిలో, ఈ రెండు కంపెనీలు ఫేజ్-4 అధ్యయన ప్రణాళికలను సీడీఎస్‌సీఓకు సమర్పించాలి. అమెరికాలో గిలియడ్ సైన్సెస్ విక్రయించే బ్రాండెడ్ ఔషధానికి ఏడాదికి ఒక వ్యక్తి దాదాపు 28,000 డాలర్లు (సుమారు రూ.26.60 లక్షలు) వెచ్చించాలి. భారతీయ జెనరిక్ కంపెనీలు ఏడాదికి ఒక వ్యక్తికి కేవలం 40 డాలర్ల (సమారు రూ.3,800) ధరకే అందించే వీలుంది. భారత్‌లో దీని తుది ధర ఎంతనేది ఆయా కంపెనీల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

## దిల్లీ విమానాశ్రయంలో ఫెడెక్స్ ఎయిర్ కార్గో హబ్

### రూ.1430 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: అంతర్జాతీయ లాజిస్టిక్స్ సంస్థ ఫెడరల్ ఎక్స్‌ప్రెస్ కార్పొరేషన్(ఫెడెక్స్) దిల్లీ విమానాశ్రయంలో 150 మి. డాలర్ల (దాదాపు రూ.1430 కోట్ల)తో ఎయిర్ కార్గో హబ్ (సరకు రవాణా కేంద్రం)ను అభివృద్ధి చేయనుంది. 2.3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 12-18 నెలల్లో దీనిని ఏర్పాటు చేస్తారు. పౌర విమానయాన మంత్రి కె రామ్మోహన్ నాయుడు సమక్షంలో మంగళవారం ఈ కేంద్రానికి శంకుస్థాపన జరిగింది. జీఎమ్ఆర్ కార్గో సిటీ వద్ద ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రంతో ఉత్తర, తూర్పు భారత్‌తో అనుసంధానం బలోపేతం కానుందని ఫెడెక్స్ పేర్కొంది. ఈ కేంద్రం వల్ల తమ ప్యాకేజీల ప్రాసెసింగ్ సామర్థ్యం గంటకు 600 నుంచి 5000కు పెరుగుతుందని తెలిపింది. దేశంలో విమాన సరకు రవాణా విభాగానికి ఊతమిచ్చేందుకు ప్రత్యేక విధానాన్ని తీసుకు వస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. తద్వారా విమానాశ్రయానికి వెలుపల, పూర్తి స్థాయిలో సరకు ప్రాసెసింగ్ చేపట్టొచ్చన్నారు. 'కార్గో టర్మినళ్లను తగ్గించుకోవడం ద్వారా విమానాశ్రయాన్ని మరింత విస్తరించడానికి వీలవుతుందని అన్నారు

## ఇబ్రహీంపట్నంలో
# ఘోర రోడ్డు ప్రమాదం



**ఇబ్రహీంపట్నం:** గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కళాశాలకు చెందిన ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం ప్రకారం.. గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సాయంత్రం జేబీ వెంచర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా, మాల్ వైపు నుంచి వస్తున్న ట్రాలీ ఆటో ఒక్కసారిగా వారిని ఢీకొట్టింది. TS 07 UN 0812 నంబర్ గల ట్రాలీ ఆటో ఢీకొనడంతో విద్యార్థులు ఎగిరిపడ్డారు. ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వారిని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు శ్రీ సిద్ధార్థ పాఠశాల విద్యార్థిని



**గోదావరిఖని, జనంసాక్షి :** ఈ నెల 22న సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో అండర్--16 బాలికల విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో శ్రీ సిద్ధార్థ పాఠశాల విద్యార్థిని రాగుల అనన్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది.అనన్య ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు, ఈ నెల 26న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆమెను ఎంపిక చేశారు.విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయానంద్, క్రీడా శిక్షకులు సుధేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. అనన్య రాష్ట్రస్థాయి పోటీలలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## అధునాతన చికిత్సతో 'యశోద'లో ఆర్థోస్కోపీ సేవలు

**సరికొత్త షోల్డర్ ఆర్థోస్కోపీ, మోకాలి ఆర్థోస్కోపీ చికిత్సల విస్తరణ**

**యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ - ఆర్థోపెడిక్ డాక్టర్ సుకేష్ రావు సంకినేని**



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :** ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్ల) వైద్య రంగంలో నిపుణులు యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ డాక్టర్ సుకేష్ రావు సంకినేని, తమ అధునాతన జాయింట్ కేర్ (కీళ్ల సంరక్షణ) విభాగంలో సరికొత్త షోల్డర్ ఆర్థోస్కోపీ, మోకాలి ఆర్థోస్కోపీ చికిత్సలను విస్తరించినట్లు ప్రకటించారు. ఈ అత్యాధునిక కీ-హోల్ (చిన్న కోత) శస్త్రచికిత్సల ద్వారా కీళ్లకు సంబంధించిన అనేక రకాల సమస్యలను అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించి, చికిత్స చేయవచ్చు. దీనివల్ల రోగులు త్వరగా కోలుకుని, మళ్లీ తమ పనులను యాక్టివ్‌గా చేసుకోగలుగుతారు. ఈ సందర్భంగా కరీంనగర్ యశోద హాస్పిటల్ లో విలేకరుల సమావేశంలో డాక్టర్ సుకేష్ రావు సంకినేని మాట్లాడుతూ... సాధారణ పాత పద్ధతి శస్త్రచికిత్సల్లో పెద్ద కోతలు పెట్టాల్సి వచ్చేది, దీనివల్ల చుట్టుపక్కల ఉండే కండరాలు ఎక్కువగా దెబ్బతినేవి. కానీ ఈ అధునాతన ఆర్థోస్కోపిక్ విధానంలో, మేము ఆరోగ్యకరమైన కణజాలాలకు ఎలాంటి నష్టం కలిగించకుండా, కేవలం దెబ్బతిన్న భాగాన్ని మాత్రమే సరిచేయగలమని తెలిపారు. దీనివల్ల ఆపరేషన్ తర్వాత నొప్పి చాలా తక్కువగా ఉంటుంది, ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని, రోగులు చాలా వేగంగా కోలుకుంటారని తెలిపారు. యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ లో సరికొత్త సర్జికల్ టెక్నాలజీ, ఆధునిక ఫ్లూయిడ్ ప్రెజర్ మేనేజ్‌మెంట్ పంపులు, అధునాతన మైక్రో-ఇన్స్ట్రుమెంట్స్ అందుబాటులో ఉన్నాయని, మా అనుభవజ్ఞులైన స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు, ఫిజియోథెరపిస్టుల బృందం రోగికి పరీక్షల దశ నుండి పూర్తిగా కోలుకునే వరకు అండగా ఉండి సరైన సంరక్షణ అందిస్తారని, ప్రజలకు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను అందించడంలో పేరుగాంచిన ప్రముఖ సంస్థ అని, అధునాతన ఆర్థోపెడిక్స్, స్పోర్ట్స్ మెడిసిన్ పునరావాస చికిత్సలలో ప్రత్యేకత కలిగిన యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ , రోగుల కదలికలను మెరుగుపరిచి వారి జీవన ప్రమాణాలను పెంచడానికి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది శ్రీకాంత్, మహేందర్ లు పాల్గొన్నారు.

## వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

**సోషల్ ఇంజనీరింగ్ నాటకాలకు తెర**

**అప్రమత్తంగా ఉండాలన్న సిపి సజ్జన్నార్**



**హైదరాబాద్, ఆగస్ట్26 :** హైదరాబాద్ నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనర్ హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు ఫోన్లను దొంగిలిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, అమాయకులను మొదట గుర్తిస్తారని.. స్క్రీన్ లాక్ ఎలా ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి నిశితంగా గమనించి అనంతరం చోరీ చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఒకవేళ ఫోన్ లాక్ అయి.. పాస్‌వర్డ్ తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా 'సోషల్ ఇంజనీరింగ్' నాటకాలకు తెరలేపుతారని సీపీ చెప్పారు. బాధితుడు తన పోయిన ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి.. తాము బస్సు కండక్టర్/ డ్రైవర్ అని, ఫోన్ బస్సులో దొరికిందని చెబుతారు. వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని.. వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని ÷-లకెయిమ్ చేస్తున్నారని చెబుతారు. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మించి అన్‌లాక్ వివరాలు రాబడతారు. ఒకవేళ ఫోన్ పోయినట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారిక పోర్టల్‌లో మొబైల్ ఎఓఇఐ నంబర్ నమోదు చేసి ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయించాలి. ఒకవేళ ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లు, వృద్ధులకు ఈ తరహా సరికొత్త నేరాల పట్ల అవగాహన కల్పించి, వారు ప్రయాణాల్లో ఫోన్లు వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి' అని సీపీ సూచించారు.

## తార్నాకలో విదేశీ మద్యం స్వాధీనం


**హైదరాబాద్,ఆగస్ట్26 :** నగరంలోని తార్నాక ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో భారీగా డిఫెన్స్ మద్యం బాటిళ్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం స్వాధీన పరుచుకుంది. మొత్తం 67 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని వివరించింది. తార్నాకలో ఓ వ్యక్తి డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు సమాచారం అందింది. దీంతో ఆ ఇంటిపై బుధవారం దాడి చేసింది. ఈ నేపథ్యంలో ఆ ఇంటి యజమాని వద్ద తొలుత పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. అనంతరం ఆ ఇంట్లో సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా మరో 57 బాటిళ్లను గుర్తించింది. వాటిని కూడా స్వాధీనం చేసుకుంది. ట్టుబడిన బాటిళ్లు కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందినవని స్పష్టం చేసింది. ఈ మద్యం బాటిళు విక్రయిస్తున్న వ్యక్తి.. మాజీ సైనికుడి కుమారుడు ఆర్. మాధవన్‌గా గుర్తించామని పేర్కొంది. అతడిని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అప్పగించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం వివరించింది.

## బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతో రుణమాఫీని కోల్పోయిన పేద రైతు

**ప్రజాభవన్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఫలితం లేదని రైతు రమణారెడ్డి ఆవేదన**



**చిగురుమామిడి ఆగస్టు 26 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రుణమాఫీ పథకానికి అర్హుడను కాలేకపోయానని ఓ పేద రైతు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.లంబాడిపల్లె గ్రామానికి చెందిన జంగ రమణారెడ్డి అనే రైతు చిగురుమామిడి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ లో 2019నుండి లక్షా 50వేల రూపాయల క్రాప్ లోను తీసుకుంటూ రెన్యువల్ చేస్తు వస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పడం,అధికారులు క్రాఫ్ లోన్ డబ్బులను రెన్యువల్ చేసుకుంటేనే రుణమాఫీ వర్తిస్తుందని ఒత్తిడి తేవడంతో అప్పుచేసి క్రాప్ లోను వడ్డీతో కలిపి లక్షా అరవై వేల రూపాయలను 2023 డిసెంబర్ 8న బ్యాంకులో కట్టినట్టు చెప్పారు.అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మాత్రం డిసెంబర్ 9న చివరి తేదీగా ప్రకటించింది.రైతు డిసెంబర్ 8న డబ్బులు బ్యాంకు ఖాతాలో వేస్తే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి 11న క్రాప్ లోను రెన్యువల్ చేశారని దీంతో తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు రోధిస్తూ తెలిపారు.తనకు రుణమాఫీ కాలేదని కరీంనగర్ ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోలేదని, రమణారెడ్డి విలపిస్తున్నారు. సన్న చిన్న కారు రైతునైన తనకు తీవ్ర నష్టం వాటిలిందని,సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి తనకు రుణమాఫీ చేసి న్యాయం చేయాలని,అప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించిన బ్యాంక్ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బాధిత రైతుకు న్యాయం చేసి రుణమాఫీ చేయాలని రైతులు శ్యామకూర మోహన్ రెడ్డి,కాటం హనుమంత్ రెడ్డి, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## సౌందర్య సంరక్షణ, వృత్తి శిక్షణకు అకాడమీ వేదికగా నిలవాలి

**మల్లారెడ్డి వర్సిటీ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతి రెడ్డి**

**త్వరలో బ్యూటీ అకాడమీ ప్రారంభం**

**హైదరాబాద్ :** త్వరలో ఏర్పాటు చేయనున్న బ్యూటీ అకాడమీ సౌందర్య సంరక్షణ, వృత్తి శిక్షణకు వేదికగా నిలవాలని మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతి రెడ్డి పేర్కొన్నారు. సరికొత్త ప్రీమియం బ్యూటీ, మేకప్, మేకోవర్ డెస్టినేషన్ 'హెచ్‌ఆర్ లక్స్ స్టూడియో'ను ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె పటాన్చెరులో ప్రారంభించారు. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. 'మిసెస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ గ్లోబల్ క్వీన్ 2025' విజేత హేమలత రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ స్టూడియో సమగ్ర బ్యూటీ సేవలతో పాటు త్వరలోనే వృత్తిపరమైన శిక్షణ అందించేందుకు ప్రత్యేక 'బ్యూటీ అకాడమీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ హేమలత రెడ్డి ప్రత్యేక వృత్తిపరమైన శిక్షణ పూర్తి చేసుకుని, బ్యూటీ, వెల్నెస్ విభాగాలలో నైపుణ్యం సాధించి ఈ స్టూడియో పెట్టారన్నారు. ఈ స్టూడియో మహిళలు, పురుషులు ఇద్దరికీ కేశ సంరక్షణ (హెయిర్ కేర్), చర్మ చికిత్సలు (స్కిన్ ట్రీట్మెంట్స్), నెయిల్ కేర్, ఫేషియల్స్ వంటి విస్తృత శ్రేణి సేవలను అందిస్తుందన్నారు. ప్రత్యేకమైన ప్రైవేట్ గదులు, ప్రత్యేక వీఐపీ ట్రీట్మెంట్ సౌకర్యాలతో సౌకర్యవంతమైన వాతావరణం, వ్యక్తిగత గోప్యత, ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ వహించడమే ఈ స్టూడియో ప్రత్యేకత అన్నారు.

## ప్రేమ, దయ, కరుణ, సోదరభావమే ప్రవక్త మహమ్మద్ బోధనలు

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**

**మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, సీపీ**



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :** ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే పవిత్రమైన మిలాద్-ఉన్-నబీ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లో నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రవక్త మహమ్మద్ ప్రపంచానికి ప్రేమ, దయ, కరుణ, సహనం, సోదరభావం వంటి గొప్ప విలువలను బోధించారని తెలిపారు. ఆయన అందించిన సందేశం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. హజ్రత్ మహమ్మద్ ప్రవక్త జీవితం, బోధనల నుంచి స్ఫూర్తి పొందుతూ పరస్పర సామరస్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. మతాలు, వర్గాలకు అతీతంగా ప్రజలంతా సోదరభావంతో మెలగాలని, శాంతి, ఐక్యతను కాపాడుతూ దేశ అభివృద్ధి, పురోగతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. సమాజంలో ప్రేమ, కరుణ, సహనం, మానవతా విలువలను మరింతగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మిలాద్-ఉన్-నబీ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యాన్ని నింపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగను ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వారు కోరారు.

## బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు..!

**జిల్లాలో పార్టీ బలోపేతంపై**

**మాజీ మంత్రి పువ్వాడ వ్యూహం**

**ప్రధానంగా ఖమ్మం, వైరా**

**నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి**



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 26(జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో అసంతృప్తి నెలకొని ఉందని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నాయకత్వంలో ముఖ్యంగా ఖమ్మం, వైరా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. చేరికలపై ఇప్పటికే దృష్టి సారించామని, సరైన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతంపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతూ తన రాజకీయ చతురతతో బీఆర్ఎస్ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలపడుతుందని, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరే అవకాశం ఉందని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ పేర్కొన్నారు.

## మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు వేగం పెంచాలి

**తుమ్మలచెరువు నింపి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**అశ్వాపురం, ఆగస్టు 26 (జనంసాక్షి) :** తుమ్మలచెరువు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తుమ్మలచెరువును నీటితో నింపి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బుధవారం అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రాజెక్టు నిర్మాణ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తుమ్మలచెరువును నింపే అవకాశం ఉండటంతో దాదాపు 10 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే రైతులకు సాగునీటి భరోసా కలగడంతో పాటు పంటల సాగు విస్తీర్ణం పెరిగి రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ఈ నెల 29న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్విచ్ ఆన్ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రుల పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), తుమ్మల నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రాజెక్టు పనుల సందర్భంగా కొందరు రైతులు, భూ నిర్వాసితులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పూర్తయితే తుమ్మలచెరువు ఆయకట్టు పచ్చని పంటలతో కళకళలాడుతుందని, రైతులకు రెండు పంటలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అంచుల్లో పొంచి ఉన్న ప్రమాదం



**కేశంపేట, ఆగస్టు 26 ( జనం సాక్షి ):** మండల కేంద్రం నుండి కొత్తపేట గ్రామానికి వెళ్లే బిటి రోడ్డు ప్రమాద భరితంగా మారింది. సుమారు ఐదు కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్న రహదారికి ఇరువైపులా అంచుల వద్ద మట్టి కొట్టుకుపోయింది. రోడ్డుకు రెండు వైపులా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో వర్షపు నీరు వచ్చి చేరుతుంది. కొత్తపేట, కొనాయపల్లి, సంతాపూర్, పాటిగడ్డ గ్రామాల నుండి ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఈ రహదారి నుండే రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు. రహదారి గుండా వెళ్లే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాన్ని దాటే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రహదారికి మరమ్మత్తులు చేయించాలని కోరుతున్నారు.

## అమెరికాలో హైదరాబాద్ యువతి అనుమానాస్పద మృతి

**తల్లీకొడుకుల పనేనని కుటుంబ సభ్యుల ఆవేదన**

**నిందితులపై కఠిన చర్యలకు డిమాండ్**

**హైదరాబాద్ :** అమెరికాలోని మేరీల్యాండ్‌లో హైదరాబాద్‌కు చెందిన నిఖిత గోడిశాల అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ మృతి వెనుక కుట్ర దాగి ఉందని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగం కోల్పోయిన అర్జున్ శర్మ నిఖితను ఆర్థిక ఇబ్బందులకు గురి చేసి హత్య చేశాడని, ఈ దారుణంలో ఆయన తల్లి పాత్ర కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడి అరెస్ట్‌పై అమెరికా అధికారులు అధికారిక ప్రకటన ఇవ్వకుండా మౌనం వహించడాన్ని తప్పుబట్టిన కుటుంబ సభ్యులు, నిందితులపై నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేసి సమగ్ర విచారణ జరపాలన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి



**శంషాబాద్,ఆగస్టు26(జనంసాక్షి)**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని బీఆర్‌ఎస్‌వీ శంషాబాద్ మండల ప్రధాన కార్యదర్శి మల్లిగొల్ల రాఘవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలల్లోనే నిలిచిపోతున్నాయని, ఉన్నత విద్యకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జీవో 97పై విద్యార్థులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగుతుందని రాఘవేందర్ హెచ్చరించారు.

# పెంట్లవెల్లి కేజీబీవీలో గందరగోళం

- ముగ్గురు ఉపాధ్యాయురాలా మధ్య విభేదాలు
- మంత్రి జూపల్లి దృష్టికి చేరిన వివాదం
- రంగంలోకి దిగిన జిల్లా అధికారులు

పెంట్లవెల్లి ఆగస్టు 26: విద్యార్థులకు విద్యాబుద్ధులతోపాటు క్రమశిక్షణ నేర్పించాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థునల ఎదుట గొడవకు దిగిన ఘటన బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. పెంట్లవెల్లి కేజీబీవీ నిర్వహణ వ్యవహారం వివాదాలకు కేంద్రంగా మారింది గతంలో విధులు నిర్వహించిన ఎస్ వో బదిలీపై పెద్దకొత్తపల్లి వెళ్లడంతో, కొత్త ఎస్ వో బాధ్యతల నిర్వహిణ కోసం ఇదే పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయు రాళ్లను ఇంచార్జిలుగా నియమించినట్లు సమాచారం. అప్పటి నుంచి పాఠశాల వ్యవహారాల్లో పోసగక.. వారి మధ్య నెలకొన్న విభేదాల బుధవారం బహిరంగ గొడవకు దారి తీసినట్లు తెలిసింది. విషయం మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి చేరడంతో జిల్లా అధికారులో కదిలిక మొదలైంది. బుధవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, డిసిడివో నిర్మల, మండల నోడల్ అధికారి కురుమయ్యలు హుటాహుటిన కేజీబీవీ కి చేరుకొని విచారణ చేపట్టినట్లు విశ్వాసనీయ వ్యక్తుల ద్వారా తెలిసింది. విద్యార్థులను విద్య,భద్రత, క్రమశిక్షణ అందించాల్సిన పాఠశాలలోనే ఉపాధ్యాయులు మధ్య విభేదాలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తుంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇలాంటి ఘటనాలను పునరావృతశీ కాకుండా ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై డిసిడివో నిర్మలను వివరణ కోరగా సాధారణ విజిట్ లో భాగంగా పెంట్లవెల్లి కేజీబీవీకి వచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయురాళ్ల మధ్య గొడవ జరిగిందన్న సమాచారం తెలిసిందని అడగగా.. మీ ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉంటే వారు గల్లీ కజ్జాలు ఆడినట్లు కేజీబీవీ లో ఉపాధ్యాయుల మధ్య ఏదో ఒకటి ఉంటుంది కదా.. అని సమాధానమిచ్చారు.



# జలసాధన ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం

- ప్రొఫెసర్ హరగోపాల్

రాజాపూర్, ఆగస్టు 26(జనంసాక్షి) : జలసాధన ఉద్యమాన్ని ఉధృతం చేద్దామని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జలసాధన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని యువరైతులకు పిలుపు నిచ్చారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సాగు నీరు, తాగు నీరు అందించడంలో దశాబ్దాల నుండి అన్ని ప్రభుత్వాలు విఫలమైనావని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. సాగు నీరు అందుతున్న వారు మూడు పంటలు పండించి మూడు సార్లు సంపాదన పొందుతున్నారని, మహబూబ్ నగర్ జిల్లా రైతులు మాత్రం వర్షం మీద ఆధారపడి ఒక పంటనే పండించే దుస్థితి నెలకొంది అని అన్నారు. కృష్ణా నది లో మనకు రావాల్సిన వాట వచ్చే వరకు ఈ జలసాధన ఉద్యమాన్ని గ్రామ గ్రామానా జాయింట్ యాక్షన్ కమిటీ లు ఏర్పాటు చేసి ముందుకు సాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్, వెంకటేశ్వర్లు, పి.బి.స్వామి, రాఘవాచారి పాల్గొన్నారు.

# నాలుగు కేసులను చేధించిన పోలీసులు

- నాలుగు బుల్లెట్ బైక్‌లు స్వాధీనం




జూబ్లీహిల్స్ (జనంసాక్షి) : మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల రోజులుగా జరిగిన నాలుగు బుల్లెట్ బైక్‌ల చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించి నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి నాలుగు బుల్లెట్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్ పీఎస్‌లో క్రైమ్ నంబర్లు 509/2025, 542/2025, 548/2026 కింద కేసులు నమోదయ్యాయి. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితుడిని లిలినీలంపల్లి సాయి వర్ధన్ (27)లిలిగా గుర్తించారు. ఇతడు పశ్చిమగోదావరి జిల్లా రేగుపూడి గ్రామానికి చెందిన సత్యనారాయణ కుమారుడిగా పోలీసులు తెలిపారు. ఈ నెల 25న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, మధురానగర్ పీఎస్ పరిధిలో బుల్లెట్ బైక్‌లను చోరీ చేసినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అతని నుంచి మొత్తం నాలుగు బుల్లెట్ బైక్‌లతో పాటు వాటికి సంబంధించిన పత్రాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో 11 దొంగతనం కేసులు, ఒక పోక్సో కేసు కలిపి మొత్తం 12 కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. తాజాగా మరో నాలుగు కేసులు నమోదు కావడంతో మొత్తం కేసుల సంఖ్య 16కు చేరిందని వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుల ఛేదనలో బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్ రెడ్డి, మధురానగర్ ఎస్‌హెచ్‌ఓ ప్రభాకర్, ఏఎస్సై శ్రీనివాస్, క్రైమ్ ఎస్సై బాబు, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, రవికుమార్, హోంగార్డు తిరుమల్ పాల్గొన్నారు.

# రైలు ప్రయాణంలో ప్రమాదవశాత్తు జారిపడి ఒకరి మృతి

- గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మాడ్గులపల్లి, ఆగస్టు 26 (జనంసాక్షి) : రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రగాయాలతో మృతి చెందిన సంఘటన కుక్కడం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది నల్లగొండ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.రామకృష్ణ వివరాల ప్రకారం బుధవారం ఉదయం 11.20 గంటల సమయంలో కుక్కడం -మిర్యాలగూడ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాల పక్కన సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక పురుషుడి మృతదేహం పడి ఉండడాన్ని అధికారులు గుర్తించారు మృతుడి వద్ద విజయనగరం నుంచి సికింద్రాబాద్ వరకు ప్రయాణించేందుకు మంగళవారం సాయంత్రం తీసుకున్న జనరల్ రైలు టికెట్ లభించింది ఏదేని రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు మృతుడి శరీరంపై పసుపు రంగు ఫుల్ టీ-షర్ట్, తెల్లటి చారల జీన్స్ ప్యాంట్, కాఫీ రంగు అండర్ వేర్ ధరించి ఉన్నాడు మృతుడి వద్ద గుర్తింపునకు సంబంధించిన ఇతర ఎలాంటి ఆధారాలూ లభించలేదని ఎస్ఐ తెలిపారు ఈ ప్రమాదంపై నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లగొండ జీఆర్పీ ఎస్ఐ బి. రామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు మృతుడికి సంబంధించిన వివరాలు లేదా చిరునామా తెలిసిన వారు వెంటనే 8712658595 లేదా 8712513805 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

# కూల్చేది కొన్నే.. కట్టేది ఎన్నో!

## అక్రమాలకు అండ ఎవరిది?

- అంజయ్యనగర్‌లో కూల్చివేతలు.. పక్కనే సిద్ధిక్‌నగర్‌లో నిర్మాణాల జోరు
- ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరి మృతి.. అయినా అధికారుల్లో చలనం అంతంతే
- సిఎంసీ నుంచి సర్కిల్ వరకు నిర్లక్ష్యంపై స్థానికుల మండిపాటు
- 'మరో ప్రమాదం జరిగే వరకు చూస్తారా?' అని మాదాపూర్ వాసుల ప్రశ్న





శేరిలింగంపల్లి, ఆగస్టు 26 (జనంసాక్షి): ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరి ప్రాణాలు బలైన అంజయ్యనగర్‌లో అధికారులు కూల్చివేతలు చేపడుతుంటే.. అదే ప్రాంతానికి ఆనుకుని ఉన్న సిద్ధిక్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలు మాత్రం యథేచ్ఛగా సాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ప్రమాదం జరిగినా పద్ధతి మారకపోవడంపై స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. "ప్రాణాలు పోయిన తర్వాత కూల్చివేతలు కాదు.. ముందే అడ్డుకోవాలి" అని వారు డిమాండ్ చేస్తున్నారు. అంజయ్యనగర్ ఘటనలో ఇద్దరు మృతి చెందడం, పలువురు గాయపడటంతో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతారని స్థానికులు ఆశించారు. అయితే కూల్చివేతలు పరిమితంగానే సాగుతుండగా.. పక్కనే సిద్ధిక్‌నగర్‌లో సుమారు 8 నుంచి 10 నిర్మాణాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచి చూసే ధోరణి ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

శేరిలింగంపల్లి పరిధిలో అంజయ్యనగర్, అయ్యప్ప సొసైటీ, ఖానామెట్, 100 అడుగుల రోడ్డు తదితర ప్రాంతాల్లో నిర్మాణాలపై చాలాకాలంగా వివాదాలు ఉన్నాయి. నగరం విస్తరిస్తున్న కొద్దీ నిర్మాణాలు పెరుగుతున్నా.. వాటిపై పర్యవేక్షణ మాత్రం బలపడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నప్పుడే అడ్డుకోవాల్సిన యంత్రాంగం.. ఫిర్యాదులు, ప్రమాదాల తర్వాత స్పందిస్తుండటంతో సమస్య మరింత ముదురుతోందని స్థానికులు అంటున్నారు. అంజయ్యనగర్ విషాదం అధికారులకు చివరి హెచ్చరిక కావాలని వారు కోరుతున్నారు. సిద్ధిక్‌నగర్‌తో పాటు మాదాపూర్ సర్కిల్ పరిధిలోని వివాదాస్పద ప్రాంతాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. సిఎంసీ కమిషనర్ నుంచి జోనల్, సర్కిల్ స్థాయి అధికారుల వరకు బాధ్యతను స్పష్టం చేసి, నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. "మరో భవనం కూలి ప్రాణాలు పోయే వరకు వేచి చూడొద్దు" అని మాదాపూర్ వాసులు స్పష్టం చేస్తున్నారు.

# పేదలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం: కవిత

- సర్వే నంబర్ 151లో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి



మొయినాబాద్, ఆగస్టు 26 (జనంసాక్షి): న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా ఉంటుందని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం మొయినాబాద్ మున్సిపాలిటీలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె కార్యకర్తలతో మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని, రానున్న రోజుల్లో తమ ప్రభుత్వమే వస్తుందని, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా టీఆర్ఎస్ నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 151లో గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు కేటాయించిన 60 గజాల ఇంటి స్థలాల కోసం బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి, 62వ రోజుకు చేరిన దీక్షకు సంఘీభావం తెలిపారు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో కూరగాయల మార్కెట్ నిర్మించడం సరికాదని, రెండు నెలలుగా పేదలు దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే పేదల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నాయకులు కుమ్మరి శివశంకర్, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బేగరి రాజు, మహిళా విభాగం ఇన్‌చార్జి ఫైమీద పాషా, మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్వర్, మండల అధ్యక్షుడు బిక్షపతి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు నూర్ భాయ్, యూత్ అధ్యక్షుడు పవన్ కుమార్, భార్గవ్ రెడ్డి, సంగెరి నాగేష్, సంజీవ రెడ్డి, ముదిగొండ గణేష్తో పాటు పలువురు నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లాకు రైల్వే కారిడార్ సాధించుకుందాం

- అఖిలపక్ష ఆధ్వర్యంలో నిరసన



తుంగతుర్తి ఆగస్టు 26 (జనం సాక్షి) : సూర్యాపేట జిల్లాకు రైల్వే లైన్ సాధించుకుందామని బుధవారం మండల కేంద్రంలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు, సూర్యాపేట జిల్లా కి రైల్వే లైన్ వస్తుందని 50 సంవత్సరాలుగా సూర్యాపేట జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న తరుణంలో శంషాబాద్ టు చెన్నైకి సూర్యాపేట జిల్లా మీదగా బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ తీసుకొచ్చారని అన్నారు, సూర్యాపేట జిల్లాకి రైల్వే లైన్ వస్తుందని ఆనందపడ్డ జనాల కళ్ళల్లో కారం చల్లి మరో అలైన్మెంట్ తీసి హలియా,మిర్యాలగూడ మీదంగా చెన్నైకి తీసుకెళ్లడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు, ఏళ్ల తరబడి సూర్యాపేట జిల్లాకి రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని అనేక దపాలుగా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని బుల్లెట్ ట్రైన్ జాతీయ రహదారి 65 కి సమంతరంగా సూర్యాపేట మీదగా పోయే విధంగా, సూర్యాపేటలో కార్డినర్ ఏర్పాటు చేయాలని అన్నారు. సూర్యాపేట జిల్లా ప్రజల చిరకాల కోరికను నెరవేర్చి సూర్యాపేట జిల్లా అభివృద్ధికి తోడు పడాల్సిన అవసరం ఉంది అని అన్నారు ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తాటికొండ సీతయ్య, పెదబోయిన అజయ్ కుమార్, గాజుల మహేందర్, గుండె గాని రాములు గౌడ్, బొడ్డు శంకర్, బుర్ర శ్రీనివాస్, గుగులోతు రాజారాం, పోలా బోయిన కిరణ్ , మల్లె పాక సాయిబాబా, తాటి విజయమ్మ, నాగమల్లు , అంబటి రమేష్, పల్లా సుదర్శన్ సైదులు, మల్లేపక రవి, మట్టిపల్లి వెంకట్, పూర్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# విదేశీయుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన సైఫాబాద్ పోలీసులు

హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) : హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఓ విదేశీయుడిని సైఫాబాద్ పోలీసులు రక్షించారు. సచివాలయం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న సైఫాబాద్ పోలీసులు.. గమనించి తాడు సాయంతో విదేశీయుడిని రక్షించారు. ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి టోలిచౌకి పారామౌంట్ కాలనీలో నివాసం ఉంటున్న సుడాన్ దేశానికి చెందిన నాజర్ ఆడమ్ బడా వేగా (25) గుర్తించారు. విచారణ నిమిత్తం లేక్ పోలీసులకు అప్పగించారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలపై లేక్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

# మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం!

- రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఖమ్మం కార్పోరేషన్ 1, 59వ డివిజన్ ప్రాంతాల్లో పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు





ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 26(జనం సాక్షి) : పేదల సంక్షేమంతో పాటు కార్పోరేషన్ లో కలిసిన విలీన గ్రామాల సమగ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఒకట డివిజన్ కైకొండాయిగూడెం, 59వ డివిజన్ దానావాయి గూడెంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తో కలిసి పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కైకొండాయిగూడెంలో సుడా నిధులు రూ.కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, అనంతరం 59వ డివిజన్‌లో సుడా నిధులు రూ.112.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిందని, ఈ కాలంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన రెండున్నర సంవత్సరాల్లో కూడా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి, పేదింటి గుమ్మానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను చేర్చుతామని స్పష్టం చేశారు.

### రూ.12.83 కోట్లు మంజూరు..

కైకొండాయిగూడెం 1వ డివిజన్‌లో ఈరోజు శంకుస్థాపన చేసిన రూ.కోటి పనులతో కలిపి ఇప్పటివరకు సుమారు రూ.12.83 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంజూరు చేసి, అనేక పనులను పూర్తి చేశామని మంత్రి తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ ఏర్పడిన తర్వాత తక్కువ కాలంలో ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఒకటో డివిజన్ పరిధి విస్తృతంగా ఉండటంతో ఇంకా అనేక ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అవసరం ఉందన్నారు. డివిజన్‌లో మిగిలిన రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులను దశలవారీగా కేటాయించి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు డైట్ ఛార్జీలు పెంచడంతో పాటు, విద్యార్థినులకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం పెంచామని చెప్పారు. పేద పిల్లలు చదువులో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్లను, రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, కులం, మతం, రాజకీయాలకు ఎలాంటి తావు ఉండదని పేర్కొన్నారు. పేదల ఆత్మగౌరవంతో జీవించేందుకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అన్నారు. ఇప్పటికే చేపట్టిన సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, మిగిలిన ప్రాంతాల్లో అవసరమైన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Happy Anniversary
జనంసాక్షి 16వ వార్షికోత్సవం
నిర్మల్ జిల్లా ప్రత్యేక అనుబంధం
జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
27 ఆగస్టు 2026





# నేపాల్ బాధితుల కోసం హెల్ప్‌లైన్

**హైదరాబాద్, (జనంసాక్షి) :** నేపాల్‌లో ఆకస్మికంగా సంభవించిన భారీ వరదల్లో వందలాది మంది ప్రజలు గల్లంతైనట్లు వస్తున్న వార్తలపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వరదల్లో చిక్కుకున్న వారందరూ క్షేమంగా బయటపడాలని మంత్రి భగవంతుడిని ప్రార్థించారు. నేపాల్‌లో చిక్కుకున్న భారతీయుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, సమన్వయ కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి గుర్తు చేశారు. నేపాల్‌లో ఉన్న తెలంగాణకు చెందిన యాత్రికులు, పర్యాటకులు లేదా ఇతర వ్యక్తులతో సంప్రదింపులు జరపలేకపోతున్న కుటుంబ సభ్యులు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించి, సహాయం పొందవచ్చునని మంత్రి తెలిపారు.

**హెల్ప్‌లైన్ నంబర్లు:**

వందన (పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్, లైజన్ హెడ్)
మొబైల్: 9871999044
సి.హెచ్. చక్రవర్తి (పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌బి
మొబైల్: 9949351270
జి. రక్షిత్ నాయక్ (లైజన్ ఆఫీసర్)
మొబైల్: 9618597969









## పీఎంఎఫ్‌ఎంఈలో తెలంగాణకు జాతీయ గుర్తింపు

**హైదరాబాద్, (జనంసాక్షి) :** పీఎంఎఫ్‌ఎంఈ సీడ్ క్యాపిటల్ అమలులో తెలంగాణకు జాతీయ స్థాయిలో ప్రథమ రన్నరప్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ కాన్‌క్లేవ్-2026లో కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా సెర్ప్ సీఓఓ ఎన్.రజిత అవార్డును అందుకున్నారు. మహిళా సంఘాలకు సీడ్ క్యాపిటల్ అందించి ఆహార ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ రంగాల్లో ఆర్థికంగా ఎదిగేలా చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కిందని మంత్రి సీతక్క తెలిపారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, సీఓఓ ఎన్.రజితతో పాటు అధికారులు, సిబ్బందిని ఆమె అభినందించారు. మహిళలను స్వయం ఉపాధి నుంచి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఇందిరా మహిళా శక్తి లక్ష్యమని పేర్కొన్నారు.




























Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370